www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

ఆదివారం | 28-1-2024 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 64 సంచిక (Issue) : 283 | శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతరుతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: తదియ తె. 6.12 తదుపరి చవితి; నక్షత్రం: మఖ మ. 3.54 తదుపరి పుబ్బ; వర్జ్యం: రా. 12.55-2.43; దుర్ముహూర్తం: సా. 4.35-5.20; అమృతఘడియలు: మ. 1.12-3.00; రాహుకాలం: సా. 4.30-6.00; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.05 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి
స్పోర్ట్స్
విజయవాడ ● ఆదివారం 28 జనవరి 2024



రెండేళ్ల కిందట ఓ వీడియో మెసేజ్ విడుదల చేశా. అప్పటికి మ్యాచ్‌లు గెలవక ఐదు నెలలు అయింది. దాంతో రిటైర్మెంట్ ప్రకటించాల్సిన సమయం ఆసన్నమైందని భావించా. కానీ నాలో ఏదో శక్తి. దానికి పట్టుదల తోడై ఆ పయనం ఇప్పటిదాకా సాగింది. ఎడ్బెన్ రూపంలో అమోఘమైన భాగస్వామి లభించాడు. అతడి సహకారంతో ఈ ఘనత సాధించా. -బోపన్న

రోహన్ సాధించెన్!

డబుల్స్ చాంపియన్ బోపన్న ● పెద్ద వయస్సులో విజేతగా రికార్డు

ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న రోహన్ బోపన్న ఎట్టకేలకు సాధించాడు. డబుల్స్‌లో చాంపియన్‌గా నిలవాలన్న అతని స్వప్నం 43 ఏళ్ల లేటు వయసులో సాకారమైంది. నరాలు తెగే ఉత్కంఠ నడుమ ఫైనల్ సాగినా ఈ వెటరన్ స్టార్ వెరవలేదు..పోరాట స్ఫూర్తికి మారుపేరైన రోహనే అంతిమంగా విజేతగా నిలిచాడు..ఆస్ట్రేలియన్ ఓపెన్ డబుల్స్ చాంపియన్‌షిప్ దక్కించుకోవడం ద్వారా పలు రికార్డులను సొంతం చేసుకున్నాడు..

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆసాంతం అదరగొట్టిన రోహన్ బోపన్న టోర్నీకి అద్భుత ముగింపునిచ్చాడు. ఆస్ట్రేలియా ఆటగాడు మాథ్యూ ఎడ్బెన్ జతగా బరిలోకి దిగిన బోపన్న..డబుల్స్ టైటిల్‌ను అందుకున్నాడు. శనివారం హోరాహోరీగా జరిగిన ఫైనల్లో రెండో సీడ్ బోపన్న/ఎడ్బెన్ జోడీ 7-6 (0), 7-5తో ఇటలీ ద్వయం సిమోన్ బొలెలి/ఆండ్రియా వవసోరిపై విజయం సాధించింది. తద్వారా ఓపెన్ ఎరా (1968 నుంచి) పురుషుల విభాగంలో అత్యధిక వయస్సు (43 ఏళ్ల 329 రోజులు)లో గ్రాండ్‌స్లామ్ నెగ్గిన ప్లేయర్‌గా రోహన్ చరిత్ర సృష్టించాడు. ఈక్రమంలో జులియన్ రోజర్ (40 ఏళ్ల 270 రో.) పేరిట ఉన్న రికార్డును బద్దలుగొట్టాడు. అలాగే గ్రాండ్‌స్లామ్‌లో పురుషుల డబుల్స్ చాంపియన్‌గా నిలిచిన మూడో భారత ప్లేయర్‌గా బోపన్న మరో రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. గతంలో లియాండర్ పేస్/మహేశ్ భూపతి పురుషుల్లో, సానియా మీర్జా మహిళల్లో గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించారు. ఇక బోపన్నకిది రెండో గ్రాండ్‌స్లామ్ కావడం విశేషం. డబ్రోవస్కీ (కెనడా)తో కలిసి 2017లో ఫ్రెంచ్ ఓపెన్ మిక్స్‌డ్ టైటిల్‌ను గెలిచాడు. ఇక గంటా 39 ని. జరిగిన టైటిల్‌పోరులో ఒకే ఒక సర్వీస్ బ్రేక్ చోటుచేసుకోవడం గమనార్హం. రెండో సెట్ 11వ గేమ్‌లో 'లవ్' వద్ద వవసోరి తన సర్వీస్‌ను చేజార్చుకున్నాడు. నువ్వా..నేనా అన్నట్టు సాగిన మొదటి సెట్ టైబ్రేకర్‌కు వెళ్లింది. అయితే టైబ్రేకర్‌లో ప్రత్యర్థికి మ రో అవకాశం ఇవ్వకుండా రోహన్/ఎడ్బెన్ జోడీ జయకేతనం ఎగుర వేసింది. రెండో సెట్‌లో ఇటలీ ద్వయం మరింత పోరాడడంతో ఈ సెట్‌కూడా రసవత్తరంగా మారింది. కానీ అంతిమంగా రోహన్ జోడీనే విజయం వరించింది.

సోమవారం ప్రకటించే వరల్డ్ ర్యాంకింగ్స్ డబుల్స్ కేటగిరిలో రోహన్ బోపన్న నెం.1 ర్యాంక్‌కు చేరనున్నాడు. 43 ఏళ్ల వయస్సులో టాప్ ర్యాంక్ కైవసం చేసుకోనున్న ఆటగాడిగా మరో ఘనత సాధించనున్నాడు.

పురుషుల సింగిల్స్ ఫైనల్
మెద్వెదెవ్ X సిన్నర్
మ. 2 గం.నుంచి సోనీ నెట్‌వర్క్‌లో...



సబలెంక

సబలెంక రెండోసారి..

బెలారస్ భామ అరైనా సబలెంక మహిళల సింగిల్స్ టైటిల్‌ను వరుసగా రెండోసారి గెలిచింది. ఏకపక్షంగా సాగిన ఫైనల్లో రెండో సీడ్ సబలెంక 6-3, 6-2తో 12వ సీడ్ జెంగ్ క్విన్‌వెన్ (చైనా)ను చిత్తు చేసింది. తొలి సెట్‌లో 5-1తో సబలెంక తిరుగులేని స్థితిలో నిలిచినా ఏడో గేమ్‌లో జెంగ్ కాసింత పోరాడింది. కానీ ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా సబలెంక ఆ సెట్‌ను నెగ్గింది. ఇక రెండో సెట్‌లో ముఖ్యంగా అద్భుతమైన సర్వీస్‌తో మరింత విజృంభించిన అరైనా..సెట్‌ను ఇంకా సునాయాసంగా నెగ్గింది.

దీప్ గ్రేస్ రిటైర్మెంట్



న్యూఢిల్లీ: భారత మహిళల హాకీ డిఫెండర్ దీప్ గ్రేస్ ఎక్కా అంతర్జాతీయ కెరీర్‌కు వీడ్కోలు పలికింది. 2016 రియో, 2021 టోక్యో ఒలింపిక్స్‌లో దేశానికి ప్రాతినిధ్యం వహించిన 29 ఏళ్ల ఎక్కా పెనాల్టీ కార్నర్ స్పెషలిస్ట్‌గానూ పేరు తెచ్చుకుంది. 2011లో అరంగేట్రం చేసిన ఎక్కా 268 మ్యాచ్‌ల్లో 24 గోల్స్ చేసింది.

ఆస్ట్రేలియా లక్ష్యం 216

బ్రిస్బేన్: ఆస్ట్రేలియా, వెస్టిండీస్ మధ్య రెండో టెస్ట్ (డే/నైట్) రసవత్తరంగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 13/1తో శనివారం రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన విండీస్ 193 పరుగులకు ఆలౌటైంది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం 22 రన్స్‌తో కలిపి మొత్తం 216 పరుగుల లక్ష్యాన్ని ఆస్ట్రేలియా ముందుంచింది. ఛేదనలో మూడో రోజు ఆట నిలిచే సమయానికి ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 60/2 స్కోరు చేసింది. విజయానికి ఆసీస్ ఇంకా 156 పరుగుల దూరంలో ఉంది.



అటా..ఇటా

పోప్ శతక పోరాటం ● రసవత్తరంగా తొలి టెస్టు

ఇంగ్లండ్‌కు 126 పరుగుల ఆధిక్యం

రెండో ఇన్నింగ్స్ 316/6 ● భారత్ మొదటి ఇన్నింగ్స్ 436

స్కోరుబోర్డు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 246 ఆలౌట్
భారత్ తొలి ఇన్నింగ్స్: జైస్వాల్ (సి అండ్ బి) రూట్ 80; రోహిత్ (సి) స్టోక్స్ (బి) లీచ్ 24; గిల్ (సి) డకెట్ (బి) హార్ట్‌లీ 23; రాహుల్ (సి) రెహాన్ (బి) హార్ట్‌లీ 86; శ్రేయాస్ (సి) హార్ట్‌లీ (బి) రెహాన్ 35; జడేజా (ఎల్బీ) రూట్ 87; భరత్ (ఎల్బీ) రూట్ 41; అశ్విన్ (రనౌట్) 1; అక్షర్ (బి) రెహాన్ 44; బుమ్రా (బి) రూట్ 0; సిరాజ్ (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 121 ఓవర్లలో 436 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-80, 2-123, 3-159, 4-223, 5-288, 6-356, 7-358, 8-436, 9-436, 10-436; **బౌలింగ్:** ఉడ్ 17-1-47-0; హార్ట్‌లీ 25-0-131-2; లీచ్ 26-6-63-1; రెహాన్ 24-4-105-2; రూట్ 29-5-79-4.
ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (సి) రోహిత్ (బి) అశ్విన్ 31; డకెట్ (బి) బుమ్రా 47; పోప్ (బ్యాటింగ్) 148; రూట్ (ఎల్బీ) బుమ్రా 2; బెయిర్‌స్టో (బి) జడేజా 10; స్టోక్స్ (బి) అశ్విన్ 6; ఫోక్స్ (బి) అక్షర్ 34; రెహాన్ (బ్యాటింగ్) 16; **ఎక్స్‌ట్రాలు: 22; మొత్తం: 77 ఓవర్లలో 316/6; వికెట్ల పతనం:** 1-45, 2-113, 3-117, 4-140, 5-163, 6-275; **బౌలింగ్:** బుమ్రా 12-3-29-2; అశ్విన్ 21-3-93-2; అక్షర్ 15-2-69-1; జడేజా 26-1-101-1; సిరాజ్ 3-0-8-0.

1 ఒకే ఇన్నింగ్స్‌లో ముగ్గురు భారత బ్యాటర్లు (జైస్వాల్, రాహుల్, జడేజా) 80ల్లో అవుట్ కావడం ఇదే తొలిసారి.

2 టెస్టుల్లో రెండో ఉత్తమ ప్రదర్శన (4/79) కనబర్చిన రూట్. గతంలో భారత్‌పైనే 8 రన్స్‌కే ఐదు వికెట్లు తీశాడు.



ఒలీ పోప్ (148 బ్యాటింగ్)

హైదరాబాద్: తొలి ఇన్నింగ్స్‌లో భారత ఆధిక్యం 190.. బౌలర్ల ప్రతాపంతో ఇంగ్లండ్‌ను చుట్టేయడానికి ఈ మాత్రం స్కోరు సరిపోతుందిలే అని అంతా భావించారు. కానీ మైదానంలో జరిగింది వేరు.. పిచ్ బ్యాటింగ్‌కు అంతగా అనుకూలించకపోయినా.. ఒల్లీ పోప్ (148 బ్యాటింగ్) తన కెరీర్‌లోనే చిరస్మరణీయ ఇన్నింగ్స్‌తో అజేయ శతకం సాధించాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా మరో ఎండ్‌లో పట్టుదలగా ఆడి జట్టుకు 126 పరుగుల ఆధిక్యం అందించాడు. తద్వారా తమ జట్టు విజయంపైనా ఆశలు రేకెత్తిస్తూ మ్యాచ్‌ను రసవత్తరంగా మార్చేశాడు. శనివారం మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 77 ఓవర్లలో 6 వికెట్లకు 316 పరుగులు సాధించింది. క్రీజులో పోప్‌తో పాటు రెహాన్ అహ్మద్ (16 బ్యాటింగ్) ఉన్నాడు. బెన్ డకెట్ (47), ఫోక్స్ (34), క్రాలే (31) పర్వాలేదనిపించారు. బుమ్రా, అశ్విన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఇక ఆదివారం ఆటలో కొత్త బంతితో భారత బౌలర్లు చెలరేగితేనే ఫలితం ఉంటుంది. అటు ఇంగ్లండ్ తమ ఆధిక్యానికి మరో 45-50 పరుగులు జోడిస్తే భారత్‌కు కష్టాలు తప్పవు. అంతకుముందు భారత్ ఓవర్‌నైట్ స్కోరు 421/7కు మరో 15 పరుగులే జత చేయగలిగింది. జడేజా (87), బుమ్రా (0)లను రూట్ ఒకే ఓవర్‌లో అవుట్ చేయగా, అక్షర్ (44)ను రెహాన్ దెబ్బతీశాడు. ఒక్క పరుగు కూడా చేయకుండానే ఈ వికెట్లన్నీ పడడం గమనార్హం. దీంతో జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 436 పరుగులకు ఆలౌటైంది. రూట్‌కు నాలుగు, రెహాన్, హార్ట్‌లీకి రెండేసి వికెట్లు దక్కాయి.

అదిరే ఆరంభం: తొలి గంటలోపే భారత్ ఇన్నింగ్స్‌ను ముగించిన ఇంగ్లండ్ 190 పరుగుల లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. తిరిగి బజ్‌బాల్‌నే నమ్ముకున్న జట్టు వేగంగా పరుగులు సాధించింది. ఓపెనర్లు క్రాలే, డకెట్ స్వీప్ షాట్లతో చెలరేగి ఓవర్‌కు 5 రన్‌రేట్ చొప్పున మొదటి వికెట్‌కు 45 పరుగులు జోడించారు. క్రాలేను అశ్విన్ అవుట్ చేయగా.. డకెట్‌కు జత కలిసిన పోప్ భారత బౌలర్లను విసిగించాడు. రివర్స్ స్వీప్‌లతో స్పిన్నర్లపై ఒత్తిడి పెంచాడు. ఇక రెండో సెషన్‌లో ఇంగ్లండ్ తడబడడంతో నాలుగు వికెట్లు కోల్పోయింది. ఆరంభంలోనే డకెట్‌ను బుమ్రా బౌల్డ్ చేయడంతో రెండో వికెట్‌కు 57 బంతుల్లోనే 68 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అలాగే తన తర్వాతి ఓవర్‌లోనే రూట్ (2)ను సైతం ఎల్బీగా పెవిలియన్‌కు చేర్చాడు. బెయిర్‌స్టో (10) కెప్టెన్ స్టోక్స్(6) కూడా ఎలాంటి ప్రభావమూ చూపలేక వెనుదిరగడంతో ఇక ఇంగ్లండ్‌కు కష్టాలే అనిపించింది.

పోప్, ఫోక్స్ శతక భాగస్వామ్యం: 163/5 స్కోరుతో పీకల్లోతు కష్టాల్లో పడిన వేళ.. పోప్ మొండి పట్టుదలకు కీపర్ ఫోక్స్ నుంచి సహకారం అందింది. చెత్త బంతులను ఫోర్లుగా మలుస్తూ 48వ ఓవర్‌లో స్కోరును సమం చేశారు. వికెట్‌ను కాపాడుకుంటూనే ఆధిక్యాన్ని పెంచే ప్రయత్నం చేశారు. స్పిన్నర్లు జడేజా, అక్షర్ ఓవర్లలో పోప్ బౌండరీలతో పరుగులు రాబట్టాడు. 61వ ఓవర్‌లో పోప్ అద్భుత శతకాన్ని పూర్తి చేసుకున్నాడు. అయితే ఆరో వికెట్‌కు 112 పరుగుల భారీ భాగస్వామ్యం జత చేరాక ఫోక్స్‌ను అక్షర్ తక్కువ ఎత్తుతో వేసిన బంతితో బౌల్డ్ చేసి కాస్త రిలీఫ్ ఇచ్చాడు. అటు రెహాన్‌ను అండగా పోప్ తమ జట్టు ఆధిక్యాన్ని వంద దాటించడంతోపాటు స్కోరును సైతం 300కి చేర్చాడు. అదే ఆత్మవిశ్వాసంతో ఇద్దరూ మరో వికెట్ కోల్పోకుండా చక్కటి ఆధిక్యంతో మ్యాచ్‌ను ముగించారు.

ఆ క్యాచ్ పట్టి ఉంటే..

మూడో రోజు ఆటలో భారత బౌలర్లకు ఒల్లీ పోప్ కొరకరాని కొయ్యగా మారాడు. చూస్తుండగానే జట్టుకు భారీ ఆధిక్యం అందించే దిశగా దూసుకెళ్తున్నాడు. అయితే తను 110 రన్స్ వద్దే అవుట్ కావాల్సింది. జడేజా వేసిన ఇన్నింగ్స్ 64వ ఓవర్ మూడో బంతిని రివర్స్ స్వీప్‌తో ఫోర్ బాదాడు. తర్వాతి బంతిని సైతం అదే రీతిన ఆడగా బ్యాక్‌వర్డ్ స్క్వేర్‌లో అక్షర్ గాల్లోకి ఎగిరి అందుకునే ప్రయత్నం చేసినా బంతి అతడి చేతుల్లోనుంచి జారడంతో పోప్ బతికిపోయాడు.

ఖేలో ఇండియాలో ఆంధ్రకు 3 పతకాలు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. శనివారం చెన్నైలో జరిగిన ఈ పోటీల్లో ఆంధ్ర ప్లేయర్లు మూడు పతకాలు సాధించారు. వెయిట్ లిఫ్టింగ్‌లో బాలికల 57 కిలోల విభాగంలో వి.సుస్మిత పసిడితో మెరవగా, బాలుర 73 కిలోల విభాగంలో ఎస్.మహేశ్ స్వర్ణం సాధించాడు. ఇక, స్విమ్మింగ్‌లో బాలుర 200 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో జి.సంపత్ కుమార్ యాదవ్ కాంస్య పతకం నెగ్గాడు.

రిథమ్ జోడీకి స్వర్ణం

ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్

కైరో (ఈజిప్ట్): ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో రిథమ్ సంగ్వాన్ జోడీ భారత్‌కు తొలి స్వర్ణం అందించింది. శనివారం జరిగిన 10 మీ. ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ ఫైనల్లో రిథమ్-ఉజ్వల్ మాలిక్ జంట 17-7తో ఆర్మేనియాకు చెందిన ఎల్మిరా-బెనిక్‌పై గెలిచింది. ఇక 10 మీ. ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్‌లో సోనమ్-అర్జున్ బబుటా జంట రజతం దక్కించుకొంది.

క్వార్టర్ ఫైనల్లో శ్రీజ



గోవా: వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కంటెండర్ పోటీల్లో హైదరాబాద్ అమ్మాయి ఆకుల శ్రీజ క్వార్టర్ ఫైనల్లో ప్రవేశించింది. శనివారం జరిగిన ప్రీక్వార్టర్స్ పోరులో శ్రీజ తనకంటే మెరుగైన ర్యాంకర్ డు హోయ్ కిమ్‌పై 3-1తో గెలిచింది. ఇక, మనికా బాత్రా, అర్చనా కామత్ నిష్క్రమించారు.

గుకేష్, ప్రజ్ఞానంద గేమ్ డ్రా

విజ్క్ ఆన్ జీ (నెదర్లాండ్స్): టాటా స్టీల్ మాస్టర్స్ టోర్నీలో ప్రజ్ఞానంద, గుకేష్ మధ్య గేమ్ డ్రాగా ముగిసింది. శనివారం జరిగిన 12వ రౌండ్ గేమ్‌లో 40 ఎత్తుల అనంతరం గుకేష్, ప్రజ్ఞానంద పాయింట్ పంచుకొన్నారు. దీంతో 12 రౌండ్ల నుంచి గుకేష్ 7.5 పాయింట్లతో సంయుక్తంగా టాప్‌లో ఉండగా.. ప్రజ్ఞానంద 7 పాయింట్లతో ఆరో స్థానంలో ఉన్నాడు.

విహారి 'డబుల్' మిస్

ఆంధ్ర 431 ఆలౌట్	చత్తీస్‌గఢ్ 118/3

రాయ్‌పూర్: హనుమ విహారి (183) భారీ శతకంతో అదరగొట్టడంతో.. చత్తీస్‌గఢ్‌తో రంజీ మ్యాచ్‌లో ఆంధ్ర పట్టు బిగించింది. ఆటకు రెండో రోజు ఓవర్‌నైట్ స్కోరు 277/4తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన ఆంధ్ర 431 పరుగులకు ఆలౌటైంది. విహారి కొద్దిలో డబుల్ సెంచరీ మిస్సయ్యాడు. శశికాంత్ (42), గిరినాథ్ (36) వేగంగా ఆడారు. రవి కిరణ్ 7 వికెట్లు పడగొట్టాడు. అనంతరం చత్తీస్‌గఢ్ తొలి ఇన్నింగ్స్‌లో 118/3 స్కోరు చేసింది. శనివారం ఆట ముగిసే సమయానికి సంజీత్ దేశాయ్ (12), అమన్‌దీప్ (28) క్రీజులో ఉన్నారు. ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ స్కోరుకు చత్తీస్‌గఢ్ ఇంకా 313 పరుగులు వెనుకంజలో ఉంది. కాగా, ప్లేట్ గ్రూప్‌లో హైదరాబాద్ ఇన్నింగ్స్ 187 పరుగుల తేడాతో అరుణాచల్ ప్రదేశ్‌ను చిత్తు చేసింది.

హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో 74 శాతానికి జీఎంఆర్ వాటా

మలేషియా కంపెనీ నుంచి తాజాగా 11% వాటా కొనుగోలు
డీల్ విలువ రూ.830 కోట్లు

న్యూఢిల్లీ: హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో జీఎంఆర్ గ్రూప్ తన వాటాను మరో 11 శాతం పెంచుకుంది. దాంతో జీఎంఆర్ వాటా 63 శాతం నుంచి 74 శాతానికి పెరిగింది. మలేషియా ఎయిర్‌పోర్ట్ హోల్డింగ్స్ బెర్హాద్ (ఎంఏహెచ్‌బీ) గ్రూప్ నుంచి ఈ వాటాను 10 కోట్ల డాలర్లకు (రూ.830 కోట్లు) చేజిక్కించుకుంది. దీంతో హైదరాబాద్ విమానాశ్రయం నుంచి మలేషియా గ్రూప్ పూర్తిగా వైదొలిగినట్లయిందని జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్ ఇన్‌ఫ్రా లిమిటెడ్ తెలిపింది. జీఎంఆర్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్)లో 11 శాతం వాటా కొనుగోలుకు సంబంధించి ఎంఏహెచ్‌బీ, అనుబంధ సంస్థ ఎంఏహెచ్‌బీ (మారిషస్) ప్రైవేట్ లిమిటెడ్‌తో జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్) గత ఏడాది అక్టోబరు 25న షేర్ పర్చేజ్ ఒప్పందం కుదుర్చుకుంది. కాగా, హైదరాబాద్ విమానాశ్రయంలోని మిగతా 26 శాతం వాటాలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ), తెలంగాణ ప్రభుత్వం చెరో 13 శాతం కలిగి ఉన్నాయి.

మజూరీ చార్జీలపై 50% తగ్గింపు: జోయాలుక్కాస్

హైదరాబాద్: ప్రముఖ జువెలరీ బ్రాండ్ జోయాలుక్కాస్.. వినియోగదారుల కోసం ప్రత్యేక ఆఫర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందులో భాగంగా అన్ని రకాల జువెలరీపై మజూరీ చార్జీల్లో (వీ.ఏ) ఫ్లాట్ 50 శాతం తగ్గింపును ఇస్తున్నట్లు ప్రకటించింది. బంగారం, వజ్రాలు, ప్రీషియస్ స్టోన్స్, వెండి సహా విస్తృత శ్రేణి ఆభరణాలకు ఈ ప్రత్యేక ఆఫర్ వర్తిస్తుందని జోయాలుక్కాస్ తెలిపింది. వినియోగదారులకు సాటిలేని జువెలరీ షాపింగ్ అనుభవాన్ని అందించాలన్న ఉద్దేశంతో వీ.ఏపై 50 శాతం తగ్గింపును ప్రకటించినట్లు జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ జోయ్ అలుక్కాస్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని జోయాలుక్కాస్ షోరూమ్‌ల్లో ఫిబ్రవరి 18 వరకు ఈ ప్రత్యేక ఆఫర్ అందుబాటులో ఉంటుందని ఆయన వెల్లడించారు. అలాగే వినియోగదారులకు ప్రతి కొనుగోలుపై ఉచిత జీవిత కాలం నిర్వహణ, ఏడాది ఉచిత బీమా, బైబ్యాక్ హామీ సహా మరికొన్ని అదనపు ప్రయోజనాలను అందిస్తున్నట్లు జోయాలుక్కాస్ తెలిపింది.

ఫ్లిప్‌కార్ట్ బోర్డు నుంచి బిన్నీ బన్సల్ ఎగ్జిట్

న్యూఢిల్లీ: ప్రముఖ ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్ ఫ్లిప్‌కార్ట్ వ్యవస్థాపకుల్లో ఒకరైన బిన్నీ బన్సల్ కంపెనీ బోర్డు నుంచి వైదొలిగారు. దాంతో ఫ్లిప్‌కార్ట్‌లో బిన్నీ బన్సల్ 16 ఏళ్ల ప్రస్థానానికి తెరపడినట్లైంది. బన్సల్ కొద్ది నెలలక్రితమే ఫ్లిప్‌కార్ట్‌లో తనకున్న అతి స్వల్ప వాటాను విక్రయించాడు. అంతేకాదు, ఈ మధ్యనే ఆయన ఆప్‌డోర్ పేరుతో ఈ-కామర్స్ కంపెనీలకు ఎండ్ టు ఎండ్ సొల్యూషన్స్ అందించే స్టార్టప్‌ను ప్రారంభించారు. ఈ-కామర్స్ రంగంలోనే కొత్త స్టార్టప్ ప్రారంభించడంతో పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు దారితీయవచ్చన్న కారణంగానే బిన్నీ బన్సల్ ఫ్లిప్‌కార్ట్ నుంచి పూర్తిగా బయటికి వచ్చినట్లు తెలిసింది. కాగా, 2018లో ప్రపంచ రిటైల్ దిగ్గజం వాల్‌మార్ట్ ఫ్లిప్‌కార్ట్‌లో మెజారిటీ వాటాను 1,600 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసింది.

మధ్యంతర బడ్జెట్‌పై గంపెడాశలు



వృద్ధికే పెద్ద పీట వేయాలని ఇండియా ఇంక్ విజ్ఞప్తి

'వచ్చేది మధ్యంతర బడ్జెట్. ఈ బడ్జెట్‌లో అద్భుత ప్రకటనలు ఏమీ ఉండవు. కాబట్టి పెద్దగా ఆశలు పెట్టుకోకండి' అని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇప్పటికే ప్రకటించారు. అయినా కార్పొరేట్ రంగం ఈ బడ్జెట్‌పైనా గంపెడాశలు పెట్టుకుంది. జీడీపీ వృద్ధి రేటును మరింత పరుగులు పెట్టించేందుకు పన్ను రాయితీలతో పాటు దేశీయ తయారీకి ప్రోత్సాహం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి మరిన్ని నిధులు, మరిన్ని సామాజిక సంక్షేమ పథకాలు ప్రకటించాలని కోరుతోంది. వచ్చే కొద్ది సంవత్సరాల్లో భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే 'మధ్యంతర' బడ్జెట్‌లోనూ కేంద్ర ఆర్థిక మంత్రి కొన్ని చర్యలు తీసుకోకతప్పదని పారిశ్రామిక వర్గాల వాదన. పెట్టుబడులకు పెద్దపీట వేస్తూనే ద్రవ్య లోటు అదుపు తప్పకుండా చూడడం ఆర్థిక మంత్రి ముందున్న అతి పెద్ద సవాల్ అని పేర్కొన్నాయి.

మరిన్ని రంగాలకు పీఎల్ఐ

దేశంలో అధునాతన తయారీ పరిశ్రమలను ప్రోత్సహించేందుకు ప్రత్యేక జాతీయ మిషన్ ఏర్పాటు చేయాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) తన బడ్జెట్ కోరికల చిట్టాలో ప్రభుత్వాన్ని కోరింది. దీనికి తోడు దేశంలో భారీ ఉపాధి అవకాశాలకు దోహదం చేసే దుస్తులు, ఆటబొమ్మలు, పాదరక్షల తయారీ రంగాలకూ పీఎల్ఐ పథకం విస్తరించాలని విజ్ఞప్తి చేసింది. ఉత్పాదక వస్తువులు, రసాయనాల దిగుమతులను తగ్గించే పరిశ్రమలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ప్రకటించాలని కోరింది. మరో పారిశ్రామిక, వాణిజ్య సంఘాల సమాఖ్య ఫిక్కీ మాత్రం వచ్చే మధ్యంతర బడ్జెట్‌లో భౌతిక, సామాజిక, డిజిటల్ మౌలిక సదుపాయాల కోసం ప్రభుత్వ పెట్టుబడులు మరింత పెంచాలని కోరింది.

సుంకాల పోటు తగ్గించండి

భారత్‌లో తయారీ అని ఎంతగా మొత్తుకుంటున్నా, మన దేశంలో వైద్య పరీక్షల కోసం ఉపయోగించే పరికరాల్లో ఇప్పటికీ 60 శాతం దిగుమతులే శరణ్యం. ఈ దిగుమతులపై విధిస్తున్న సుంకాలతో వాటి దిగుమతి ఖర్చులు తడిచి మోపెడవుతున్నాయి. దేశీయ ఉత్పత్తి ఒక స్థాయికి చేరేవరకైనా ఈ సుంకాలను సముచిత స్థాయికి తగ్గించాలని మెడికల్ టెక్నాలజీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎంటాల్) చైర్మన్ పవన్ చౌదరి ఆర్థిక మంత్రి సీతారామన్‌ను కోరారు. లేకపోతే సామాన్యుడికి సైతం చౌకగా వైద్య సేవలు అందించేందుకు ఉద్దేశించిన 'ఆయుష్మాన్ భారత్' వంటి ప్రభుత్వ పథకాలు నీరుగారి పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

మరిన్ని పన్ను ప్రోత్సాహకాలు.

కాగా ఈసారి బడ్జెట్లో పన్ను మినహాయింపు పరిమితి పెంపు, మహిళా పారిశ్రామికవేత్తలకు మద్దతు, దీర్ఘకాలిక పన్ను విధానంతో పాటు వినియోగం, పొదుపు పెంచేందుకు చర్యలను ప్రకటించవచ్చని విశ్లేషకుల అంచనా. అంతేకాదు, కార్పొరేట్ కంపెనీలు, భాగస్వామ్య సంస్థలు, లిమిటెడ్ లయబిలిటీ పార్ట్‌నర్‌షిప్స్ (ఎల్ఎల్‌పీ)పై సమానంగా పన్ను విధించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఐసీఐసీఐ ప్రు బిజినెస్ సైకిల్ ఫండ్ అదుర్స్

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్‌కు చెందిన ఈక్విటీ ఆధారిత ఫండ్ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ బిజినెస్ సైకిల్ ఫండ్ ప్రారంభించిన స్వల్పకాలంలోనే మదుపరులకు మంచి రిటర్నులను అందించింది. 2021 జనవరి 18న ప్రారంభమైన ఈ ఫండ్ ఏటా సుమారు 24.96 శాతం రిటర్నులను ఇచ్చింది. ఫండ్ ప్రారంభ సమయంలో రూ.లక్ష పెట్టుబడిగా పెట్టి ఉంటే ప్రస్తుతం దీని విలువ రూ.1.93 లక్షలకు పెరిగింది. అదే సిప్ రూపంలో నెలకు రూ.10,000 చొప్పున పెట్టుబడిగా (మొత్తం రూ.3.6 లక్షలు) పెడితే ఏటా 26.8 శాతం వృద్ధితో ప్రస్తుతం ఇది రూ.5.23 లక్షలకు చేరుకుందని వివరించింది. మరోవైపు గత ఏడాదిలో ఈ ఫండ్ ఏకంగా 32.86 శాతం రిటర్నులు అందించటం గమనార్హం. ప్రస్తుతం ఈ ఫండ్ ఏయూఎం రూ.7,616 కోట్లుగా ఉంది. ఈ ఫండ్ ప్రధానంగా బ్యాంక్స్, ఆటో కన్‌స్ట్రక్షన్, టెలికాం రంగాల్లో పెట్టుబడులు పెట్టింది. వీటితో పాటు ఫార్మా, ఐటీ విభాగాల్లో కూడా పెట్టుబడులను కలిగి ఉంది. విదేశీ సెక్యూరిటీలకు ఈ ఫండ్ 4 శాతం పెట్టుబడులను కేటాయించింది.

బిజినెస్

భారీగా పెరిగిన ఒలెక్ట్రా లాభం

ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో 22.28 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికం (రూ.12.97 కోట్లు)తో పోల్చితే లాభం 72 శాతం వృద్ధి చెందింది. త్రైమాసిక సమీక్షా కాలంలో మొత్తం ఆదాయం కూడా రూ.250.12 కోట్ల నుంచి రూ.334.65 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో మొత్తం వ్యయాలు కూడా రూ.232.82 కోట్ల నుంచి రూ.304.73 కోట్లకు పెరిగినట్లు కంపెనీ పేర్కొంది. కాగా కంపెనీ నాన్- ఎగ్జిక్యూటివ్, నాన్ ఇండిపెండెంట్ డైరెక్టర్ చిల్లప్పగారి లక్ష్మీ రాజం రాజీనామాను డైరెక్టర్ల బోర్డు ఆమోదించిందని, ఇది శనివారం నుంచే అమల్లోకి వచ్చిందని తెలిపింది.

దొడ్ల డెయిరీ లాభంలో 17 శాతం వృద్ధి

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో దొడ్ల డెయిరీ రూ.746.8 కోట్ల రెవెన్యూపై రూ.43.6 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం 10.6 శాతం (రూ.675.4 కోట్లు) వృద్ధి చెందగా లాభం 16.8 శాతం పెరిగింది. సమీక్షా కాలలో దేశీయ వ్యాపారం రూ.700.7 కోట్లుగా ఉండగా అంతర్జాతీయ వ్యాపారం రూ.46.1 కోట్లుగా ఉంది. త్రైమాసిక కాలంలో రోజుకు సగటున 17.5 లక్షల లీటర్ల పాలను సేకరించగా సగటు విక్రయాలు రోజుకు 10.7 లక్షల లీటర్లుగా ఉన్నట్లు కంపెనీ పేర్కొంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



27వ తేదీ			
హైదరాబాద్	540	విజయవాడ	540
28 జనవరి		విశాఖపట్నం	565
చిత్తూరు	573	వరంగల్	542
గోదావరి	540	దజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	107	గోదావరి	111
వరంగల్	107	విజయవాడ	111
కరీంనగర్	107	గుంటూరు	112
మహబూబ్‌నగర్	107	ఒంగోలు	112
కర్నూలు	107	చిత్తూరు	120
విశాఖపట్నం	108		

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
ఆదివారం | 28-1-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**

స్కెచ్ వేసి స్వాహా!

కాకినాడలో మరో టీడీఆర్ కుంభకోణం

- 4.67ఎకరాల పనికిరాని ప్రైవేటు భూమికి రూ.251కోట్లకు పైగా టీడీఆర్ బాండ్లు జారీ
- విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూసేకరణ
- చుట్టూ వందల ఎకరాల్లో ప్రభుత్వ భూములు
- అయినా వాటిని కాదని ప్రైవేటు వైపు మొగ్గు
- ఓ ప్రైవేటు వ్యక్తి నుంచి 4.67 ఎకరాల సేకరణ
- తీరానికి సమీపంలోని మోకాల్లోతు దిగే భూమి
- చక్రం తిప్పిన అధికార పార్టీ కీలక నేత
- కలెక్టర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేసిన టీడీపీ


కాకినాడలో టీడీఆర్ బాండ్లు జారీ అయిన ప్రైవేటు స్థలం ఇదే 8

నాటి బాణమే.. నేటి బల్లెం!

తాడేపల్లి ప్యాలెస్ వణుకుతోంది. పులి మీద పుట్రలా ఎన్నికల ముంగిట ఈ తలపోటు ఏమిటా? అని కలవరపడుతోంది. అధికారం ఉపయోగించి చంద్రబాబును, ఆయన దత్తపుత్రుడిని ముప్పుతిప్పలు పెడుతున్నామని సంతోషిస్తున్న వేళ, ఇంటిపోరు తలపోటుగా మారుతోందని ఆవేదన చెందుతోంది. 2019 తర్వాత తాడేపల్లి ప్యాలెస్ ఇంతలా వణకడం ఇప్పుడే అని అంతఃపుర భోగట్టా. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఇంతలా కలవరపాటుకు గురిచేస్తున్నది మరెవరో కాదు.. ఆయన సొంత చెల్లి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలనే.



...జగన్ నోటి నుంచి వస్తున్న ప్రతి మాటకూ షర్మిల కౌంటర్ ఇస్తున్నారు. దీంతో జగన్ శిబిరం ఆత్మరక్షణలో పడిపోయింది. తనకు వ్యతిరేకంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేతులు కలిపిన వేళ ఇంటిగుట్టు రచ్చకెక్కడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు.

...ముఖంలో అమాయకత్వాన్ని ప్రదర్శిస్తూ.. తాను మంచి చేస్తుంటే తన ప్రత్యర్థులందరూ ఏకమై తనని ఒంటరి వాడిని చేస్తున్నారని ప్రజలను నమ్మించి సానుభూతి పొందాలనుకున్న జగన్ ప్రయత్నాలకు షర్మిల గండికొడుతున్నారు.

...అందరూ కాకపోయినా చాలామంది అనుకుంటున్నట్టు జగన్ మంచివాడు కాదనీ, రాజశేఖర రెడ్డి కుటుంబం చీలిపోవడానికి అతడే కారణమని షర్మిల తేల్చిపడేశారు. ఇవాళో, రేపో 'హూ కిల్డ్ బాబాయ్?' అని కూడా ప్రశ్నించవచ్చు. రక్తం పంచుకుని పుట్టిన తనకు జగన్ రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని కూడా ఆమె పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. దోచుకోవడం, దాచుకోవడం మినహా ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచనే జగన్‌కు లేదనీ, రాష్ట్రంలో అభివృద్ధి కనుమరుగైందనీ, తమ తండ్రి రాజశేఖరరెడ్డి పాలనకు, జగన్ రెడ్డి పాలనకు పోలికే లేదనీ షర్మిల తేల్చిపారేశారు.

...నిజానికి జగన్‌రెడ్డి భార్య భారతీరెడ్డి ఈ వారంలో లండన్ వెళ్లాల్సి ఉంది. అయితే పార్టీలో అంతర్గత పోరుకు తోడు అంతఃపుర రహస్యాలను కూడా షర్మిల పూసగుచ్చినట్టు చెబుతూ రావడంతో భర్త జగన్‌కు ఈ పరిస్థితులలో తోడుగా ఉండడం కోసం ఆమె తన పర్యటనను రద్దు చేసుకున్నారు.

...వేట కుక్కల కంటే హీనమైన సోషల్ మీడియా సైన్యాన్ని, తనపై ఈగ వాలనివ్వని ఉన్మాద మూకను ఇప్పుడు రక్తం పంచుకు పుట్టిన షర్మిలపైకి ఉసిగొల్పారు. దీంతో ఆమె వ్యక్తిత్వ హననం ప్రారంభమైంది.

కొత్త పలుకు! -ఆర్కే విశ్లేషణ 2లో..

...ఇంటి పోరు ఇకపై ఏ మలుపులు తిరుగుతుందో తెలియదు. వివేకానంద రెడ్డి హత్య కేసు గురించి కూడా షర్మిల నోటి వెంట కొన్ని నిజాలు బయటకు రావొచ్చు. సోదరుడితో విభేదాలు ముదరడానికి ప్రధాన కారణం భారతీరెడ్డి అనే భావనలో షర్మిల గానీ, డాక్టర్ సునీత గానీ ఉన్నారు. వివేకా హత్య కేసులో అవినాశ్ రెడ్డి అరెస్టు కాకుండా తప్పించుకోగలిగారంటే అందుకు భారతీ రెడ్డి అండదండలే కారణమని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కడప లోక్‌సభ స్థానం నుంచి వివేకానంద రెడ్డి భార్యను కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీకి పెట్టాలని షర్మిల భావిస్తున్నారు. అవినాశ్ రెడ్డిని ఓడించే అవకాశం ఉన్నప్పుడే ఏ పార్టీ తరఫు నుంచైనా తన తల్లి సౌభాగ్యమ్మను పోటీ పెట్టడం మంచిదని, ఓడించే పరిస్థితి లేకపోతే పోటీకి దింపడం అనవసరం అని డాక్టర్ సునీత దంపతులు భావిస్తున్నట్టు తెలిసింది.

షర్మిల ఎఫెక్ట్...

దిమ్మ తిరిగి అమ్మ ఒడికి!

షర్మిల దెబ్బతో జగన్ మైండ్ బ్లాంక్

శరణు వేడుతూ విజయమ్మకు ఫోన్!

అమ్మా నువ్వే దిక్కంటూ వేడుకోలు

- తనకు అండగా ప్రచారానికి రావాలని విన్నపం
- కాదంటే ఓటమి, జైలు జీవితం తప్పవని గగ్గోలు
- దీన వచనాలతో కరిగిన కన్నతల్లి మనసు
- జగన్ తరఫున ప్రచారానికి వచ్చేందుకు ఓకే!
- షర్మిల అభ్యంతరం.. అయినా విజయమ్మ ముందుకే

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

చెల్లి షర్మిల కొట్టిన దెబ్బకు జగన్‌కు దిమ్మ తిరిగి అమ్మ గుర్తొచ్చింది. అన్యథా శరణం నాస్తి.. నువ్వే దిక్కంటూ శరణుజొచ్చేలా చేసింది. జనం ఈసడించుకుంటున్నా, ఓటమి ఖాయమని స్పష్టంగా తెలుస్తూనే ఉన్నా ఇన్నాళ్లూ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తూ వచ్చిన జగన్‌కు చెల్లి షర్మిల కోలుకోలేని షాక్ ఇస్తున్నారు. పీసీసీ పగ్గాలు చేపట్టిన దగ్గరి నుంచి ఆమె రోజు రోజుకూ డోస్ పెంచుకుంటూ పోతున్నారు. జగన్ అవినీతిని, ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడంతో పాటు దారుణమైన ఆయన నైజాన్ని ఆమె సూటిగా బయటపెడుతుండటంతో జగన్ కాళ్ల కింద భూమి కదులుతోంది. జగన్ నుంచి తాను ఏమీ ఆశించలేదని, ఆయనను ఏదీ కోరలేదని, అది నిజం కాకుంటే

మిగతా 11వ పేజీలో...







"పరిస్థితి ఏమీ బాలేదు. ప్రజా వ్యతిరేకత అనే అగ్నికి చెల్లి షర్మిల ఆజ్యం పోస్తోంది. నేను ఓడిపోతే జైలుకెళ్లాల్సి వస్తుంది. కేసుల్లో కచ్చితంగా శిక్ష పడే అవకాశం ఉంది. అదే జరిగితే మళ్లీ ఎప్పటికి బయటికొస్తానో తెలియదు. నా జీవితం జైలుకే అంకితమైపోతుంది. నువ్వు రావాల్సిందే.. నన్ను ఆదుకోవాల్సిందే"

-తల్లితో జగన్ దీనాలాపన!


అన్నమయ్య జిల్లా పీలేరులో జరిగిన 'రా..కదలిరా' బహిరంగ సభకు భారీగా హాజరైన జనం.. ప్రసంగిస్తున్న చంద్రబాబు

జగన్.. ఇక ఇంటికే!

మరో 74 రోజుల్లో రాష్ట్రానికి శని వదులుతుంది: బాబు

- ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారు
- నీకు అభ్యర్థులు కూడా దొరకడం లేదు
- ప్రకటించినవారూ పారిపోతున్నారు
- సీమ ప్రాజెక్టులకు ఎంత ఖర్చు చేశావు?
- సీఎం బాధితులంతా నాకు క్యాంపెయినర్లే
- అబద్ధాలు చెప్పడంలో జగన్ పీహెచ్‌డీ
- ఇప్పటికే ఓటమిని అంగీకరించాడు
- ఆయన స్వరంలో వచ్చిన మార్పే నిదర్శనం
- పులివెందులలోనూ మా విజయాన్ని ఆపలేరు
- పెద్దిరెడ్డీ.. ఇక ఎలా గెలుస్తావో చూస్తా
- టీడీపీ, జనసేన విజయం ఖాయం: బాబు

- జగన్ ఏం చదువుకున్నాడో నాకు తెలియదు. కళ్లు మూయకుండా, తడబడకుండా అబద్ధాలు చెప్పడంలో మాత్రం పీహెచ్‌డీ పట్టా పొందాడు.
- మంత్రి పెద్దిరెడ్డి బకాసురుడు. ఉదయం అల్పాహారంలో ఇసుక, మధ్యాహ్న భోజనంలో మైన్స్, రాత్రి భోజనంలో ఇరిగేషన్ ప్రాజెక్టులను మింగేస్తుంటాడు.
- నాకు వయసు అనేది ఒక నంబరే. రాబోయే 20 సంవత్సరాలకు ఏం చేయాలన్నది ఆలోచిస్తాను. 2047 నాటికి తెలుగు జాతిని ప్రపంచంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దడమే నా లక్ష్యం.

- పీలేరు, ఉరవకొండలో 'రా.. కదలిరా' బహిరంగ సభల్లో చంద్రబాబు

అనంతపురం/రాయచోటి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి పట్టిన శని మరో 74 రోజుల్లో వీడనుందని టీడీపీ అధినేత చంద్రబాబు వ్యాఖ్యానించారు. జగన్ 'సిద్ధం' అని చెప్పడం కాదని, ఆయన్ను దించేందుకు ప్రజలే సిద్ధంగా ఉన్నారని అన్నారు. రాష్ట్రమంతటా టీడీపీ, జనసేన కూటమి గాలి వీస్తోందని, విజయాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. శనివారం అన్నమయ్య జిల్లా పీలేరు, అనంతపురం జిల్లా ఉరవకొండలో జరిగిన రా.. కదలిరా బహిరంగ సభల్లో పాల్గొన్నారు. పీలేరు సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. 'జగన్.. ఇక నీకు 74 రోజులే. ఇప్పటికే నీ పనైపోయింది. నీ అరాచక పాలన చూసిన ప్రజలు వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతారు. నీకు ఓటు వేయకూడదని ఇప్పటికే నిర్ణయం తీసేసుకున్నారు. నీకు అభ్యర్థులు కూడా దొరకడం లేదు. నువ్వు ఎవరినైనా అభ్యర్థులుగా ప్రకటిస్తే వాళ్లు కూడా పారిపోతున్నారు. పులివెందులలోనూ

మిగతా 11వ పేజీలో...

వైసీపీలో వైఎస్సార్ లేరు!

వై అంటే వైవీ, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే రామకృష్ణారెడ్డి.. ఉన్నది వీరే


గుండ్లకమ్మ ప్రాజెక్టు వద్ద కొట్టుకు పోయిన గేటును చూపిస్తున్న పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల

- సొంతవాళ్లు అనుకుని పాదయాత్ర చేశా
- రక్తాన్ని చెమటగా మార్చి పార్టీని నిలబెట్టా
- అలాంటి నాపై ముప్పేట దాడి చేస్తున్నారు
- వైఎస్సార్ పాలనకు, జగనన్న పాలనకు నక్కకూ నాగలోకానికీ ఉన్నంత తేడా
- 8 లక్షల కోట్ల అప్పు సొమ్మును ఏం చేశావ్
- రాజధాని కట్టావా.. పోలవరం నిర్మించావా?
- బీజేపీకి బానిసగా మారి ప్రజలను బానిసలను చేశావ్!
- జగన్‌పై నిప్పులు చెరిగిన పీసీసీ చీఫ్ షర్మిల
- సజ్జలా.. నీకసలు సిగ్గుందా? అని ఆగ్రహం

నెల్లూరు/ఒంగోలు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): "వైసీపీలో ఇప్పుడు వైఎస్సార్ లేరు. వై అంటే వైవీ సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే సజ్జల రామకృష్ణారెడ్డిగా పార్టీ మారింది. ఆ ముగ్గురే నడిపిస్తున్నారు. సొంత వాళ్లు అనుకుని నాడు 3,800 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేశా. వైసీపీ జెండాను భుజాన వేసుకొని ఊరూవాడా తిరిగా. బిడ్డలను ఇంటి వద్ద వదిలేసి, రక్తాన్ని చెమటగా మార్చి, మనస్సు పెట్టి పనిచేశా. అలాంటి నాపై వైసీపీ నేతలు ముప్పేట దాడి చేస్తున్నారు" అని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల అన్నారు. "రాజశేఖరరెడ్డి వారసుడినంటూ జనం ముందుకొచ్చావు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పెట్టావు. మరి

మిగతా 10వ పేజీలో...


శనివారం ప్రత్యేక పూజలు చేస్తున్న నితీశ్

నేడు రాజీనామా.. ప్రమాణం!

బీజేపీ మద్దతుతో బిహార్ సీఎంగా 7వ సారి నితీశ్

- అమిత్‌షా, జేపీ నడ్డా హాజరయ్యే అవకాశం
- బీజేపీకి రెండు డిప్యూటీ సీఎంలు, స్పీకర్ పదవి
- నితీశ్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానించింది..
- ఇండియా కూటమి పొత్తు ముగిసింది: జేడీయూ
- పలుమార్లు ఫోన్ చేసినా నితీశ్ మాట్లాడలేదు: ఖర్గే

12

ఎమ్మెల్యేకు రూ. 25 కోట్లు

- బీజేపీ ఏడుగురిని కొనాలని చూసింది
- మద్యం స్కాంలో నన్ను అరెస్టు చేసి ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర: కేజ్రీ
- 'ఇండియా'లో ఆగని మంటలు.. మరింతగా అంతర్గత కుమ్ములాట
- 11 సీట్లే ఇస్తాం: అఖిలేశ్.. సీట్ల కోసమే కాంగ్రెస్ వల: డీఎంకే
- సయోధ్య కుదరని పని: మమత.. ఐక్యతకు కృషి చేస్తున్నాం: ఖర్గే

అక్రమాల తోటలో అవినీతి గులాబీ

- సరిహద్దు ప్రాంతం సంపాదనకు మంత్రం
- బియ్యం, మట్టి, ఇసుకలే అక్రమాల వనరులు
- ప్రభుత్వ కార్యాలయాల నుంచి ట్రస్టుకు సొమ్ము
- అధికారుల పోస్టింగులకు భారీ ముడుపులు
- వసూల్ రాజాలుగా అమాత్యుని సోదరులు
- రాయలసీమలో ఫైర్ బ్రాండ్ జబర్దస్త్



'అక్రమాల తోటలో అవినీతి గులాబీ'.. అని విపక్ష నాయకులు పిలుచుకునే ఎమ్మెల్యే కమ్ మహిళా మంత్రి కాదేదీ.. అన్నట్టు అవినీతిని అన్ని రంగాల్లోకీ విస్తరించేశారు. బియ్యం, మట్టి, ఇసుక సహా ఏది కనిపిస్తే అది ఆమెకు ఆదాయ వనరే. ఇద్దరు సోదరులు ఆమెకు కుడి ఎడమ భుజాలుగా సొమ్ములు పోగేస్తారు. దందాలు సాగిస్తారు. ఫైర్ బ్రాండ్ ముద్ర వేసుకున్న ఈ మహిళా మంత్రి ఎవరెన్ని అన్నా ఎదురు దాడితో నెగ్గేస్తారు.. ఆరోపణలను కొట్టేస్తారు!

అమ్మో ఎమ్మెల్యే

రాయలసీమలో ఈ మహిళా నేత ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గం.. తమిళనాడు రాష్ట్రానికి సమీపంలోనే ఉండడం.. ఆమె అవినీతి గుబాళింపులకు మాబాగా కలిసి వస్తోందని సొంత పార్టీ నేతలే అంటారు. ఇక్కడి వనరులను అక్కడికి తరలించేసి సొమ్ము చేసుకోవడంలో సిద్ధహస్తురాలిగా పేరొందారని చెబుతారు. ట్రస్టుకు సొమ్ముల నుంచి పోస్టింగుల సిఫారసుల వరకు దేన్నీ వదలకుండా దోచేస్తారు.. ఎక్కడివక్కడ దాచేస్తారు!

(చిత్తూరు-ఆంధ్రజ్యోతి)

రాయలసీమ జిల్లాల్లోని కీలకమైన నియోజకవర్గం అది. తమిళనాడు రాష్ట్రానికి సరిహద్దులో ఉంటుంది. ఈ నియోజకవర్గం నుంచి వైసీపీ తరఫున 2014, 2019 ఎన్నికల్లో ఈ మహిళా నేత పోటీ చేయగా, రెండుసార్లూ స్వల్ప మెజార్టీతోనే గెలుపు గుర్రం ఎక్కారు. ఆమె ఏం చదివారో తెలియదుకానీ.. సీఎం జగన్ కోసం నిత్యం ప్రతిపక్షాల మీద నోరేసుకుపడడంలో మాత్రం మాస్టర్ డిగ్రీ చేసేశారు. ఈ నియోజకవర్గం తమిళనాడు సరిహద్దులో ఉండడం ఆ నేత అవినీతికి అంతులేకుండా పోయిందని స్వపక్ష నేతలే

మిగతా 12వ పేజీలో...

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

• ఆర్కే RK



కొత్తపలుకు

నాటి బాణమే.. నేటి బల్లెం!

తాడేపల్లి ప్యాలెస్ వణుకుతోంది. పులి మీద పుట్రలా ఎన్నికల ముంగిట ఈ తలపోటు ఏమిటా? అని కలవరపడుతోంది. అధికారం ఉపయోగించి చంద్రబాబును, ఆయన దత్తపుత్రుడిని ముప్పుతిప్పలు పెడుతున్నామని సంతోషిస్తున్న వేళ, ఇంటిపోరు తలపోటుగా మారుతోందని ఆవేదన చెందుతోంది. 2019 తర్వాత తాడేపల్లి ప్యాలెస్ ఇంతలా వణకడం ఇప్పుడే అని అంతఃపుర భోగట్టా. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని ఇంతలా కలవరపాటుకు గురిచేస్తున్నది మరెవరో కాదు.. ఆయన సొంత చెల్లి, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిలనే. తెలంగాణలో సొంత పార్టీ ఏర్పాటు చేసుకుని రాజకీయ రణక్షేత్రంలో తేలిపోయిన షర్మిల, ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలోకి అడుగిడినా తమకు కలిగే నష్టం ఏమీ ఉండదని జగన్ అండ్ కో ఇప్పటిదాకా తలపోశారు. అయితే వారి అంచనాలకు భిన్నంగా షర్మిల ఇప్పుడు జగన్మోహన్ రెడ్డినే ప్రత్యేకంగా టార్గెట్ చేసుకుని విమర్శలు చేస్తున్నారు. చంద్రబాబు అండ్ కోను పెత్తందార్లుగా పోల్చుతూ పేదలను మభ్యపెట్టి లబ్ధి పొందాలనుకున్న జగన్‌కు ఇప్పుడు షర్మిల రూపంలో బెడద వచ్చిపడింది. ముఖ్యమంత్రి నైజాన్ని ఆమె పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. దీంతో ఆయన ఉలిక్కిపడుతున్నారు. ప్రస్తుత ఎన్నికల రణక్షేత్రంలో అన్నాచెల్లెలు నేరుగా తలపడుతున్నారు. జగన్ నోటి నుంచి వస్తున్న ప్రతి మాటకు షర్మిల కౌంటర్ ఇస్తున్నారు. దీంతో జగన్ శిబిరం ఆత్మరక్షణలో పడిపోయింది. తనకు వ్యతిరేకంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ చేతులు కలిపిన వేళ ఇంటిగుట్టు రచ్చకెక్కడాన్ని జగన్ జీర్ణించుకోలేకపోతున్నారు. పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే షర్మిల నేరుగా తనను ఎటాక్ చేస్తుందని జగన్ ఊహించలేదు. ముఖంలో అమాయకత్వాన్ని ప్రదర్శిస్తూ.. తాను మంచి చేస్తుంటే తన ప్రత్యర్థులందరూ ఏకమై తనని ఒంటరి వాడిని చేస్తున్నారని ప్రజలను నమ్మించి సానుభూతి పొందాలనుకున్న జగన్ ప్రయత్నాలకు షర్మిల గండికొడుతున్నారు. అందరూ కాకపోయినా చాలామంది అనుకుంటున్నట్టు జగన్ మంచివాడు కాదనీ, రాజశేఖర రెడ్డి కుటుంబం చీలిపోవడానికి అతడే కారణమని షర్మిల తేల్చిపడేశారు. ఇవాళో, రేపో 'హూ కిల్డ్ బాబాయ్?' అని కూడా ప్రశ్నించవచ్చు. రక్తం పంచుకుని పుట్టిన తనకు జగన్‌రెడ్డి చేస్తున్న ద్రోహాన్ని కూడా ఆమె పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. దోచుకోవడం, దాచుకోవడం మినహా ప్రజలకు మేలు చేయాలన్న ఆలోచనే జగన్‌కు లేదనీ, రాష్ట్రంలో అభివృద్ధి కనుమరుగైందనీ, తమ తండ్రి రాజశేఖరరెడ్డి పాలనకు, జగన్‌రెడ్డి పాలనకు పోలికే లేదనీ షర్మిల తేల్చిపారేశారు. ఆమె విమర్శల ప్రభావం ప్రజలపై ఎంత మేర ఉంటుంది? అధికార, ప్రతిపక్షాలలో ఎవరికి ఎక్కువ నష్టం చేస్తుందో తేలవలసి ఉన్నప్పటికీ ప్రస్తుతానికైతే జగన్‌కు మనశ్శాంతి లేకుండా పోయింది. మరోవైపు రానున్న ఎన్నికల్లో పార్టీ టికెట్ల తిరస్కరణకు గురైన ఎమ్మెల్యేలు ధిక్కార స్వరాలు వినిపిస్తున్నారు.

> దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా రికార్డులకు ఎక్కి కూడా తనను పేదల ప్రతినిధిగానే చెప్పుకోవడం మరో జగన్మాయ. గతంలో కమ్యూనిస్టు పార్టీలకు నాయకత్వం వహించిన పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు వంటి వారు భూస్వాముల కుటుంబాల నుంచి వచ్చినప్పటికీ తమ ఆస్తులను పేదలకు పంచి వారి కోసం పోరాడారు. ఇప్పుడు ఈ నయా పేదల ప్రతినిధి అయిన జగన్మోహన్ రెడ్డి పేదల తరఫున మాట్లాడుతూ అపర కుబేరుడిగా అవతరిస్తున్నారు. ఇది జగన్ మార్కు రాజకీయం. అందుకే తర తమ భేదం లేకుండా తన దారికి అడ్డు చెప్పే వారందరినీ పెత్తందారులుగా చిత్రించే పనిలో బిజీగా ఉంటారు. ఈ ఐదేళ్లలో పేదలకు జరిగిన మేలెంత? జగన్‌కు జరిగిన మేలెంతో లెక్కగట్టి నిగ్గు తేల్చితే అసలైన పెత్తందారుడు ఎవరో తేలిపోతుంది.

భారతి లండన్ టూర్ రద్దు!

షర్మిల రంగ ప్రవేశం చేసి అంతఃపుర రహస్యాలను బట్టబయలు చేస్తుండటంతో జగన్‌కు నిద్రపట్టని పరిస్థితి ఏర్పడిందని అంటున్నారు. నిజానికి ముఖ్యమంత్రి భార్య భారతీరెడ్డి ఈ వారంలో లండన్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. అయితే పార్టీలో అంతర్గత పోరుకు తోడు అంతఃపుర రహస్యాలను కూడా షర్మిల పూసగుచ్చినట్టు చెబుతూ రావడంతో భర్త జగన్‌కు ఈ పరిస్థితులలో తోడుగా ఉండడం కోసం ఆమె తన పర్యటనను రద్దు చేసుకున్నారు. దీన్నిబట్టి షర్మిల ఎటాక్ ప్రభావం జగన్‌రెడ్డిపై తీవ్రంగానే ఉందని అర్థం చేసుకోవచ్చు. అధికార బలంతో ప్రత్యర్థులను కేసులలో ఇరికిస్తూ, కుట్రలు, కుయుక్తులతో ప్రతిపక్షాలపై దుష్ప్రచారం చేస్తూ ఇంతకాలం పబ్బం గడుపుతూ వచ్చిన జగన్, ఇప్పుడు తన సోదరే తన నిజ స్వరూపాన్ని విడమర్చి చూపిస్తూ రావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రత్యర్థుల ఆరోపణలకు, విమర్శలకు సమాధానం చెప్పలేని పరిస్థితి ఉన్నప్పుడు ఎదురుదాడి చేయడం వైఎస్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు తండ్రి బాటలోనే జగన్మోహన్ రెడ్డి కూడా ఎదురుదాడినే ఎంచుకున్నారు. వేట కుక్కల కంటే హీనమైన సోషల్ మీడియా సైన్యాన్ని, తనపై ఈగ వాలనివ్వని ఉన్మాద మూకను ఇప్పుడు రక్తం పంచుకు పుట్టిన షర్మిలపైకి ఉసిగొల్పారు. దీంతో ఆమె వ్యక్తిత్వ హననం ప్రారంభమైంది. షర్మిల వ్యక్తిత్వాన్ని కించపరుస్తూ విమర్శలు చేయడం మొదలెట్టారు. ఆమె మొదటి పెళ్లి గురించి కూడా ప్రస్తావిస్తున్నారు. ఆమె రెడ్డి ఎలా అవుతారని ప్రశ్నిస్తున్నారు. మంత్రులతో పాటు సజ్జల అండ్ కో కూడా రంగంలోకి దిగి ఆమెను తిట్టిపోస్తున్నారు. అయితే షర్మిల తనపై వచ్చిన విమర్శలకు బెదరకుండా జగన్మోహన్ రెడ్డి నైజాన్ని పూసగుచ్చినట్టు వివరిస్తున్నారు. గతంలో తాను ఎందుకు పాదయాత్ర చేయవలసి వచ్చిందో, ఎవరు కోరితే పాదయాత్ర చేశానో కూడా వివరిస్తూ భారతీరెడ్డి పాత్రను కూడా బయటపెడుతున్నారు. ముఖ్యమంత్రి అయిన తర్వాత జగన్‌రెడ్డి ఎలా మారిపోయారో చెప్పుకొస్తున్నారు. గడచిన ఐదేళ్లలో తాను రెండే పర్యాయాలు తాడేపల్లి ప్యాలెస్‌కు వెళ్లిన విషయాన్ని గుర్తుచేస్తూ, తాను ఏమీ ఆశించకుండానే జగన్‌రెడ్డి కోసం పనిచేశానని చెప్పారు. జగన్ కిరాయి మూక తనపై విమర్శలకు స్వస్తి చెప్పని పక్షంలో మరిన్ని రహస్యాలను ఆమె బయటపెట్టవచ్చు. రాజశేఖర రెడ్డి కుటుంబం చీలిపోవడానికి జగన్‌రెడ్డి కారణం అంటూ అందుకు తన తల్లి విజయలక్ష్మి సజీవ సాక్ష్యం అని చెప్పడం ద్వారా ప్రత్యర్థుల నోళ్లను ఆమె మూయిస్తున్నారు. షర్మిల తన ఇంటి పేరును వైఎస్‌గా చెప్పుకోవడాన్ని కూడా జగన్ మద్దతుదారులు ప్రశ్నిస్తున్నారు. దీంతో రాజశేఖర రెడ్డి బిడ్డగా తనకు ఆ హక్కు ఉందని, తన కుమారుడికి రాజశేఖర రెడ్డి స్వయంగా తన తండ్రి రాజారెడ్డి పేరు పెట్టిన విషయం నిజం కాదా? అని ప్రశ్నించారు. జగన్‌రెడ్డి నుంచి తాను ఏమీ ఆశించలేదని, తాను ఏదైనా ఆశించి ఉంటే ఆ మాట తన తల్లి విజయలక్ష్మితో చెప్పించగలరా అని సూటిగా ప్రశ్నించడంతో జగన్ శిబిరం ఆత్మరక్షణలో పడిపోయింది. 'పులి కడుపున పులే పుడుతుంది' అంటూ తాను రాజశేఖర రెడ్డి వారసురాలినే అని చెప్పుకొనే ప్రయత్నం చేస్తున్నారు. మొండితనం విషయంలో జగన్ కంటే షర్మిల రెండు ఆకులు ఎక్కువే చదివారు. అయితే అధికారం తోడు కావడంతో రాజశేఖర రెడ్డి కుటుంబంలో అత్యధికులు జగన్‌రెడ్డితోనే ఉన్నారు. షర్మిల ఒక రకంగా ఒంటరి వారు అయ్యారు. అయినా ఆమె అదరడం లేదు బెదరడం లేదు. తనపై షర్మిల విమర్శల పదును పెరగడంతో స్వయంగా జగన్‌రెడ్డి రంగంలోకి దిగి చంద్రబాబు తరఫున ఆమె కూడా స్టార్ క్యాంపెయినర్‌గా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రాజకీయాలలో ఒక కుటుంబంలోని వాళ్లు, ఒకే రక్తం పంచుకు పుట్టిన వాళ్లు పరస్పరం తలపడటం కొత్త కాదు. అయితే ప్రస్తుత పరిస్థితి వేరు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగలిగారంటే అందుకు రాజశేఖర రెడ్డే కారణం. ఇప్పుడు షర్మిలను కాంగ్రెస్ పార్టీ ఆదరించి పీసీసీ అధ్యక్ష పదవి కట్టబెట్టినా అందుకూ రాజశేఖర రెడ్డే కారణం. వైఎస్ రాజశేఖర రెడ్డి బిడ్డలు కాకపోయి ఉంటే వీరిరువురూ ప్రస్తుతం ఈ పొజిషన్లలో ఉండేవారు కారు. ఈ నేపథ్యంలో అన్నాచెల్లెలి మధ్య పోరు ఆసక్తికరంగా మారింది. రాజశేఖర రెడ్డి మరణానంతరం జగన్‌రెడ్డి సానుభూతిని పోగేసుకొని కాంగ్రెస్ ఓటు బ్యాంకును హైజాక్ చేశారు. దీంతో తాము కోల్పోయిన ఓటు బ్యాంకును తిరిగి పొందడానికి కాంగ్రెస్ పార్టీ షర్మిలను చేరదీసింది. ఈ క్రమంలోనే దళిత క్రైస్తవులను ఆకట్టుకోవడం కోసం దళితులపై జగన్‌ది కపట ప్రేమ అని షర్మిల చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గం షర్మిల వైపు ఆకర్షితులు కాకుండా ఉండడం కోసం షర్మిల భర్త అనిల్ కుమార్ బ్రాహ్మణుడు అని, ఆమె ఇకపై ఎంత మాత్రం రెడ్డి కాబోరని జగన్ అనుకూల శక్తులు సరికొత్త లాజిక్‌ను తెర మీదకు తెచ్చాయి. 2019 ఎన్నికలకు ముందు జగన్ తరఫున ప్రచారం చేసి పెట్టిన షర్మిలను రెడ్డి కాదని ఎవరూ వేలెత్తి చూపకపోవడం గమనార్హం. రాజశేఖర రెడ్డి బిడ్డ అనే ప్రాజెక్ట్ చేశారు. అనాడు జగనన్న కోసం పనిచేసిన బాణం ఇప్పుడు పక్కలో బల్లెం అయ్యేసరికి ఆమె భర్త కుల నేపథ్యాన్ని తెర మీదకు తెచ్చారు. అవసరానికి అనుగుణంగా కులాలను వాడుకోవడం జగన్‌కు వెన్నతో పెట్టిన విద్య. తన మేనత్తలు దళితులనే పెళ్లి చేసుకున్నారని చెబుతూ దళితులను బుట్టలో వేసుకొనే ప్రయత్నం చేశారు. దీనికి కౌంటర్‌గా దళితుడినే చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని పక్కన పెట్టుకొని తిరుగుతున్న జగన్.. దళితులకు ఆత్మబంధువు ఎలా అవుతారని షర్మిల ప్రశ్నిస్తున్నారు. క్రైస్తవుల ఓట్లను, ముఖ్యంగా దళిత క్రైస్తవుల ఓట్లను తిరిగి కాంగ్రెస్ పార్టీ వైపు తెచ్చుకోవడానికి షర్మిల భర్త బ్రదర్ అనిల్ సహజంగానే ప్రయత్నిస్తారు. ఈ కారణంగానే షర్మిల వల్ల రాజకీయంగా తనకు నష్టం జరుగుతుందని జగన్‌రెడ్డి ఆందోళన చెందుతున్నారు. ఎన్నికల వేళ ప్రత్యర్థులు అందరూ ఒక్కటై జగన్‌రెడ్డికి వ్యతిరేకంగా మోహరిస్తున్న వేళ అండగా ఉండాల్సిన సోదరి అంతఃపుర రహస్యాలను బయటపెడుతూ చికాకు పెట్టడాన్ని జగన్ శిబిరం జీర్ణించుకోలేకపోతున్నది. జగన్‌రెడ్డి స్వయంకృతాపరాధం వల్లనే ఈ పరిస్థితి వచ్చింది. తాను జైలులో ఉన్నప్పుడు తన కోసం కాలికి బలపం కట్టుకుని తిరిగిన సోదరి షర్మిలను అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయంగా ఆదరించి ఉంటే ఈ పరిస్థితి వచ్చి ఉండేది కాదు. షర్మిలను రాజకీయంగా నిరోధించడంతో పాటు ఆస్తులను కూడా పంచి ఇవ్వకపోవడంతో అన్నాచెల్లెళ్ల మధ్య పూడ్చలేని అగాధం ఏర్పడింది. పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే, తన కుమారుడి నిశ్చితార్థానికి మర్యాద కోసం సోదరుడు జగన్‌ను షర్మిల ఆహ్వానించారు. అయితే ఆమె తన ఇంటికి వచ్చి ఆహ్వానిస్తే భారతీయ జనతా పార్టీ పెద్దలకు ఆగ్రహం వస్తుందని చెప్పి 'ఇంటికి రావొద్దు' అని చెల్లికి జగన్ చెప్పించారు. ఇంట్లోకి రానివ్వకపోతే గడప వద్దే ఆహ్వాన పత్రిక పెట్టి వెళ్లిపోతానని షర్మిల హెచ్చరించడం విదితమే.

> రాజశేఖర రెడ్డి మరణానంతరం జగన్‌రెడ్డి సానుభూతిని పోగేసుకొని కాంగ్రెస్ ఓటు బ్యాంకును హైజాక్ చేశారు. దీంతో తాము కోల్పోయిన ఓటు బ్యాంకును తిరిగి పొందడానికి కాంగ్రెస్ పార్టీ షర్మిలను చేరదీసింది. ఈ క్రమంలోనే దళిత క్రైస్తవులను ఆకట్టుకోవడం కోసం దళితులపై జగన్‌ది కపట ప్రేమ అని షర్మిల చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గం షర్మిల వైపు ఆకర్షితులు కాకుండా ఉండడం కోసం షర్మిల భర్త అనిల్ కుమార్ బ్రాహ్మణుడు అని, ఆమె ఇకపై ఎంత మాత్రం రెడ్డి కాబోరని జగన్ అనుకూల శక్తులు సరికొత్త లాజిక్‌ను తెర మీదకు తెచ్చాయి. 2019 ఎన్నికలకు ముందు జగన్ తరపున ప్రచారం చేసి పెట్టిన షర్మిలను రెడ్డి కాదని ఎవరూ వేలెత్తి చూపకపోవడం గమనార్హం. రాజశేఖర్ రెడ్డి బిడ్డ అనే ప్రాజెక్ట్ చేశారు. అనాడు జగనన్న కోసం పనిచేసిన బాణం ఇప్పుడు పక్కలో బల్లెం అయ్యేసరికి ఆమె భర్త కుల నేపథ్యాన్ని తెర మీదకు తెచ్చారు. తన మేనత్తలు దళితులనే పెళ్లి చేసుకున్నారని చెబుతూ దళితులను బుట్టలో వేసుకొనే ప్రయత్నం చేశారు. దీనికి కౌంటర్‌గా దళితుడినే చంపి డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీని పక్కన పెట్టుకొని తిరుగుతున్న జగన్.. దళితులకు ఆత్మబంధువు ఎలా అవుతారని షర్మిల ప్రశ్నిస్తున్నారు.


akbar

కడప బరిలో సౌభాగ్యమ్మ?

మొత్తమ్మీద షర్మిల కుమారుడి నిశ్చితార్థానికి జగన్ దంపతులు తాడేపల్లి ప్యాలెస్ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు. అయితే అక్కడ తమకు షర్మిల దంపతుల నుంచి సాదర స్వాగతం లభించలేదని జగన్ దంపతులు కినుకతో ఉన్నారు. ఇదంతా ఆ ఇంటి రామాయణం. ఇప్పుడు ఆ రామాయణమే ఆంధ్రప్రదేశ్ రాజకీయాలలో చర్చనీయాంశం అవుతోంది. రాష్ట్ర రాజకీయాలలోకి షర్మిల ఎంట్రీ జగన్‌రెడ్డి భయపడుతున్నట్టుగా ఆయనకు నష్టం చేస్తుందా.. లేదా అన్నది వేచి చూడాలి. ఆ ఇంటి పోరు ఇకపై ఏ మలుపులు తిరుగుతుందో తెలియదు. వివేకానంద రెడ్డి హత్య కేసు గురించి కూడా షర్మిల నోటి వెంట కొన్ని నిజాలు బయటకు రావొచ్చు. సోదరుడితో విభేదాలు ముదరడానికి ప్రధాన కారణం భారతీరెడ్డి అనే భావనలో షర్మిల గానీ, డాక్టర్ సునీత గానీ ఉన్నారు. వివేకా హత్య కేసులో అవినాశ్ రెడ్డి అరెస్టు కాకుండా తప్పించుకోగలిగారంటే అందుకు భారతీరెడ్డి అండదండలే కారణమని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కడప లోక్‌సభ స్థానం నుంచి వివేకానంద రెడ్డి భార్యను కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీకి పెట్టాలని షర్మిల భావిస్తున్నారు. అవినాశ్ రెడ్డిని ఓడించే అవకాశం ఉన్నప్పుడే ఏ పార్టీ తరఫు నుంచైనా తన తల్లి సౌభాగ్యమ్మను పోటీ పెట్టడం మంచిదని, ఓడించే పరిస్థితి లేకపోతే పోటీకి దింపడం అనవసరం అని డాక్టర్ సునీత దంపతులు భావిస్తున్నట్టు తెలిసింది. ఎన్నికల నోటిఫికేషన్ రావడానికి మరో నెల రోజులకు పైగా వ్యవధి ఉంది. ఆలోపు ఏం జరుగుతుందో తెలియదు. ప్రస్తుతానికైతే షర్మిల తన మిషన్‌లో కొంత మేర సఫలమయ్యారు. రాష్ట్ర విభజన నాటి నుంచి ఆంధ్రప్రదేశ్‌లో నిస్తేజంగా ఉన్న కాంగ్రెస్ నాయకులలో, కార్యకర్తల్లో ఆమె కొంత కదలిక తీసుకురాగలిగారు. తెలంగాణలో తాజాగా జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున దాని ప్రభావం కూడా ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహాన్ని నింపే అవకాశం ఉంది. అదే జరిగితే జగన్‌రెడ్డి ఓటు బ్యాంకుకు కొంతమేర గండిపడే అవకాశం ఉంది. ఈ కారణంగానే చంద్రబాబును అధికారంలోకి తేవడానికే షర్మిల రాష్ట్ర రాజకీయాలలోకి వచ్చారని జగన్ అండ్ కో కౌంటర్ ప్రచారానికి తెర లేపారు. ఈ ప్రచారాన్ని ప్రజలు నమ్మితే జగన్ ఓటు బ్యాంకు సేఫ్‌గానే ఉంటుంది. ప్రస్తుత పరిణామాలను తెలుగుదేశం పార్టీ కూడా నిశితంగా పరిశీలిస్తోంది. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా షర్మిల దూకుడుగా వ్యవహరిస్తున్నందున కాంగ్రెస్ పార్టీ నిజంగానే పుంజుకొని జగన్ ఓటు బ్యాంకుతో పాటు ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకును కూడా చీల్చే ప్రమాదం ఉందా? అని ఆరా తీస్తోంది. జగన్‌రెడ్డి అధికారాన్ని కోల్పోయిన పక్షంలోనే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మళ్లీ బలపడే అవకాశం ఉంది. ప్రస్తుతానికి ముఖ్యమంత్రి జగన్‌కు బీజేపీ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ బలపడటాన్ని బీజేపీ జీర్ణించుకోలేదు. రాష్ట్రంలో తాము పుంజుకోలేని పక్షంలో జగన్‌రెడ్డి అధికారంలో కొనసాగాలన్నది బీజేపీ పెద్దల అభిలాష. ఈ కారణంగా తెలుగుదేశం–జనసేన కూటమి కూడా కాంగ్రెస్ పార్టీతో అంటీ ముట్టనట్టుగానే ఉంటుంది. దీన్నిబట్టి ఇటు కుటుంబపరంగా అటు రాజకీయంగా కూడా షర్మిల ఒంటరి పోరాటం చేయాల్సి ఉంటుంది. తమిళనాడులో కరుణానిధి–జయలలిత నాటి రాజకీయాల పట్ల మక్కువ పెంచుకున్న జగన్మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అదే ఒరవడి కొనసాగాలని కోరుకుంటున్నారు. ఇప్పటివరకు ఆయన హిట్ లిస్ట్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, రాధాకృష్ణ, రామోజీరావు మాత్రమే ఉన్నారు. ఇకపై ఈ జాబితాలో షర్మిల కూడా చేరతారు. రక్తం పంచుకు పుట్టిన షర్మిలను కూడా పెత్తందారుల జాబితాలో చేర్చి తిట్టిస్తారు. తన మనసు దోచుకోవాలంటే తన ప్రత్యర్థులను దుర్భాషలాడటమే లక్ష్యంగా పనిచేయాలని జగన్‌రెడ్డి తన పార్టీ వారి వద్ద మొహమాటం లేకుండా చెబుతారు. ఎవరిని ఏ భాషలో తిట్టాలో కూడా తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఆదేశాలు వెళతాయి. ఈ ఆదేశాలు పాటించని వారిలో కొందరికి ఇప్పుడు టికెట్లు నిరాకరిస్తున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జగన్‌నూ, విజయమ్మనూ తిట్టిపోసిన ప్రస్తుత మంత్రి బొత్స ఇప్పుడు తాడేపల్లి ప్యాలెస్ ఆదేశాలతో ఎవరినైనా తిట్టడానికి ముందుంటున్నారు. జగన్ చల్లని చూపు తమపై ఉండాలంటే తప్పదు మరి అని బొత్స బాటలో మరికొందరు నడుస్తున్నారు.

> తమిళనాడులో కరుణానిధి–జయలలిత నాటి రాజకీయాల పట్ల మక్కువ పెంచుకున్న జగన్మోహన్ రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లో కూడా అదే ఒరవడి కొనసాగాలని కోరుకుంటున్నారు. ఇప్పటివరకు ఆయన హిట్ లిస్ట్‌లో చంద్రబాబు, పవన్ కల్యాణ్, రాధాకృష్ణ, రామోజీరావు మాత్రమే ఉన్నారు. ఇకపై ఈ జాబితాలో షర్మిల కూడా చేరతారు.

..అన్నిసార్లూ మోసం చేయలేం!

ఇదిలావుంటే, దేశంలోనే అత్యంత సంపన్న ముఖ్యమంత్రిగా రికార్డులకు ఎక్కి కూడా తనను పేదల ప్రతినిధిగానే చెప్పుకోవడం మరో జగన్మాయ. దళితులు, బడుగులు, పేదల తరఫున ఆ వర్గాలకు చెందినవారు ఎదగాల్సిన అవసరం లేదు.. మీ కోసం సంపన్నుడైన తాను ఉంటానని చెప్పుకొంటుంటారు. గతంలో కమ్యూనిస్టు పార్టీలకు నాయకత్వం వహించిన పుచ్చలపల్లి సుందరయ్య, రావి నారాయణ రెడ్డి, మాకినేని బసవపున్నయ్య, చండ్ర రాజేశ్వరరావు వంటి వారు భూస్వాముల కుటుంబాల నుంచి వచ్చినప్పటికీ తమ ఆస్తులను పేదలకు పంచి వారి కోసం పోరాడారు. ఇప్పుడు ఈ నయా పేదల ప్రతినిధి అయిన జగన్మోహన్ రెడ్డి పేదల తరఫున మాట్లాడుతూ అపర కుబేరుడిగా అవతరిస్తున్నారు. ఇది జగన్ మార్కు రాజకీయం. అందుకే తర తమ భేదం లేకుండా తన దారికి అడ్డు చెప్పే వారందరినీ పెత్తందారులుగా చిత్రించే పనిలో బిజీగా ఉంటారు. ఈ ఐదేళ్లలో పేదలకు జరిగిన మేలెంత? జగన్‌కు జరిగిన మేలెంతో లెక్కగట్టి నిగ్గు తేల్చితే అసలైన పెత్తందారుడు ఎవరో తేలిపోతుంది. ఒకరిని ఒకసారి మోసం చేయవచ్చు. అందరినీ కూడా ఒకసారి మోసం చేయవచ్చు. కానీ అందరినీ అన్నిసార్లూ మోసం చేయలేం. జగన్‌రెడ్డి విషయంలో కూడా ఈ సూత్రం వర్తిస్తుంది. ప్రస్తుతానికి అన్నాచెల్లెలి మధ్య మొదలైన ఆటను గమనిద్దాం!

> నిజానికి ముఖ్యమంత్రి భార్య భారతీరెడ్డి ఈ వారంలో లండన్ పర్యటనకు వెళ్లాల్సి ఉంది. అయితే పార్టీలో అంతర్గత పోరుకు తోడు అంతఃపుర రహస్యాలను కూడా షర్మిల పూసగుచ్చినట్టు చెబుతూ రావడంతో, జగన్‌కు ఈ పరిస్థితులలో తోడుగా ఉండడం కోసం భారతీరెడ్డి తన పర్యటనను రద్దు చేసుకున్నారు. దీన్నిబట్టి షర్మిల ఎటాక్ ప్రభావం జగన్‌రెడ్డిపై తీవ్రంగానే ఉందని అర్థం చేసుకోవచ్చు. అధికార బలంతో ప్రత్యర్థులను కేసులలో ఇరికిస్తూ, కుట్రలు, కుయుక్తులతో ప్రతిపక్షాలపై దుష్ప్రచారం చేస్తూ ఇంతకాలం పబ్బం గడుపుతూ వచ్చిన జగన్, ఇప్పుడు తన సోదరే తన నిజ స్వరూపాన్ని విడమర్చి చూపిస్తూ రావడాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ప్రత్యర్థుల ఆరోపణలకు, విమర్శలకు సమాధానం చెప్పలేని పరిస్థితి ఉన్నప్పుడు ఎదురుదాడి చేయడం వైఎస్ కుటుంబానికి వెన్నతో పెట్టిన విద్య. ఇప్పుడు తండ్రి బాటలోనే జగన్మోహన్ రెడ్డి కూడా ఎదురుదాడినే ఎంచుకున్నారు.



కర్ణాటక రాష్ట్రానికి చెందిన విద్యావేత్త డా. హెచ్.నరసింహయ్య మూఢనమ్మకాలు, దేవుడు పేరుతో జరుగుతున్న దోపిడీని ప్రతిఘటించి, ప్రజల్లో శాస్త్రీయస్పృహ పెంచడానికి విశేష కృషి చేసిన హేతువాది. సత్యసాయిబాబా మహిమలపై పోరాడిన వ్యక్తిగా ప్రసిద్ధుడు. ఆయన ఆత్మకథ 'హోరాటద హాది'ని 'పోరాటపథం' పేరిట **కోడీహళ్ళి మురళీమోహన్** కన్నడం నుంచి తెలుగులోకి అనువదించారు. అందులోని కొన్ని భాగాలివి.

రాహువే లేనప్పుడు రాహుకాలం ఎక్కడిది?

నా బాల్యంలో మహాత్మాగాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ మొదలైన జాతీయ నాయకులు నా ఆలోచనలను, విలువలను రూపొందించారు. నేను అన్నింటినీ గంభీరంగా తీసుకుంటాను. అందువల్లే నేను 'క్విట్ ఇండియా' ఉద్యమంలో పాల్గొనింది. శ్రీరామకృష్ణాశ్రమంలో రెండు సంవత్సరాలు ఉన్నప్పుడు స్వామీ వివేకానంద గారి "They alone live who live for others. The rest are more dead than alive. – పరుల కోసం ఎవరు బతుకుతారో వారిదే నిజమైన బతుకు. మిగిలినవారు జీవచ్ఛవాలు" అన్న సూక్తి నా మనసులో ముద్రపడింది. ఒకటి రెండు సంవత్సరాలు సావధానంగా ఆలోచించి అన్ని సాధక – బాధకాలను పరిగణనలోకి తీసుకుని పెళ్లి చేసుకోకూడదని అంతిమ నిర్ణయం తీసుకున్నాను. ఇది కూడా నేను తీసుకున్న అత్యంత ముఖ్య నిర్ణయాలలో ఒకటి.

పెళ్లి చేసుకోవాలి అనేది అత్యంత సహజమైన, బలమైన ఒత్తిడి. పెళ్లి చేసుకోకుండా ఉండాలి అంటే పెళ్లి చేసుకోవాలన్న ఒత్తిడికి సరితూగే అంతే బలమైన, ముఖ్యమైన ప్రయోజనం, లక్ష్యం జీవితంలో ఉండాలి. ఆలోచనలు అడ్డదిడ్డంగా పోకుండా వాటికి కళ్లెం వేసే ఎల్లప్పుడూ చేతినిండా పని. క్రమశిక్షణతో కూడిన జీవితం. ఏదైనా సాధించాలనే హఠం ఉండాలి. అప్పుడు ఆలోచనలు పక్కదారి పట్టే సంభవం తక్కువ అవుతుంది.

నేను పుట్టింది ఆదివారం నాడు. అయితే నా జీవితంలో ఆదివారమే లేదు అని వెనుక ఎక్కడో చెప్పాను. ఇది అక్షరాలా నిజం. ఇంతవరకూ నాకు ఏ ఆదివారమూ, సెలవురోజూ లేదు. నేను చేసే పని ఎక్కువ శ్రమతో కూడినదైనా నాకు ఎక్కువ సంతృప్తిని ఇస్తుంది. అయినా అప్పుడప్పుడూ ఒంటరితనం గుర్తుకు వస్తుంది. అయితే ఆ ఆలోచన కాలవ్యవధి చాలా కొంచెమే.

నేను మొదటి నుండీ స్వతంత్రంగా ఆలోచించే స్వభావాన్ని అభ్యాసం చేసుకుంటూ వచ్చాను; దేనినీ ప్రశ్నించకుండా ఒప్పుకోను. నేను మూఢనమ్మకాలను, మాయామంత్రాలను, జ్యోతిష్యాన్నీ కటువుగా విమర్శిస్తూ వచ్చాను. మాయలు, మూఢనమ్మకాల గురించి నా ఖచ్చితమైన అభిప్రాయాలను వెనుక చాలా వివరంగా చెప్పాను. జ్యోతిష్యం గురించి సంక్షిప్తంగా కొన్ని విషయాలను చెప్పడం ఉచితం అనిపిస్తుంది.

మనిషిపై గ్రహాల ప్రభావం ఉంది అనే నమ్మకంపై నిర్మించిన సౌధమే జ్యోతిష్యశాస్త్రం. జ్యోతిష్యం ప్రకారం తొమ్మిది గ్రహాలున్నాయి. ఆ తొమ్మిదిలో సూర్యుడు, చంద్రుడు, రాహువు, కేతువులు ఉన్నాయి. సైన్స్ ప్రకారం సూర్యుడు గ్రహం కాదు, ఒక నక్షత్రం. చంద్రుడు ఉపగ్రహం. రాహు కేతు గ్రహాలు లేనేలేవు. ఈ విషయాలన్నీ ఒక హైస్కూలు విద్యార్థికి తెలుసు. జ్యోతిష్కుల తొమ్మిది గ్రహాలలో నాలుగు తప్పుడు లెక్కాచారంతో కూడి ఉన్నాయి. దీనితో జ్యోతిష్యం కథ ముగిసింది కదా! దానికి పునాదే గట్టిగా లేకపోయింది. అందువల్ల దానిమీద కట్టిన జ్యోతిష్యం అనే సౌధం కుప్పకూలిపోయింది.

రాహువే లేనప్పుడు రాహుకాలం ఎక్కడ నుంచి వస్తుంది? రాహుకాలం చెడ్డది అనే భావన చాలామందిలో ఉంది. అది నిజమయితే రాహుకాలంలో బయలుదేరే బస్సులకు, రైళ్లకు, విమానాలకు ప్రమాదాలు జరగాలి. ప్రమాదాలకు రాహుకాలానికీ ఏ సంబంధమూ లేదు. జాతకాలు కూడా జ్యోతిష్యం ఆధారంగానే రచింపబడతాయి. పిల్లవాడు పుట్టినప్పుడు గ్రహాల స్థానం ఆధారంపై జాతకం రాస్తారు. ఆ జాతకంలో పిల్లవాని జీవితంలోని అన్ని విజయాలు, ప్రముఖ ఘట్టాలు కలిగి ఉంటాయి అనే నమ్మకం ఉంది. ఇది శుద్ధ అబద్ధం. విమానప్రమాదంలో చనిపోయే వందలాది మంది జాతకాలలో వారంతా ఇలాగే మరణిస్తారని ఏ జ్యోతిష్కుడూ రాయడానికి సాధ్యం కాదు. 1962లో అష్టగ్రహకూటమి వల్ల అనాహుతం జరుగుతుందని బొబ్బలు పెట్టిన జ్యోతిష్కుల భవిష్యత్తు మట్టి కరిచింది. జ్యోతిష్కులు చెప్పేది అస్పష్టం. గోడమీద పెట్టిన దీపం లాంటిది. ఒక్కొక్కసారి జ్యోతిష్యం కాకతాళీయంగా నిజం కావచ్చు. చెడిపోయిన గడియారం కూడా రోజుకు రెండుసార్లు సరియైన సమయాన్ని చూపుతుంది!

> మనలో నిదర్శనానికన్నా ప్రదర్శనానికే ఎక్కువ విలువ. బంట్రోతు మొదలుకొని రాష్ట్రపతి వరకూ చాలామంది తమ తలనీలాలను దేవునికి సమర్పిస్తారు. తలలు బోడులు కావడానికన్నా తలపులు బోడులవుతున్నాయి. భయం, అహేతుకమైన భావనలే మూఢనమ్మకాల ఆస్తి.



చాలామందికి జ్యోతిష్యంపై నమ్మకం ఎలా ఉందో అలాగే పూజాపునస్కారాల వల్ల వ్యక్తుల, సమాజ కళ్యాణం జరుగుతుందన్న నమ్మకమూ ఎక్కువగా ఉంది. స్వతంత్రంగా ఆలోచిస్తే వీటికి అర్థం లేదు. మనయొక్క ఏ కీర్తిప్రతిష్ఠలకు పూజాదికాలకు సంబంధం లేదు. ప్రపంచంలో లక్షలాది మంది చింతనాపరులూ దార్శనికులూ రాజకీయ నాయకులూ పూజ, ప్రార్థనల సహాయం లేకుండానే గణనీయమైన స్థానాలను గెలుచుకున్నారు. విశ్వవిఖ్యాత ఐన్‌స్టీన్ రసెల్ వంటివారికి ఇలాంటి నమ్మకాలకూ సంబంధమే లేదు. అజ్ఞేయవాది (Agnostic) జవహర్‌లాల్ నెహ్రూ 14 సంవత్సరాలు ప్రధానిగా ఉన్నారు. అలాగే నాస్తికులు జ్యోతిబసు సుదీర్ఘ కాలంగా పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. వీరిద్దరూ ఎక్కువ సమయం అధికారంలో ఉండి రికార్డును సృష్టించారు. ఇలాంటి నిదర్శనాలు చాలా ఉన్నాయి.

ఇంకొక సహించరాని విషయం ఏమిటంటే దేవునికి వజ్రవైఢూర్యాలతోనూ, వెండి–బంగారు నగలతోనూ అలంకరించడం. దేవునికి ఇదంతా ఎందుకు? ఒక విచిత్రమైన విషయం ఏమిటంటే ఇలాంటి శ్రీమంతులైన దేవుళ్ల అమూల్యాభరణాలను మనం – మనుషులం కాపాడాలి. తనను తాను కాపాడుకోలేని దేవుడు మనలను ఎలా కాపాడుతాడు? మనల్ని మనమే కాపాడుకోవాలి.

విశ్వశాంతి కోసం యజ్ఞ యాగాదులను మన దేశంలో ఆచరిస్తారు. ప్రపంచంలోని అనేక దేశాలలో సుఖశాంతులున్నాయి. మన దేశంలోనే ఎప్పుడూ హింస, అశాంతి. అయినా విశ్వశాంతి పేరుతో వీలైనంత దోపిడీ, విలువైన వస్తువుల దహనం చెప్పలేనంతగా జరుగుతూనే ఉంది.

నదులలో, 'పవిత్ర'మైన నదులలో స్నానం చేస్తే పుణ్యం వస్తుంది అనేది మరొక మూఢనమ్మకం. సంవత్సరంలో కొన్ని రోజులు 'పవిత్ర' నదులలో స్నానం చేసి పుణ్యం మూటకట్టుకోవడానికి తొక్కిసలాట. గంగానది అత్యంత పవిత్రమైన నది అనే నమ్మకం చాలామందికి ఉంది. అయితే గంగానది వంటి కలుషితమైన నది మరొకటి లేదని శాస్త్రీయంగా నిరూపించబడింది. గంగానదిని మనమే శుద్ధి చేయవలసిన పరిస్థితి వచ్చింది. చర్మాన్ని కడిగితే ఖర్మం పోతుందా?

మనలో నిదర్శనానికన్నా ప్రదర్శనానికే ఎక్కువ విలువ. బంట్రోతు మొదలుకొని రాష్ట్రపతి వరకూ చాలామంది తమ తలనీలాలను దేవునికి సమర్పిస్తారు. తలలు బోడులు కావడానికన్నా తలపులు బోడులవుతున్నాయి. ఇలాగే చాలా మూఢనమ్మకాల ప్రస్తావనను శాస్త్రీయంగా విశ్లేషించడం అవసరం. భయం, అహేతుకమైన భావనలే మూఢనమ్మకాల ఆస్తి.

నేనిలాగే మూఢనమ్మకాలను, మాయలను, అర్థరహితమైన సంప్రదాయాలని విమర్శిస్తే చాలామందికి అనుమానం వచ్చి నాకు దేవునిపై నమ్మకం ఉందా? అని అడుగుతారు. చాలామంది తమ స్వార్థానికి దేవుణ్ణి ఉపయోగించుకుంటారు. ఇలాంటి లావాదేవీ దేవునిపై నాకు నమ్మకం లేదు. అయితే ఒక చైతన్యశక్తి ఉండవచ్చన్నది నా నమ్మకం. దేవుడు ఉన్నాడా లేడా అనే సమస్య శతాబ్దాల నుండి బుద్ధిజీవులను పీడిస్తోంది. ఎంత ఆలోచించినా ఈ సమస్యకు సమాధానం లభించలేదు. దేవుడు ఉన్నాడు లేదా లేడు అనేది నమ్మకం అవుతుంది. దేవుడు ఉన్నాడని శాస్త్రీయంగా నిరూపించడం సాధ్యం కాదు. అలాగే లేడు అని ధ్రువీకరించడం కూడా సాధ్యపడదు. అందువల్లే ప్రపంచంలోని అనేకమంది చింతనాపరులు, తత్వవేత్తలు, అజ్ఞేయతావాదులు దేవుడు ఉన్నాడని చెప్పరు. లేడనీ చెప్పరు. "దేవుడు, ఆత్మ మొదలైన వాటి గురించి చర్చించడం వ్యర్థం. అందువల్ల మంచిపని చేయి, మంచివాడివి కా – Do good and be good" అని బుద్ధుడు పదేపదే తన శిష్యులకు బోధించేవాడు. ఇది అత్యంత వ్యవహారికమైన Practical ఉపదేశం. దేవుడు లేకపోతే పోనీ మనుష్యుడు ఉన్నాడు కదా. అందువల్ల మన ధర్మానికి మనుష్యుడు కేంద్రబిందువు కావాలి. దేవునిపై నిజంగా నమ్మకం ఉంటే వారు చెడ్డపనులు చేయరాదు; లంచం పుచ్చుకోరాదు; కర్తవ్య ప్రజ్ఞతో ప్రామాణికంగా పనిచేయాలి.

* * *

స్వర్గం, మోక్షం ఉందో లేదో నాకు తెలియదు. వాటి గురించి నేను పట్టించుకోను. అవి ఉన్నా, నాకు స్వర్గమూ వద్దు, మోక్షమూ అక్కరలేదు. కోట్లాదిమంది ఈ ప్రపంచంలో కష్టనష్టాలతో బతుకుతున్నప్పుడు వారినంతా వదిలి నేను స్వర్గానికి వెళ్లాలన్న ఆశ నాకు లేదు. స్వర్గంలో చేయడానికి పనిలేదు. ఎదుర్కోవడానికి సమస్యలు లేవు. సవాళ్ళు లేవు. దివ్యపురుషులు లేరు అన్న తరువాత అక్కడ ఊరికే కూర్చుని ఏమి చేయాలి? పునర్జన్మ ఉంటే నాకు వచ్చే జన్మలో మంచి ఆరోగ్యాన్ని ఇచ్చి నిరంతరంగా పనిచేసే అవకాశం లభిస్తే చాలు, నాకు ఇంకేమీ అక్కరలేదు.

• డా. హెచ్.నరసింహయ్య



విద్యార్థుల ఉద్యమం

'మాకు ఉచితాలు వద్దు.. భవిష్యత్తు కావాలి..' అంటూ విద్యార్థులు రోడ్డెక్కారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ లేక కళాశాలలు ఆపేసిన సర్టిఫికెట్లను ఇప్పించాలంటూ విజయవాడలోని ధర్నాచౌక్‌లో శనివారం ఏపీయూఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ఇలా ధర్నా చేశారు.

ఢీ విజన్ నాయకత్వం



ప్లాన్ ప్రకారం సెంట్రల్‌లో సిటింగ్ ఎమ్మెల్యేను పోటీ నుంచి తప్పించారు. అధిష్ఠానం వద్ద పావులు కదిపి ఇన్‌చార్జి బాధ్యతలు దక్కించుకున్నారు. ఇక కార్పొరేటర్ల మద్దతు కూడగట్టుకుంటే చాలనుకున్నారు. కాగల కార్యం గంధర్వులు తీర్చినట్టు సెంట్రల్ కార్పొరేటర్లంతా ఆయన ఇంటి ముందు బొకేలతో వాలిపోయారు. తెగ మురిసిపోయిన ఆయన ఇక సెంట్రల్‌లో ఎదురులేదని భావించారు. డివిజన్ పర్యటనలకు సైతం శ్రీకారం చుట్టేశారు. ఈ తరుణంలో పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు ఊహించని ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటి వరకు వేసిన ఎత్తులన్నీ ఆ పార్టీ డివిజన్ నాయకత్వం ముందు చిత్తయిపోయాయి.

సెంట్రల్‌లో వెలంపల్లికి డివిజన్ నాయకుల షాక్

- కార్పొరేటర్ల మద్దతు ఉంటే చాలనుకున్నారా.. అంటూ ప్రశ్నలు
- అంతా మీరే అయితే మేమెందుకంటూ సీరియస్
- డివిజన్ స్థాయి సమావేశాల్లో రచ్చ
- కోపంతో వెళ్లిపోతున్న కొందరు నాయకులు
- సెంట్రల్ వైసీపీ కార్పొరేటర్లపై ఆగ్రహం
- వాంబేకాలనీలో పార్టీ కార్యాలయానికి తాళం

అజిత్‌సింగ్‌నగర్ : సెంట్రల్ నియోజకవర్గంలో ఒకరిద్దరు మినహా మిగిలిన కార్పొరేటర్లను ప్రసన్నం చేసుకున్న పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు డివిజన్ నాయకత్వం నుంచి షాక్ తగిలింది. మూడు రోజులుగా జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే, డివిజన్ నాయకత్వం వెలంపల్లికి వ్యతిరేకంగా ఉందని స్పష్టమవుతోంది. సెంట్రల్ నియోజకవర్గంలో మొత్తం 21 డివిజన్లు ఉండగా, 16 మంది వైసీపీ కార్పొరేటర్లు ఉన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు తీసుకున్న వెలంపల్లి శ్రీనివాస్ తన దృష్టినంతా వారిపైనే పెట్టారు. కార్పొరేటర్ల మద్దతు ఉంటే చాలన్నట్టుగా 16 మంది మద్దతుకు పావులు కదిపారు. ఇందులో ఇద్దరు, ముగ్గురు మినహా మిగిలిన వారంతా వెలంపల్లికి జై కొట్టేశారు. అలాగే, పార్టీ ఓడిపోయిన మిగిలిన ఐదు డివిజన్లలో కార్పొరేటర్ అభ్యర్థులుగా పోటీచేసిన వారి మద్దతు కూడగట్టుకున్నారు. ఇక అంతా నడిచిపోతుందిలే అనుకున్న తరుణంలో డివిజన్ నాయకత్వం అడ్డం తిరిగింది. నెల రోజులుగా వెలంపల్లి పడిన ఆరాటమంతా వృథా అయిపోయింది.

కార్పొరేటర్లే అంతా నడిపేస్తారా...?

రానున్న ఎన్నికల పోరుకు పార్టీని సిద్ధం చేసేందుకు మూడు రోజులుగా డివిజన్లవారీగా పార్టీ సమావేశాలు ఏర్పాటు చేశారు. డివిజన్ వైసీపీ కార్యాలయాల్లో జరిగిన ఈ సమావేశాల్లో కార్పొరేటర్లు.. డివిజన్ నాయకత్వాన్ని పిలిపించి సమష్టిగా పని చేయాలని కోరారు. అయితే, కార్పొరేటర్లకు ఈ సమావేశాల్లో ఊహించని షాక్‌లు తగిలాయి. 'అంతా కార్పొరేటర్లే నడిపేస్తారా? అదీ చూస్తాం' అంటూ డివిజన్ నాయకులు అడ్డం తిరిగారు. 'కార్పొరేటర్లను పిలిచి మాట్లాడితే పార్టీ నాయకత్వంతో మాట్లాడినట్టేనా? అంతా మీరే అయితే ఇక మేమెందుకు' అంటూ కొందరు పార్టీ నాయకులు, కార్యకర్తలు కార్పొరేటర్లపై విరుచుకుపడ్డారు. 'వెలంపల్లికి తమతో పనిలేదనుకుంట.. ఎమ్మెల్సీ, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు ఉంటే చాలనుకుంటున్నారు.. మీమంటే ఏంటో చూపిస్తాం' అంటూ కొందరు సమావేశాల నుంచి వెళ్లిపోయారు.



వాంబేకాలనీలో తాళం వేసిన పార్టీ కార్యాలయానికి బయట వెలంపల్లి అనుచరుల సమావేశం

వాంబేకాలనీలో అంతా రివర్స్

వెలంపల్లి దగ్గర కార్పొరేటర్లు దండుకున్నారని, తమను సంతలో పశువుల్లా అమ్మేస్తున్నారంటూ ఇంకొందరు ఆగ్రహం వ్యక్తం చేశారు. డివిజన్లలో పార్టీ ప్రెసిడెంట్లు, కో-ఆర్డినేటర్లు ఉన్న విషయం కూడా మరిచి కేవలం కార్పొరేటర్లతోనే వెలంపల్లి అంటకాగుతున్నారని నియోజకవర్గంలో నాయకులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

నియోజకవర్గంలోని పలు డివిజన్లలోని వైసీపీ నేతలు కార్పొరేటర్లకు అడ్డం తిరగగా, వాంబేకాలనీలోని నాయకులు అక్కడి పార్టీ కార్యాలయానికి తాళం వేసేశారు. శుక్రవారం సాయంత్రం వెలంపల్లి వర్గం కాలనీలోని పార్టీ కార్యాలయం వద్ద సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. అయితే, అక్కడి నాయకత్వం పార్టీ కార్యాలయం తాళం కూడా వీరికి ఇవ్వలేదు. దీంతో నేతలు ఆరు బయట సమావేశం నిర్వహించి వెళ్లిపోయారు.


అవే తప్పులు

ఓటర్ల తుది జాబితాలో బయటపడుతున్న నిజాలు

డబ్లింగ్స్.. తొలగింపులు.. బోగస్ ఓటర్లు

ఒక్క పెద్దాపురంలోనే భారీగా..


ఓటర్ల తుది జాబితాలు తప్పులతడకలుగా దర్శనమిస్తున్నాయి. డబుల్ ఓట్లు, అక్రమ తొలగింపులు, బోగస్ ఓటర్ల వివాదాలు మళ్లీ చుట్టుముడుతున్నాయి. నందిగామ నియోజకవర్గంలో ఈ తరహా లోపాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. పూర్తిస్థాయిలో ఓటర్ల జాబితాలు చేతికందితే మరిన్ని అక్రమాలు బయటపడే అవకాశాలున్నాయి. - 4లో..


శాసనసభ నియోజకవర్గం సంఖ్య మరియు పేరు : 83-నందిగామ
విభాగం సంఖ్య మరియు పేరు : 1-శివాలయం సెంటర్ పెద్దాపురం

151 TAE0663393
ఓటరు పేరు : వీరభద్రరావు కీలం
తండ్రి పేరు: నాగమల్లేశ్వరరావు కీలం
ఇంటి సంఖ్య : 1-177
వయస్సు : 37 లింగము : పు

800 JSG2823284
ఓటరు పేరు : వీరభద్రరావు కీలం
తండ్రి పేరు: నాగమల్లేశ్వరరావు
ఇంటి సంఖ్య : 1-75/2A
వయస్సు : 38 లింగము : పు

ఒకే వ్యక్తికి ఉన్న రెండు ఓట్లు


208 TAE0657973
DELETED
209 TAE0657775
DELETED
211 TAE1407287
212

భార్య ఓటు తొలగించమని దరఖాస్తు చేస్తే.. భర్తది కూడా తొలగించారు..

సుబాబుల్.. సమస్యలు

- ఒక్కసారిగా ధర తగ్గించిన పేపరు కంపెనీలు
- లబోదిబోమంటున్న రైతులు



కంచికచర్ల : ఎన్నికలకు ముందు పేపరు కంపెనీలు వ్యూహాత్మకంగా దోపిడీకి తెరలేపాయి. మార్కెట్‌ను శాసిస్తున్న పెద్ద కంపెనీలు పేపరు తయారీలో ప్రధాన ముడి పదార్థమైన సుబాబుల్ కర్ర ధరను తగ్గించాయి. ఒక్కసారిగా కర్ర ధర టన్నుకు రూ.500 తగ్గించాయి. ధర రూ.5,300 నుంచి రూ.4,800కు తగ్గించడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో ఇంతకు ముందు లక్ష ఎకరాల్లో సుబాబుల్ తోటలు ఉండేవి. గత ఏడాది మార్చి వరకు రైతులకు గిట్టుబాటు ధర లభించలేదు. నిలువు దోపిడీకి గురయ్యారు. పేపరు కంపెనీలు ఇచ్చిందే ధర అన్నట్టుగా తయారైంది. టన్ను మద్దతు ధర రూ.4,400. ఖర్చులు పోగా, రైతుకు నికరంగా టన్నుకు రూ.3,600 అందాలి. అలాంటిది రూ.2,000 అందటం గగనమైంది. రోడ్డెక్కి ఆందోళనలు చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో పలువురు రైతులు తోటలను తొలగించారు. ఈ నేపథ్యంలో గత ఏడాది మార్చి నుంచి సుబాబుల్ ధరలో కదలిక ప్రారంభమైంది. కర్ర సరఫరా తగ్గటంతో రోజురోజుకూ ధర పెరుగుతూ వచ్చింది. మద్దతు ధరను మించి ఎక్కువ ధర అందింది. గత అక్టోబరు నుంచి నిన్నటి దాకా రైతులకు టన్నుకు రూ.5,300 అందాయి. నికరంగా రూ.7,000 వరకూ అందుతుందని రైతులు భావించారు. అలాంటిది రెండు నెలల్లో ఎన్నికలు జరగనున్న తరుణంలో పేపరు కంపెనీలు కొత్త పన్నాగం పన్నాయని రైతులు ఆరోపిస్తున్నారు. కంపెనీలు ఒక్కటై ఏకపక్షంగా ధరను తగ్గించాయి. ప్రధానమైన ఐటీసీ (భద్రాచలం)తో పాటు ఏపీపీఎం (రాజమండ్రి), ఇతర కంపెనీలు టన్నుకు రూ.500 వంతున ధరలో కోత విధించాయి. దీంతో టన్నుకు రూ.5,300 అందాల్సి ఉండగా, మూడు రోజుల నుంచి రూ.4,800 మించి ఇవ్వట్లేదు. ఒక్కసారిగా రూ.500 తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై పాలకులు కానీ, మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు కానీ కంపెనీలను గట్టిగా నిలదీసే పరిస్థితులు లేవు. ప్రస్తుతం నెలకొన్న పొడి వాతావరణం సుబాబుల్ తోటలు నరుకుడుకు అనుకూలం. ఎకరాకు 25 నుంచి 30 టన్నుల కర్ర వస్తుంది. టన్నుకు రూ.500 తగ్గటం వల్ల ఎకరాకు గరిష్ఠంగా రూ.15 వేలు నష్టపోవాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

పోరంకిలో అర్ధరాత్రి ఘోరం
- సైడ్ డ్రెయిన్‌లో ఇరుక్కుని ఇంటిపై పడిన కంకరు లారీ
- గోడ కూలి ఇంటి యజమాని మృతి

- 4లో..

ఆస్తి కోసం తండ్రి హత్య
రాయితో మోది హత్య చేసిన కొడుకు

- 4లో..

విద్యార్థిని ఆత్మహత్య
ఖర్చుల కోసం డబ్బులు ఇవ్వలేదనే..

రాజకీయ ఆట..!

ఆడుదాం ఆంధ్రలో వైసీపీ నేతల ఆటలు

- వారు సూచించిన వారికే క్రీడా కిట్లు
- వలంటీర్ల నుంచి డేటా తెప్పించుకుంటేనే ప్రాధాన్యం
- కొందరు పీఈటీల తీరు అధ్వానం
- ఆటల పేరుచెప్పి సొంత పనులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/భవానీపురం) : 'ఆడుదాం ఆంధ్ర' పేరుతో ప్రభుత్వం తలపెట్టిన క్రీడా పోటీల నిర్వహణపై అనేక ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికే ఈ పేరిట ఓట్ల వేట కోసం అధికార పార్టీకి అనుబంధంగా పనిచేసే వారికి కిట్లను పంచారన్న విమర్శలు వచ్చాయి. దీనిని అలుసుగా తీసుకుని కొందరు పీఈటీలు ఆటలను పంచేసుకుంటున్నారు. మైలవరం, తిరువూరు, గన్నవరం మండలాల్లో 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమం ఇష్టానుసారంగా జరుగుతోంది. ముందే గెలుపోటములను నిర్దేశించుకుని ఇష్టానుసారంగా ఆటలు ఆడుతున్నారు. ఈ గేమ్ మీది, ఆ గేమ్ మాది అన్నట్టుగా వ్యవహరిస్తూ క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. ఈ వ్యవహారంలో కొందరు పీఈటీలపై విమర్శలు వస్తున్నాయి. ఇలా ఆటలను పంచుకుంటుంటే క్రీడా స్ఫూర్తి ఏం కలుగుతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

అధికార పార్టీ నేతల కనుసన్నల్లో..

ఎన్నికల హడావుడిలో అధికారులు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఈ ప్రభుత్వ కార్యక్రమం పూర్తిగా అధికార పార్టీ నేతల చేతుల్లోకి వెళ్లింది. వలంటీర్ల ద్వారా సమాచారం తెప్పించుకుని ఆటలను పూర్తిగా రాజకీయం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న 'ఆడుదాం ఆంధ్ర' పోటీలకు వచ్చే వారంతా వలంటీర్లు పురమాయించినవారే. ఇలా వచ్చిన వారిలో అధికార పార్టీకి సంబంధించిన వారిని తమ కనుసన్నల్లో పనిచేసే పీఈటీల ద్వారా మంచి జట్లలో వేయిస్తున్నారు. వలంటీర్ల ద్వారా సమాచారం తెలుసుకుని అధికార పార్టీకి ఉపయోగపడే వారిని మండల స్థాయిల్లో మంచి టీముల్లో నియమిస్తున్నారు.

ఆటగాళ్లు కరువు

మండల స్థాయిలో ఇప్పటి వరకు జరిగిన పోటీలను చూస్తే, అసలు షెడ్యూల్ పాటించిన దాఖలాలే లేవు. దీంతో కసితో ఆడాలని వచ్చిన వారిలో నైరాశ్యం నెలకొంటోంది. ఈ పోటీలను వీక్షించటానికి జనాలు కూడా ఎవరూ రాకపోవటంతో క్రీడాకారులు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఓటు బ్యాంకును దృష్టిలో ఉంచుకుని ఈ క్రీడా పోటీలకు 15 సంవత్సరాల పైబడిన వారినే తీసుకోవటంతో సమస్యలు మరింత అధికమయ్యాయి. పేరు కోసం భారీ ఎత్తున రిజిస్ట్రేషన్లు చేయించినా, ఆ తర్వాత రాజకీయమయమైపోవటంతో చాలామంది క్రీడాకారులు తప్పుకొన్నారు.



దీంతో జట్ల సంఖ్య పడిపోయింది. షెడ్యూళ్లు కూడా కుదించాల్సిన పరిస్థితి ఏర్పడింది. మధ్యలో సంక్రాంతి సెలవుల కారణంగా చాలామంది ఆటగాళ్లు వెనుదిరిగారు. దీంతో ఆటగాళ్లు లేక, జనం లేక వెలవెలబోతున్న పోటీలు బయటకు తెలియకుండా ఉండటం కోసం ఇలా ఆటలను పంచుకుంటున్నారు. మండల స్థాయిలో జరిగిన ఆటల పోటీలన్నీ దాదాపు పంచేసుకున్నారన్న విమర్శలు వచ్చాయి. గత బుధవారం నుంచి నియోజకవర్గ స్థాయిలో ఆటల పోటీలు జరుగుతున్నాయి. మరోపక్క రాష్ట్ర, జాతీయ స్థాయి ఆటల పోటీలు సమీపిస్తున్నాయి. ఇలాంటి సమయంలో పీఈటీలు క్రీడాకారులకు తగిన శిక్షణ వంటివి ఇవ్వటం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది. కొందరు పీఈటీలు తమ సొంత పనులు చేసుకుంటున్నారు. ఒలింపిక్స్ సన్నాహక ఆటలు నిర్వహించాల్సిన తరుణంలో ఆడుదాం ఆంధ్ర పేరుతో పీఈటీలు సొంత పనులు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది.

దశాబ్దం తర్వాత కాముడు చెరువుకు విముక్తి

- లోకాయుక్త ఆదేశాలతో కదిలిన యంత్రాంగం
- ఆక్రమిత చెరువు భూమిలో ప్రభుత్వ బోర్డు ఏర్పాటు
- పదేళ్ల కిందట ఓ బడాబాబు ఆక్రమణ
- చెరువు పూడ్చి యథేచ్ఛగా సాగు
- లోకాయుక్త ఆదేశాలతో ఇప్పటికి కదిలిన అధికారులు


కాముడు చెరువు గతంలో ఇలా..


ఆక్రమణ తర్వాత..


ఇలా ఎండగట్టారు..


అక్రమంగా సాగు చేపట్టారు..


లోకాయుక్త ఆదేశాలతో బోర్డు

కాముడి చెర వీడే..

దశాబ్ద కాలానికి పైగా ఆ భూమి ఆక్రమణలో ఉంది. ఆక్రమిత భూమి అని తెలిసి కూడా రెవెన్యూ అధికారులు అటువైపు చూడలేదు. లోకాయుక్త చీవాట్లతో ఇప్పుడు అది ప్రభుత్వ భూమని రెవెన్యూ అధికారులకు గుర్తొచ్చింది. కొంపలంటుకుంటాయేమోనని ప్రభుత్వ భూమిగా బోర్డు పెట్టారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : గన్నవరం మండలం వెదురుపావులూరు గ్రామంలోని సర్వే నెంబర్ 765లోని కాముడు చెరువు ఆక్రమణకు సంబంధించి లోకాయుక్త ఆగ్రహంతో రెవెన్యూ అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఓ బడా రాజకీయ నాయకుడు ఈ భూమిని ఆక్రమించుకున్నాడని, సాగు కూడా చేస్తున్నాడని మాజీ సైనికోద్యోగి ఒకరు 2015లో ఫిర్యాదు చేశారు. అప్పటి విచారణ ఇప్పటికి తుది దశకు చేరుకుంది. రెవెన్యూ నిర్వాకంపై లోకాయుక్త సీరియస్‌గా స్పందించటంతో అధికారులు పరుగులు పెట్టి మరీ బోర్డును ఏర్పాటు చేశారు. చెరువులో బడాబాబు కొంతభాగం పూడ్చి చదును చేసి ఆపై సాగు చేపట్టాడు. యుద్ధ ప్రాతిపదికన ఇది ప్రభుత్వ భూమిగా బోర్డయితే పెట్టారు కానీ, స్వాధీనం దిశగా చర్యలు తీసుకోలేదు.

శాస్త్రీయ ఆధారాలతో ఫిర్యాదు

లోకాయుక్తకు సదరు సైనికోద్యోగి చేసిన ఫిర్యాదులో ప్రధానంగా కాముడు చెరువు ఆక్రమణలకు సంబంధించి శాస్త్రీయ ఆధారాలను పొందుపరిచారు. జియోగ్రాఫికల్ శాటిలైట్ చిత్రాల సహా సర్వే నెంబర్ల ఆక్రమణ వివరాలను ఫిర్యాదులో పేర్కొన్నారు. పాత మ్యాప్‌తో పాటు ప్రస్తుత శాటిలైట్ ఇమేజ్‌ను కూడా జోడించి ఆక్రమణ ఎలా జరిగిందో లోకాయుక్త దృష్టికి తీసుకెళ్లారు. రెవెన్యూ అధికారులు, మండల పరిషత్ డెవలప్‌మెంట్ అధికారులు, పంచాయతీ అధికారులకు తెలిసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవటాన్ని కూడా తన ఫిర్యాదులో ప్రస్తావించారు. దాదాపుగా తొమ్మిదేళ్ల విచారణ సాగి ఎట్టకేలకు సీరియస్‌గా లోకాయుక్త ఆదేశాలు జారీ చేసింది. బాధ్యులైన అధికారులపై చర్యలకు సిఫారసు చేసింది.

రెవెన్యూ మెలిక !

- రాష్ట్ర పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు భూములు అప్పగించకుండా సాగదీస్తున్న అధికారులు
- పంచాయతీ అనుమతి కావాలంటూ కొర్రీ
- అధికార పార్టీ నేతల అక్రమ మైనింగ్ కోసమేనా ?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): రాష్ట్ర పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు కేటాయిం చిన భూములను అప్పగించేందుకు రెవెన్యూ అధికారులు మెలిక పెడుతున్నారు. రెవెన్యూ చుట్టూ పోలీసు శాఖ కాళ్లరిగేలా తిరిగే పరిస్థితికి తీసుకొచ్చారు. రాష్ట్ర పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు గన్నవరం మండలం వెదురుపావులూరులో కొండ భూమిగా ఉన్న సర్వే నెంబర్ 717(పీ)లో ఐదెకరాలను ఎప్పుడో కేటాయించారు. ఈ భూములను స్వాధీనం చేయాల్సిన రెవెన్యూ అధికారులు చాలాకాలంగా అంతు లేని తాత్సారం చేస్తూ వచ్చారు. ఈ భూములను రాష్ట్ర పోలీసు ట్రైనింగ్ సెంటర్‌కు కేటాయించకపోవటంపై అనేక అనుమానాలు నెలకొంటున్నాయి. ఇటీవల గన్నవరం మండలంలో కొండలు, గుట్టలు, చెరువులు ఇలా ఏది పడితే దానిని కొట్టేస్తూ మైనింగ్ మాఫియా పేట్రేగిపోతోందని అందరికీ తెలిసిందే. ఈ పాపంలో రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉందన్న ఆరోపణలు అనేకమొచ్చాయి. పోలీసు ట్రైనింగ్ అకాడమీ కోసం కేటాయించిన భూములపైనా అధికార పార్టీకి చెందిన కొందరు నేతల కన్నుపడినట్టు తెలుస్తోంది. రానున్న రోజుల్లో ఈ కొండ భూముల్లోనూ అక్రమ మైనింగ్ చేయడం కోసం రెవెన్యూ అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు తెచ్చారని తెలుస్తోంది. ఏదో ఒక పేరు చెప్పి పోలీసు శాఖకు ఆ స్థలం బదిలీ కాకుండా రెవెన్యూ అధికారులే అడ్డుపడుతున్నారని తెలుస్తోంది. త్వరితగతిన ఈ భూముల అప్పగించాలని పోలీసు శాఖ నుంచి గన్నవరం రెవెన్యూ అధికారులను తాజాగా విజ్ఞప్తి వచ్చింది. తాజా విజ్ఞప్తిపైనా రెవెన్యూ అధికారులు మెలిక పెట్టారు. ఈ భూములను కేటాయించటానికి స్థానిక పంచాయతీ నుంచి అనుమతి పత్రం కావా లని చెప్పారు. వాస్తవానికి వెదురుపావులూరులోని సర్వే నెంబర్ 717(పీ) లోని ఐదెకరాల భూమి పంచాయతీకి సంబంధించినది కాదు.

పోలీసులది పక్షపాత వైఖరి

- టీడీపీ నేత రంగబాబుపై దాడి జరిగి వారమైంది
- ఇప్పటికీ దర్యాప్తు పూర్తి చేయలేదు: కొనకళ్ల నారాయణ
- నిందితులను అరెస్టు చేయాలని యార్లగడ్డ ఆధ్వర్యంలో దీక్ష
- సంఘీభావం తెలిపిన టీడీపీ, జనసేన నాయకులు





గన్నవరంలో నిరసన దీక్ష చేస్తున్న యార్లగడ్డ వెంకట్రావు, మాట్లాడుతున్న కొనకళ్ల నారాయణ

గన్నవరం, జనవరి 27: గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, టీడీపీ నేత కాసనేని రంగబాబుపై దాడి జరిగి వారం అవుతున్నా దర్యాప్తు పూర్తి చేయక పోవడం సరికాదని, పోలీసులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ కృష్ణా జిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ ఆరోపించారు. బస్టాండ్ సమీపంలో రంగబాబుపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో శనివారం నిరసన దీక్ష నిర్వహించారు. ప్రజల్లో ఉన్ననమ్మకాన్ని పోగొట్టుకోవద్దని పోలీసులకు ఆయన సూచించారు. ఎన్ని దాడులు జరిగినా, కేసులు పెట్టినా, జైలుకు పంపినా అదరకుండా నిలబడటం టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే సాధ్యమన్నారు. "పోలీసుల వైఖరి దుర్మార్గం. జిల్లా ఎస్పీ ఈ కేసు పట్ల బాధ్యతగా వ్యవహరించడం లేదు. పక్షదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నట్లు కనిపిస్తోంది. కారు నెంబర్‌తో టోల్‌గేట్ సీసీ ఫుటేజ్ ఆధారంగా కారులో ఎవరు ఉన్నారనేది తెలుసుకునే అవకాశమున్నా పోలీసు అధికారులు స్పందించడం లేదు. ప్రశాతంగా ఉండే గన్నవరం నియోజకవర్గంలో నాలుగేళ్లుగా దాడులు, కేసులు, ఆస్తుల ధ్వంసాలు చేయిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. పోలీసులు శాంతిని కాపాడటంలో విఫలమయ్యారు." అని యార్లగడ్డ వెంకట్రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. రాబోయే రోజుల్లో దీనిపై ప్రైవేటు కేసు వేస్తామన్నారు. సెక్షన్లు కూడా సరిగా పెట్టలేదన్నారు. ప్రజలు రోడ్డు ఎక్కక ముందే నిందితులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గన్నవరం ఎమ్మెల్యే వంశీ పని అయిపోయిందని, పెట్టే బెడా సర్దుకుని ఇంటికి పోయే సమయం వచ్చిందని గుడివాడ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. పోలీసులను అడ్డుపెట్టుకుని ఈ దుర్మార్గుడు చేసిన అన్యాయాలు లెక్కలేవన్నారు. రంగబాబుపై దాడికి సంబంధించి ఆధారాలు ఉన్నా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ ప్రశ్నించారు. ఎస్పీ అసమర్థతా- ప్రభుత్వ ఆదేశాలను అమలు చేస్తున్నారా? అని ఆయన ప్రశ్నించారు. నిందితులను అరెస్టు చేయకపోగా ఎస్పీ దాడులను సమర్థిచడం దారుణమన్నారు. టీడీపీ, జనసేన నాయకులు జాస్తి వెంకటేశ్వరరావు, గొడ్డళ్ల చిన్న రామారావు, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, దయాల రాజేశ్వరరావు, చిరుమామిళ్ల సూర్యం, దొంతు చిన్న, ఆళ్ల గోపాలకృష్ణ, మూల్పూరి సాయి కల్యాణి, మండవ లక్ష్మి, మేడేపల్లి రమాదేవి, గూడవల్లి నర్సయ్య, గుండపనేని ఉమా వర ప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, పడమట రంగారావు, చిమటా రవివర్మ, మండవ రమ్యకృష్ణ, జోడపాటి రవి, జి.తులసీమోహన్ పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు ?

గన్నవరం: గన్నవరం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాసనేని రంగబాబుపై జరిగిన దాడిలో పాల్గొన్న ఇద్దరు నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. గత ఆదివారం పొలం కావాలి చూపించమంటూ వచ్చి గుర్తు తెలియని అరుగురు కలిసి రంగబాబుపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చిన సంఘటన తెలిసిందే. గన్నవరం పోలీసులు రెండు బృందాలుగా ఏర్పడి వారు ఉపయోగించిన కారు, ఫోన్ నెంబర్లు ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఐతే దాడి చేసినవారంతా హైదరాబాద్ పాతబస్తీకి చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. తొలుత ఒక బృందం నెల్లూరు వైపు వెళ్లివచ్చింది. హైదరాబాద్ పాతబస్తీ కేంద్రంగా దర్యాప్తు చేయడంతో ఇద్దరు మాత్రమే దొరికారు. వీరిని ఎంత విచారించినా ఎవరో చెప్పారు. దాడి చేశామని మాత్రమే చెప్పినట్లు తెలిసింది. వాడిన కారు విజయవాడలో అద్దెకు తీసుకుని అప్పగించి మళ్లీ వెళ్లిపోయామని పోలీసులకు చెప్పినట్టు తెలిసింది. ఇంకా నలుగురు నిందితులు దొరకాల్సి ఉంది. వారి కోసం ఒక బృందం ముమ్మరంగా గాలిస్తున్నట్లు తెలిసింది. నిందితులను అదుపులోకి తీసుకున్న విషయం పోలీసులు గోప్యంగా ఉంచడం, ఈ కేసుకు సంబంధించి ఎలాంటి విషయాలు బయటకు చెప్పకపోవడం గమనార్హం.

గాంధీ కో ఆపరేటివ్ అర్బన్

బ్యాంక్ చైర్మన్‌పై అవిశ్వాసం

- ఫిబ్రవరి 12న మేనేజింగ్ కమిటీ సమావేశం

వన్‌టౌన్, జనవరి 27: విజయవాడ మ్యూజియం రోడ్డులోని గాంధీ కో ఆప రేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ వేమూరి వెంకటరావుపై బ్యాంక్ మేనేజింగ్ కమిటీ లోని ఏడుగురు సభ్యులు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో ఫిబ్రవరి 12న బ్యాంక్‌లో సమావేశం నిర్వహించేందుకు సహకార సంఘాల డిప్యూటీ రిజిస్ట్రార్ పి.కిరణ్‌కు మార్ ఉత్తర్వులు జారీ చేశారు. సహకార సంఘాల నియమ నిబంధనల మేరకు చైర్మన్‌పై ఏడుగురు సభ్యులు అవిశ్వాస తీర్మానం పంపారని, దీనిపై సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సమావేశానికి హాజరుకావాలని చైర్మన్‌తో పాటు మేనే జింగ్ కమిటీలోని 12మంది సభ్యులకు ఆయన నోటీసులు జారీ చేశారు. చైర్మన్ వేమూరి వెంకటరావు, మేనేజింగ్ కమిటీ సభ్యులు అబ్దుల్ ఖయ్యూమ్ అన్సారీ, కళ్లే నాగేశ్వరరావు, కోగంటి వెంకటరామయ్య, జోగరాజు, టీవీఎస్ అంజనేయరాజు, తల్లా ప్రగడ సుబ్బారావు, భోగాది శివరామకృష్ణప్రసాద్, సజ్జా వెంకట నాగసుభాష్‌తేజ, సగ్గుర్తి నాగేశ్వరరావు, సగ్గుర్తి వెంకటేశ్వరరావు, సుంకర కిషోర్‌బాబుకు నోటీసులు ఇచ్చి, వారి నుంచి అక్నాలెడ్జ్‌మెంట్లు తీసుకోవాలని బ్యాంక్ సీఈవోకు ఆదేశాలి చ్చారు. ఫిబ్రవరి 12న నిర్వహించే సమావేశానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వో మెరిట్ లిస్టుపై

అభ్యంతరాలకు గడువు తేదీ 31

కృష్ణలంక, జనవరి 27: ఎంఎల్‌హెచ్‌పీ/సీహెచ్‌వో పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరించి, పరిశీలించి ప్రొవిజినల్ మెరిట్ లిస్టును అన్ని జిల్లా వెబ్‌సైట్‌లలో పొందుపరిచామని, ఆ లిస్టుపై అభ్యంతరాలు ఉంటే జనవరి 29 నుంచి 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు తెలపాలని రాజ మహేంద్రవరం జోన్-2 ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు డాక్టర్ పి.పద్మా శశిధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యంతరాలను ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు, జోన్-2 రాజమహేంద్రవరంలో వ్యక్తిగతంగా లేదా జోన్2.ఎం ఎల్‌హెచ్‌పీ2023@జీమెయిల్.కామ్ ద్వారా సమర్పించాలని సూచించారు. జనవరి 31వ తేదీ సాయంత్రం 5 గంటల తర్వాత వచ్చిన అభ్యంతరాలు స్వీకరించబోమని ఆమె పేర్కొన్నారు.

గ్రూప్-1,2 ప్రిలిమ్స్‌కు బీసీ స్టడీ సర్కిల్స్‌లో ఉచిత శిక్షణ

కృష్ణలంక, జనవరి 27: ఏపీపీఎస్సీ గ్రూప్- 1, 2 ప్రిలిమినరీ పరీక్షకు రాష్ట్రం లోని 13 జిల్లాల్లోని బీసీ స్టడీ సర్కిల్స్‌లో డిసెంబరు 27 నుంచి ఉచిత శిక్షణ ప్రారంభించామని ఏపీ బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ శనివారం ఒక ప్రకటనలో తెలి పారు. అనుభవజ్ఞులైన అధ్యాపకులతో శిక్షణ ఇస్తున్నామని, రోజూ ప్రాక్టీస్, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. లైబ్రరీ సౌకర్యం ఉందని స్టడీ మెటీరి యల్ అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. స్టైఫండ్, బుక్స్ అలవెన్సు ఇస్తామని తెలిపారు. అర్హులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ అభ్యర్థులు శిక్షణ పొందేందుకు బీసీ స్టడీ సర్కిల్స్ లేదా బీసీ వెల్ఫేర్ అధికారిని ఏపీ బీసీ స్టడీ సర్కిల్, డోరు నెం.74-2-1/5, రోడ్డు నెం.8, అశోక్‌నగర్, పండరీపురం, ఎన్టీఆర్ జిల్లా, విజయ వాడ-520007లో లేదా ఫోన్ నెంబర్లు 9505094349, 9966849937లో సంప్రదిం చాలని సూచించారు.

రేపు జాతీయ సాంకేతిక వస్త్ర ప్రదర్శన

- జౌళిశాఖ కార్యదర్శి సునీత

అమరావతి: దేశంలోనే అత్యాధునిక సాంకేతిక వస్త్ర ప్రదర్శనను ఈ నెల 29న నగరంలో నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర చేనేత, జౌళిశాఖ ముఖ్య కార్యదర్శి కె.సు నీత తెలి పారు. 'నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్స్ కాన్ఫరెన్స్'లో భాగంగా సాంకేతికంగా విస్తృతమైన చర్చలు జరుగుతాయన్నారు. భవిష్యత్తు పోకడలు, ఆగ్రోటెక్ సొ ల్యూషన్స్ పెంపు, అవకాశాలు పెంచడం వంటి అంశాలు ప్రస్తావనకు వస్తాయన్నారు. కీలక సంస్థల సీఈవోలు, వస్త్ర తయారీదారులు, ఇంజనీర్లు, డిజైన ర్లు, విధాన రూపకర్తలు, ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొంటారన్నారు. చేనేత వస్త్ర పరిశ్రమ మరింత స్థిరమైన భవిష్యత్తు వైపు నడిపించే వినూత్న ఆవిష్కరణలు ఉంటాయన్నారు. అరటి ఫైబర్, జూట్, ఉన్ని తదితర వ్యవసాయ వ్యర్థాలతో తయారు చేసిన ఉత్పత్తులు ప్రదర్శనలో తిలకించవచ్చన్నారు.

2న ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ మహాధర్నా

విజయవాడ: భారత న్యాయసంహిత చట్టంలోని సెక్షన్ 106(1), 106(2) రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 2న నగరంలో మహాధర్నా నిర్వహిస్తున్నట్టు ఏపీపీటీడీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు సుందరయ్య తెలి పారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేయబోతున్న ఈ బిల్లులో పలు సెక్షన్లు డ్రైవర్లను తీవ్ర ఇబ్బందులు పెట్టేలా ఉన్నాయన్నారు. డ్రైవర్లకు సంఘీభావంగా ధర్నా చేస్తున్నట్టు చెప్పారు. దీంతో పాటు ఆర్టీసీ సమస్యలపైనా అదే రోజున నినదించను న్నామన్నారు. ఆర్టీసీలో పదోన్నతులు, కొత్త బస్సుల కొనుగోలు చేయాలని డిమాండ్ చేయనున్నట్టు చెప్పారు.

భర్త ఆచూకీ కనిపించలేదని ఫిర్యాదు

విద్యాధరపురం: కిరాయి డబ్బులు కోసం ఈనెల 20న ఇబ్రహీంపట్నం వెళ్లిన భర్త జేసీబీ డ్రైవర్ వెంకట శ్రీనివాసరావు శనివారం వరకు ఇంటికి తిరిగి రాలేదని భవానీపురానికి చెందిన ఎస్.విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చే సింది. ఈనెల 20న ఉదయం 9 గంటలకు ఇంటి నుంచి కిరాయి కోసం ఇబ్రహీంపట్నం వెళ్లాడు, ఈనెల 23న ఫోన్ చేస్తే కిరాయి డబ్బులు తీసుకుని వస్తానని భార్యతో చెప్పాడు. తరువాత నుంచి ఎలాంటి స్పందన లేదు. ఫోన్ కూడా తీయడం లేదు. దీంతో తన భర్త ఆచూకీ తెలియరాలేదని విజయలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. వెంకటశ్రీ వాసరావుకు-విజయలక్ష్మికి 13ఏళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు మగ పిల్లలు సంతానం.

'వెయిట్స్ అండ్ మెజర్స్' నూతన కార్యవర్గం ఎన్నిక

ధర్నాచౌక్: వెయిట్స్ అండ్ మెజర్స్ లైసెన్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ రాష్ట్ర కార్య వర్గ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం జరిగింది. ఏవీజీ భాస్కర్ రావు, దేవినేని రాంగోపాల్ చౌదరి అధ్యక్ష, కార్యదర్శులుగా, గజేంద్రనాయుడు, ఎస్కే ఇబ్రహీం ఉపాధ్యక్షుడు, వైస్ సెక్రటరీగా, శ్రీనివాస్ కోశాధికారిగా నూతన కార్యవర్గం ఎన్నికైంది. వారి సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చిచారు. రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా ఇన్‌చార్జ్‌లు, సభ్యులు పాల్గొన్నారు.

లీగల్ మెట్రాలజీ రిపేరర్స్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక

సత్యనారాయణపురం: లీగల్ మెట్రాలజీ రిపేరర్స్ ఏపీ లైసెన్స్ హోల్డర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక శనివారం జరిగింది. రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా బెజ్జం ప్రకాశరావు (విజయవాడ), అధ్యక్షుడిగా పీ అప్పారావు (మచిలీపట్నం) ప్రధానకార్యదర్శిగా టి.సాంబశివరావు (చీరాల) ఉపాధ్యక్షులుగా బెజ్జం సురేష్ (విజయవాడ), ఎండీ రెహ్మాన్ మునీర్ (పొదిలి) కోశాధికారిగా వై.రాజీవ్ (అమలాపురం) సహాయకార్యదర్శులుగా ఎస్కే సిరాప్ (నెల్లూరు) బీ.రాజేశ్వరరావు (విజయవాడ) ఎన్నికయ్యారు.



నూతన కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి

వ్యాపారుల సమస్యలను పరిష్కరించి

పన్నులు చెల్లించేలా చూడాలి

- హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి

వన్‌టౌన్, జనవరి 27: వ్యాపారవర్గాల సమస్యలను పరిష్కరించడంతో పాటు పన్నులు కూడా చెల్లించేలా చూడాలని హైకోర్టు న్యాయమూర్తి కిరణ్మయి అన్నారు. తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో శనివారం జరిగిన ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ టాక్స్ ప్రాక్టీషనర్ల సదరన్ జోన్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త కార్యవర్గం చేత ప్రమాణ స్వీకారం చేయించిన ఆమె మాట్లాడుతూ టాక్స్ ప్రాక్టీషనర్లు నిబద్ధతతో పనిచేయడంతో పాటు ప్రభుత్వానికి-వ్యాపారులకు వారధిగా పని చేయాలన్నారు. మరో అతిథి న్యాయవాది డాక్టర్ ఎంవీకే మూర్తి మాట్లాడుతూ ప్రాక్టీషనర్లకు చట్టాలపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. వాణిజ్య పన్నుల శాఖ మాజీ జాయింట్ కమిషనర్ పీవీ సుబ్బారావు మాట్లాడుతూ ప్రాక్టీషనర్లు వృత్తిపట్ల నిబద్ధతతో పనిచేయాలన్నారు. హైకోర్టు న్యాయవాది ఏంవీజేకే కుమార్ చట్టాలపై అవగాహన పెంచేందుకు సెమినార్లు నిర్వహించాలన్నారు. కార్యదర్శిగా ప్రమాణం చేసిన రమణ వందన సమర్పణ చేశారు. ఏపీ, తెలంగాణ, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పాండిచ్చేరి నుంచి 600 మంది పైగా సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు అండగా టీడీపీ

- మెగా మెడికల్ క్యాంప్‌లో కేశినేని చిన్ని

విద్యాధరపురం, జనవరి 27: టీడీపీ నిరంతరం పేదలకు అండగా ఉంటుందని సీనియర్ టీడీపీ నేత కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విద్యాధరపురం షాదీఖానాలో శనివారం కేశినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా మెడికల్ క్యాంప్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెడికల్ క్యాంప్‌లో వైద్య పరీక్షలు నిర్వహించిన వారినుద్దేశించి మాట్లాడారు. టీడీపీ ఎల్లవేళలా పేదలకు పూర్తిగా అండగా ఉంటుందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ-జనసేన సంయుక్త ప్రభుత్వం వస్తుందన్నారు. టీడీపీ-జనసేన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తొలుత మెడికల్ క్యాంప్‌ను కాంట్రేగుల రవీంద్ర, జనసేన అధికార ప్రతినిధి పోతిన మహేష్, పశ్చిమ సీనియర్ నేత ఎంఎస్ బేగ్‌తో కలిసి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రారంభించారు. పత్తి నాగేశ్వరరావు, కేఎస్ఆర్ఆర్ శర్మ, పీవీ సుబ్బయ్య, సురభి బాలు పాల్గొన్నారు. మొత్తం 3,863 మంది వైద్య శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. 1756 మందికి పరీక్షలు, 927 మంది కళ్లజోళ్లు, 98 మందికి కంటి ఆపరేషన్లు అవసరమవుతాయని నిర్ధయించారు. కంటి శస్త్రచికిత్సలు వచ్చేనెల 9న ఉయ్యూరు రోటరీ క్లబ్‌లో జరగనున్నాయి. 196 మంది గుండె పరీక్షలు, 177 మందికి ప్రసూతి, 1282 మందికి సాధారణ, 105 మంది క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు.



టీడీపీ ప్రచార పత్రాలు అందజేస్తున్న శివనాథ్, చిత్రంలో మహేష్



ఎయిర్‌పోర్టులో మాట్లాడుతున్న నారా లోకేశ్

అందరూ జగన్ రెడ్డిలా ఉండరు: లోకేశ్

గన్నవరం జనవరి 27: అందరూ జగన్ రెడ్డిలా ఉండరనీ, మనీ లాండరింగ్, వైట్ కాలర్ కుంభకోణాలన్నీ అయనకే తెలుసుననీ టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ధ్వజమెత్తారు. హైదరాబాదు నుంచి ప్రతేక విమానంలో గన్నవరం విమానాశ్రయానికి శనివారం మధ్యాహ్నం వచ్చారు. అమెరికాలో మనీ లాండరింగ్ అరెస్టు అయ్యారని సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు రావడంపై ఆయన స్పందించారు. అమెరికాలో మనీ లాండరింగ్ కేసులో అరెస్టు చేసింది, జగన్ రెడ్డినా, ఆయన కూతురినా, భారతి రెడ్డినా చెప్పాలన్నారు. సోషల్ మీడియాలో ట్రోల్ చేసిన గాడిదలను ఆ ప్రశ్న అడగాలని మీడియాతో అన్నారు. అనంతరం రోడ్డు మార్గాన ఉండవల్లి వెళ్లారు.

అవే తప్పులు

- ఓటర్ల తుది జాబితాలో బయటపడుతున్న తప్పులు
- డబ్లింగ్స్.. తొలగింపులు.. బోగస్ ఓటర్లు
- ఒక్క పెద్దాపురంలోనే భారీగా..

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): బోగస్ ఓట్ల వ్యవహారంతో నందిగామ నియోజకవర్గంలోని వీరులపాడు మండలం పెద్దాపురం గ్రామం ఇప్పటికే వార్తల్లో నిలిచింది. అక్రమంగా ఇంటర్ స్టేట్ బోగస్ ఓట్లు పుట్టుకొచ్చాయన్న ఉద్దేశంతో ఈ గ్రామంలో అలజడి రేగిన సంగతి తెలిసిందే. తుది జాబితా తర్వాత కూడా మళ్లీ అలాంటి తప్పులే కనిపిస్తుండటంతో ఆందోళన పెల్లుబికుతోంది. పెద్దాపురం గ్రామంలో ఈసారి డబ్లింగ్ ఓట్లు కలకలం సృష్టిస్తున్నాయి. దీనికి సంబంధించి 'ఆంధ్రజ్యోతి'కి ఆధారాలు చిక్కాయి.

డబ్లింగ్ ఓట్లు ఇవీ..

కీలం వీరభద్రరావుకు రెండు ఓట్లు ఉన్నట్టు వెలుగులోకి వచ్చింది. మొదటి ఓటు 800 సీరియల్ నెంబర్‌లో జేఎస్‌జీ2823284 నెంబర్‌తో ఉండగా, రెండోది 151 సీరియల్ నెంబర్‌లో టీఏఈ063393 ఉంది. ఇదే గ్రామంలో 1102 సీరియల్ నెంబర్‌లో దీపర్ కొరకొప్పుల (ఓటరు కార్డు నెంబర్ టీఏఈ1780212) ఉండగా, సీరియల్ నెంబర్ 589లోనూ ఓటరు కార్డు నెంబర్ టీఏఈ1776889తో ఉంది. కమల్ సాహెబ్ షేక్ ఓటరుకు సీరియల్ నెంబర్ 738లో టీఏఈ1788496 నెంబర్ ఉండగా, సీరియల్ నెంబర్ 724లో ఎస్‌వోఎక్స్1079459 ఓటరుకార్డు నెంబర్‌తో ఓటు ఉంది. ఇలా చెప్పుకొంటూ పోతే మరో డజను వరకు డబ్లింగ్ ఓట్లు ఉన్నాయి.

గతంలో ఓట్ల తొలగింపులు ఇవీ..

గతంలో గడ్డం వీరాస్వామికి ఏపీ130760363295 నెంబర్, రంగిశెట్టి శ్రీలక్ష్మికి టీఏఈ0686311 నెంబరుతో ఓటు ఉండేది. 2019, 2020, 2021 ఓటర్ల జాబితాల్లో వీరి పేర్లు ఉన్నాయి. కానీ, తుది జాబితాలో వీరి పేర్లు లేవు. ఇంకో విచిత్రం ఏమిటంటే, భార్య మీరాబీ షేక్ ఓటు తొలగింపునకు ఫాం-7 దరఖాస్తు చేస్తే, ఆమెతో పాటు ఆమె భర్త షేక్ మస్తాన్ వలీ ఓటును కూడా తొలగించడం గమనార్హం.

తెలంగాణా ఓట్లు ఇంకా తొలగించలేదు

ఓటర్ల తుది జాబితాలో కూడా ఇంకా తెలంగాణా ఓట్లు ఉండటం ఆందోళన కలిగిస్తోంది. పెద్దాపురం గ్రామంలో రహీమున్నీసా దూదేకుల (తెలంగాణా ఓటరు కార్డు నెంబరు ఆర్‌క్యూఎన్0541615)కు ఖమ్మం జిల్లా మధిరలో ఓటుహక్కు ఉంది. అక్కడే రేషన్ కార్డు కూడా ఉంది. ఇదే రహీమున్నీసాకు మన రాష్ట్రంలో నందిగామ నియోజకవర్గంలోని పెద్దాపురం గ్రామంలో (ఏపీ ఓటరు కార్డు నెంబర్ టీఏఈ1610609) ఓటుహక్కు ఉంది. అలాగే, దూదేకుల జానీ, దూదేకుల షాహిబ్జానీ ఓట్లు కూడా రెండు రాష్ట్రాల్లో ఉన్నాయి. ఫాం-7 ఇచ్చినప్పటికీ స్థానిక ఎన్నికల అధికారులు వీటిని తొలగించలేదు. ఇవి ప్రాథమికంగా మాత్రమే వెలుగుచూశాయి. ఇంకా ఓటర్ల జాబితాల పంపిణీ పూర్తికాలేదు. రాజకీయ పార్టీల బీఎల్‌ఏల చేతికి పూర్తిగా వచ్చాక అనేక అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.



వృద్ధులకు వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

సామాజికసేవలో 'రాబిన్‌హుడ్'

(ఆంధ్రజ్యోతి - విజయవాడ సిటీలైఫ్): ఒకరు వైద్యుడు, మరొకరు ఇంజనీర్.. ఇంకొకరు స్టూడెంట్.. వారి రంగాలు వేరైనా సేవ మాత్రం ఒకటే. వివిధ రంగాల్లో స్థిరపడిన వారిని, చిన్నారుల నుంచి యువకులను ఒక గొడుకు కిందకు తీసుకొస్తోంది రాబిన్‌హుడ్ ఆర్మీ (ఆర్‌హెచ్‌ఏ). నగరంలో కొన్నాళ్ల క్రితం సామాజిక సేవను ప్రారంభించిన ఆర్‌హెచ్‌ఏలోకి సభ్యులు రోజురోజుకూ పెరుగుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఈ ఆర్‌హెచ్‌ఏ ముందుగా తిండి లేని నిరుపేదలకు ఆహారాన్ని అందించాలని సంకల్పించింది. విందుల్లో మిగిలిన ఆహార పదార్థాలను సేకరించి నిరుపేదలకు అందిస్తున్నారు. అనాథ, వృద్ధాశ్రమాల్లోని వారికి ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వైద్య పరీక్షలు మందులు అందిస్తున్నారు. మరోపక్క పచ్చదనం-పరిశుభ్రతపై విద్యార్థులకు బాల్యం నుంచే అవగాహన కల్పిస్తున్నారు. గణతంత్ర దినోత్సవం, స్వాతంత్ర దినోత్సవం రోజున విద్యార్థులతో కలిసి వీధులను శుభ్రం చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి వీధుల్లోని చెత్తను విద్యార్థులే ఎత్తి డంపింగ్ వాహనాల్లో వేస్తున్నారు. సామాజిక సేవలో రాబిన్‌హుడ్ ఆర్మీకి నగర వాసుల నుంచి ప్రశంసలు అందుకుంటోంది.

ప్రభుత్వ కళాశాల సిబ్బందికి ప్రశంసాపత్రాలు

కృష్ణలంక: గణతంత్ర దినోత్సవం సందర్భంగా కలెక్టర్ చేతుల మీదుగా ఎస్ఆర్ఆర్ & సీవీఆర్ కళాశాలకు చెందిన అధ్యాపకులు డాక్టర్ బి.యుగంధర్, డాక్టర్ కె.రమేష్, సిబ్బంది జి.మురళి, ఎం.కుమార్ ప్రశంసాపత్రాలు అందుకున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు.

పోరంకిలో అర్ధరాత్రి ఘోరం

- సైడ్ డ్రైయిన్‌లో ఇరుక్కుని ఇంటిపై పడిన కంకరు లారీ
- గోడ కూలి ఇంటి యజమాని అక్కడికక్కడే మృతి



ఇంటిపై పడ్డ లారీని క్రేన్ సాయంతో తీస్తున్న స్థానికులు

పెనమలూరు, జనవరి 27: పేద బతుకులు.. యజమాని ఇంటి పోషణకు గుడిలో వాచ్‌మన్‌గా పని చేస్తాడు. భార్య దగ్గర్లోని ఓ పచ్చళ్ల కంపెనీలో కూలికి వెళుతుంది. ఒక్కగానొక్క కొడుకు బ్యాంకులో అటెండరుగా పని చేస్తున్నాడు. కంకరు లారీ రూపంలో వచ్చిన మృత్యువు ఆ ఇంటి యజమానిని బలి తీసుకుంది. దీంతో ఆ కుటుంబం శోక సముద్రంలో మునిగింది. ఈఘటన శుక్రవారం అర్ధరాత్రి పోరంకి యాదవుల బజారులో జరిగింది. పోరంకికి చెందిన మేడి శంకర్ సీతాపురం కాలనీలో ఒక గుడిలో వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి ఆరోడ్డులోకి కంకరు హెవీ లోడ్‌తో ఉన్న పదిటైర్ల లారీని ప్రవేశించే అవకాశం లేక పోయినా డ్రైవర్ రివర్స్ చేస్తూ వెళ్లాడు. దీంతో లారీ సైడుకాల్వలోకి ఒరిగింది. దీంతో లారీ బాడీభాగం పక్కనే ఉన్న శంకర్ ఇంటి గోడపై పడింది. దీంతో గోడ కూలి ఇంట్లో నిద్రిస్తున్న శంకర్‌పై పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆస్తి కోసం తండ్రిని

హతమార్చిన కొడుకు

పెనుగంచిప్రోలు, జనవరి 27: వెంగనాయకునిపాలెంలో ఆస్తి కోసం కన్నతండ్రిని ఓ కుమారుడు కడతేర్చాడు. ఈఘటన శుక్రవారం రాత్రి జరిగింది. జగ్గయ్యపేట సీఐ ఎం.జానకిరామయ్య కథనం మేరకు ముండ్లగిరి చిన్న వెంకటేశ్వర్లు(50) గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పని చేస్తున్నాడు. భార్య పదిహేనేళ్ల క్రితమే మరణించింది. పెద్ద కొడుకు నరేంద్ర, చిన్న కొడుకు నవీన్‌లకు వివాహాలు కాలేదు. తండ్రి, చిన్నకుమారుడు నవీన్ ఒకే ఇంట్లో ఉంటున్నారు. పెద్ద కొడుకు నరేంద్ర విడిగా ఉంటున్నాడు. చిన్న వెంకటేశ్వర్లుకు అరెకరం పొలం, సొంత ఇల్లు ఉంది. ఇల్లు, పొలం అమ్మి తనకు వచ్చే వాటా ఇవ్వాలని పెద్ద కొడుకు నరేంద్ర తండ్రితో కొంత కాలంగా గొడవలు పడుతున్నాడు. శుక్రవారం రాత్రి చిన్న కుమారుడు లేని సమయంలో తండ్రిపై నరేంద్ర రాయితో దాడి చేసి హత్య చేశాడు. చిన్న కుమారుడు నవీన్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సీహెచ్ కనకదుర్గా ప్రసాద్ తెలిపారు.

ఇంజనీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

మైలవరం, జనవరి 27: ఖర్చుల నిమిత్తం తన కజిన్ బ్రదర్ డబ్బులు ఇవ్వలేదని మనస్తాపం చెంది పట్టణంలోని ఓ కళాశాలలో ఇంజనీరింగ్ ద్వితీయ ఏడాది చదువుతున్న బొర్రా రోషిణి(20) కళాశాల హాస్టల్ భవనంలో శనివారం తెల్లవారుజామున ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం చందర్లపాడు మండలం ముప్పాళ్ల గ్రామానికి చెందిన బొర్రా నరసింహారావు కుమార్తె రోషిణి మైలవరంలో ఓ ప్రైవేట్ కళాశాలలో హాస్టల్లో ఉంటూ చదువుకుంటోంది. ఖర్చులకు డబ్బులు అవసరం వచ్చి కజిన్ బ్రదర్‌ను అడిగింది. అతను లేవని చెప్పడంతో మనస్థాపం చెంది ఆత్మహత్య పాల్పడింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ ఎమ్.రమేష్ తెలిపారు.

30న సర్పంచ్‌ల నిరాహార దీక్ష

ఉయ్యూరు, జనవరి 27: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఈనెల 30న మచిలీపట్నంలో సర్పంచ్‌ల రిలే నిరాహారదీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి కృష్ణాజిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గోలి వసంతకుమార్ తెలిపారు. డిమాండ్లను ఆమోదించాలని పంచాయతీరాజ్ చాంబర్, సర్పంచ్‌ల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళన, ఉద్యమ కార్యాచరణలో భాగంగా దీక్ష చేస్తున్నామని ఆయన తెలిపారు. శనివారం ఆకునూరులో విలేకరులతో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు విడుదల చేసిన నిధులు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని, పంచాయతీల ఖాతాల్లో రూపాయి కూడా లేకుండా చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేయలేకపోతున్నామని తెలిపారు. కనీసం మౌలిక వసతులు కల్పించలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

31న విభిన్న ప్రతిభావంతుల జాబ్‌మేళా

కృష్ణలంక, జనవరి 27: ఉపాధి కల్పన శాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, యూత్ ఫర్ జాబ్స్ ఫౌండేషన్ అధ్వర్యంలో విజయవాడ ఐటీఐ కళాశాల ప్రాంగణంలోని ఉపాధి కల్పన అధికారి కార్యాలయంలో విభిన్న ప్రతిభావంతులకు ఈనెల 31వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి దేవరపల్లి విక్టర్‌బాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎస్.శ్రీనివాసరావు శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మేళా ప్రారంభమవుతుందని, 18 నుంచి 35 ఏళ్లలోపు వారు 10వ తరగతి ఆపై చదివిన విభిన్న ప్రతిభావంతులు పాల్గొనవచ్చని వారు పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఏడాదికి రూ.1.2 లక్షల నుంచి రూ.3 లక్షల వరకు వేతనం లభిస్తుందని తెలిపారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలు, ఆధార్‌కార్డు జిరాక్సు కాపీలతో నేరుగా ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు. హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూ.డబ్ల్యూ.ఎన్‌సీఎస్.జీవోవీ.ఇన్ లింక్ ద్వారా వివరాలను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 82424 16211 నెంబరులో సంప్రదించాలని వారు సూచించారు.

ప్రత్యేక ప్రమాణాలున్న పుస్తకాలే చదవండి

- గ్రూప్-2 అభ్యర్థులకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు సూచన

గవర్నర్‌పేట, జనవరి 27: గ్రూప్-2 పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు ప్రత్యేకమైన ప్రమాణాలు కలిగిన పుస్తకాలు, తెలుగు అకాడమీ నూతనంగా అచ్చువేయించిన గ్రూప్-2 పుస్తకాలను చదివితే విజయం సాధించవచ్చని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ టి.జమలపూర్ణమ్మ అధ్యక్షతన గ్రూప్-2 పరీక్షలపై శనివారం నిర్వహించిన అవగాహనా సదస్సులో ఆయన మాట్లాడారు. ఆయన రచించిన ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ, భారత సమాజం స్టడీ మెటీరియల్‌ను జమలపూర్ణమ్మ ఆవిష్కరించారు. గ్రంథాలయాధికారిణి కె.రమాదేవి పాల్గొన్నారు.

చమురు నిక్షేపాల్లో 50 శాతం రాష్ట్రానికివ్వాలి

- జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని

ధర్నాచౌక్, జనవరి 27: రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి బేసిన్‌లోని సహజ వాయువు, చమురు నిక్షేపాల్లో రాష్ట్రానికి 50 శాతం కేటాయించాలని జై ఆంధ్ర డెమోక్రటిక్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ తరుణ్ కాకాని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో ఫోరం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. 12వ ఆర్థిక సంఘం సిఫార్సులను అమలు చేయాలని, రాష్ట్రంలోని అన్ని ప్రధాన పార్టీలు తమ ఎన్నికల ఎజెండాలో ఆయా అంశాలను చేర్చాలని తరుణ్ డిమాండ్ చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వాన్ని కేంద్రంలో అధికారంలోకి రాకుండా ఓడించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తల దోపిడీని అరికట్టాలని, పారిశ్రామికాభివృద్ధి చేసి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పలువురు వక్తలు డిమాండ్‌చేశారు. కాకాని ఆశయ సమితి సభ్యులు గుమ్మడి రామకృష్ణ, కోనేరు బసవేశ్వరరావు, వేములపల్లి వెంకట రమణ, ఫోరం నేతలు మేడా శ్రీనివాస్, బేతు రామ్మోహన్‌రావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	119, 127, 138
చికెన్ విత్ స్కిన్	226
చికెన్ స్కిన్‌లెస్	236

నెక్ కోడిగుడ్డు ధర
విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.40



శ్రీకృష్ణ దేవరాయలకు ఘన నివాళి

వన్‌టౌన్: శ్రీకృష్ణదేవరాయల 554వ జయంతి సందర్భంగా వన్‌టౌన్ రాజీవ్‌గాంధీ పార్కు ఎదురుగా కృష్ణానది తీరాన ఉన్న ఆయన విగ్రహానికి శనివారం ఆంధ్రప్రదేశ్ రాయల సేన ఆధ్వర్యంలో ఘన నివాళి కార్యక్రమం జరిగింది. రాయల విగ్రహానికి జనసేన పశ్చిమ ఇన్‌ఛార్జి పోతిన మహేశ్ పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. పలువురు నాయకులు, రాయల సేన సభ్యులు పాల్గొన్నారు.



శ్రీకృష్ణ దేవరాయల విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పోతిన మహేశ్ తదితరులు

టీడీపీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌ల సమావేశంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

పటమట, జనవరి 27 : టీడీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అమలు చేసే సంక్షేమ పథకాలను చంద్రబాబు భవిష్యత్తుకు గ్యారెంటీ పేరుతో ప్రకటించారని, ఆ పథకాలను కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ సూచించారు. అశోక్‌నగర్‌లోని గద్దె కార్యాలయంలో శనివారం క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు, డివిజన్ అధ్యక్షులతో ఇంటిగ్రేటెడ్ శిక్షణా కార్యక్రమం జరిగింది. ఈ శిక్షణలో రాష్ట్ర పార్టీ పరిశీలకులు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ ఈ నెల 22న ఎన్నికల కమిషన్ విడుదల చేసిన తుది ఓటర్ల జాబితాను నిశితంగా పరిశీలించాలని, లోపాలు ఏమైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. పార్టీ పరిశీలకుడు కతురాజు శ్రీనివాసాచారి మాట్లాడుతూ గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేశామని, వైసీపీ నవరత్నాల పేరిట అవాస్తవాలను ప్రచారం చేశారని, తద్వారా వారు విజయం సాధించారని తెలిపారు. భవిష్యత్తుకు గ్యారెంటీలో పొందుపరిచిన సంక్షేమ పథకాల కరపత్రాలను, బాండ్ పేపర్‌ను ప్రతి ఇంటికి అందజేయాలని కోరారు. పార్టీ పరిశీలకులు ఏ. శ్రీనివాస రావు, దేవరశెట్టి సాయిగోపి, మల్లాది జగదీశ్వర్, ఎస్. ఫిరోజ్, ముమ్మనేని ప్రసాద్, శాయన సత్యనారాయణ, గద్దె ప్రసాద్ పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న గద్దె రామ్మోహన్



మాట్లాడుతున్న ఇందిర

దొంగ ఓట్లను గుర్తించండి

కృష్ణలంక: బూత్ కన్వీనర్లు, క్లస్టర్లు తమ తమ బూత్‌లలో ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకొనేలా, దొంగ ఓట్లను గుర్తించేలా చూడాలని టీడీపీ రాష్ట్ర కార్యాలయ ఇన్‌చార్జి ఇందిరా ప్రియదర్శిని తెలిపారు. శనివారం కృష్ణలంకలోని టీడీపీ కార్యాలయంలో 21, 22 డివిజన్లలోని బూత్ కన్వీనర్లు, యూనిట్ ఇన్‌చార్జిలు, క్లస్టర్లతో ఆమె (ఇంటిగ్రేటెడ్ ట్రైనింగ్) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిర మాట్లాడుతూ ప్రతి ఇంటికి మీరంతా వెళ్లి చంద్రబాబు గతంలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలు తెలియజేస్తూ, బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ ద్వారా ప్రజలకు అందించే ఆరు పథకాలు గురించి ప్రజలకు తెలియజేయాలన్నారు. టీడీపీ-జనసేన పార్టీ అభ్యర్థులకు భారీ మెజార్టీలు వచ్చే విధంగా తమ ఓటు వినియోగించుకోవాలని కన్వీనర్లు, క్లస్టర్లు ఓటర్లకు తెలియజేయాలన్నారు. టీడీపీ బీసీ రాష్ట్ర నాయకులు గొరిపర్తి నామేశ్వరరావు, డివిజన్ అధ్యక్షుడు వేములపల్లి రంగారావులు మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్త టీడీపీ-జనసేన కలయికలో గద్దెకు భారీ మెజార్టీ వచ్చే విధంగా కృషి చేయాలన్నారు. కొర్రా అప్పన్న, పోడూరు పవన్‌కుమార్. పెరుమాళ్ల గురునాథం, ఆర్.రమాదేవి, కేశనం భావన్నారాయణ, వెన్నా శంకర్, పెద్ది అన్నారావు, గొర్ల గోవిందు పాల్గొన్నారు.

మానసిక, వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు

● స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీనియర్ కోచ్ వినాయక ప్రసాద్

పటమట, జనవరి 27 : క్రీడల వల్ల శారీరక దారుఢ్యం పెరుగుతుందని, మానసిక వికాసం వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు తోడ్పడతాయని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా సీనియర్ కోచ్ వినాయక ప్రసాద్ తెలిపారు. శనివారం మారిస్ స్టెల్లా కళాశాలలో స్పోర్ట్స్ డే ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి వినాయక ప్రసాద్ మాట్లాడుతూ కళాశాలల్లో అంతర్జాతీయ స్థాయిలో క్రీడావసతులు కల్పిస్తూ విద్యతో పాటు సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తున్నానని తెలిపారు. కళాశాల పూర్వ విద్యార్థిని, ఘంటశాల ఎంపీడీవో టి. అనుహ్య మాట్లాడుతూ కళాశాలలో అధ్యాపకులు పూర్తి సహకారం అందిస్తారని, తాను కళాశాలలో చదువుకున్నప్పటి రోజులను జ్ఞాపకం చేసుకున్నారు. విద్యార్థినులు క్రమం తప్పకుండా పుస్తక పఠనం చేయాలని, నిరంతరం ఒక లక్ష్యాన్ని పెట్టుకుని కృషి చేయాలని పిలుపునిచ్చారు. వివిధ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థినులకు వినాయక ప్రసాద్, అనూహ్యలు మెడల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ రేఖా, కరస్పాండెంట్ డాక్టర్ సిస్టర్ లీనా క్వాడ్రస్, డిగ్రీ వైస్ ప్రిన్సిపాల్ ఉషాకుమారి, స్పోర్ట్స్ కోచ్ రాజు, వ్యాయామ అధ్యాపకురాలు సునీత, పద్మజ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వినాయక ప్రసాద్

ఏకేటీపీఎం పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

సత్యనారాయణపురం, జనవరి 27: స్థానిక ఏకేటీపీఎం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలకు సాయిమణికంఠ కేటర్స్ అధినేత జోన్నలగడ్డ రమేష్ బాబు శనివారం మైక్‌సెట్ అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవసరమైతే పాఠశాలకు మరింత సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఎన్‌సీసీ ఉపాధ్యాయుడు టి. ప్రకాష్, పేరెంట్ కమిటీ సభ్యులు అంబటి వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చేతిరాత, డ్రాయింగ్ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు

కృష్ణలంక, జనవరి 27 : కృష్ణలంకలోని సుధాకర్స్ ఐడియల్ స్కూల్‌లో శనివారం నిర్వహించిన చేతిరాత, డ్రాయింగ్ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు స్కూల్ ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. స్కూల్ చైర్మన్ సుధాకరరెడ్డి, ప్రిన్సిపాల్ రామకోటేశ్వరరావు, స్కూల్ హెడ్ దేవినేని వరలక్ష్మి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన

చిట్టినగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : కొండ ప్రాంత ప్రజలకు తాగునీటిని సక్రమంగా సరఫరా చేయాలని సీపీఐ ఆధ్వర్యంలో మహిళలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ కొండ ప్రాంత ప్రజలు తాగునీటికి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తాగునీటి ఎద్దడి సమస్య పరిష్కారం కాకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 20 రోజులుగా ఆంజనేయ వాగు దగ్గర నుంచి టన్నెల్ వరకు ఉన్న కొండ ప్రాంతాలకు తాగునీరు సరఫరా కావడం లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు డీవీ రమణబాబు, రమణారావు, రమణ, కనకారావు, పార్వతి, సింహాచలం, వెంకటేశ్వరరావు, జనార్ధన్ పాల్గొన్నారు.

కాపు మహిళలకు పెళ్లి కానుక అమలు చేయాలి

● ప్రజా కాపునాడు అధ్యక్షుడు యర్రంశెట్టి

గవర్నర్‌పేట, జనవరి 27: పేద కాపు మహిళలకు పెళ్లి కానుక పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయాలని ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆలీబేగ్ వీధిలోని సంఘ కార్యాలయంలో ప్రజా కాపునాడు సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాపులంతా ఐక్యంగా అభివృద్ధి, సంక్షేమ పథకాల కోసం పోరాటాలు చేయాలని కోరారు. ప్రజా కాపునాడు గుంటూరు జిల్లా నూతన కార్యవర్గ నియామకాన్ని చేశారు. కమిటీ అధ్యక్షుడుగా యర్రంశెట్టి నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా యడ్ల వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడిగా వెలినీడి వెంకటాద్రి, నల్లగట్ల శ్రీనివాసనాయుడుల నియామక పత్రాలను రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు అందజేశారు.

బీసీలకు పుట్టినిల్లు టీడీపీ: బొండా ఉమా

పాయకాపురం, జనవరి 27 : బీసీల పుట్టినిల్లు టీడీపీ అని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 63వ డివిజన్ వడ్డెర కాలనీలో శనివారం జయహో బీసీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బీసీలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేసి అన్ని విధాల బీసీల అభివృద్ధికి కృషి చేశామని వివరించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చేతి వృత్తిదారులకు సబ్సిడీ రుణాలతో పాటు వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పైడి శ్రీను, లబ్బా వైకుంఠం, బత్తుల కొండ, పిరియా సోమేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న బొండా ఉమా

నిలిచిపోయిన పథకాల నిధులు జమ చేయండి

● టీడీపీ ఫ్లోర్‌లీడర్ బాలస్వామి

గవర్నర్‌పేట, జనవరి 27: రాష్ట్ర వ్యాప్తంగా చిన్నచిన్న కారణాలు చూపి అమ్మఒడి, కాపునేస్తం, వాహనమిత్ర, ఆసరా వంటి ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ఖాతాల్లో నిధులు జమచేయకుండా నిధులు నిలిపివేశారని, వాటి విడుదలకు చర్యలు తీసుకుని పథకాల లబ్ధిదారులకు న్యాయం చేయాలని 23వ డివిజన్ కార్పొరేటర్, టీడీపీ ఫ్లోర్‌లీడర్ నెలిబండ్ల బాలస్వామి డిమాండ్ చేశారు. శనివారం సూర్యారావుపేటలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పథకాలు అమలు సమయానికి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది చేసిన పొరపాట్లు, అవకతవకల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది లబ్ధిదారుల ఖాతాల్లో నిధులు జమచేయలేదని వెల్లడించారు. కార్పోరేషన్, మున్సిపల్ కమిషనర్లు, మండల డెవలప్‌మెంట్ అధికారుల పరిశీలనకు దరఖాస్తులు నోచుకోని కారణంగా నిధులు జమ కావడం లేదని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారని పేర్కొన్నారు. విజయవాడ కార్పొరేషన్ పరిధిలోనే వేలాది మంది లబ్ధిదారులు పథకాల సొమ్ము జమకాక సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి నిధులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణకు కృషి చేయాలని కోరుతూ ర్యాలీ



కార్యక్రమంలో పాల్గొన్న మాల్యాద్రి

మాచవరం, జనవరి 27 : మత సామరస్యతకు, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్రూ మాల్యాద్రి సూచించారు. మాచవరంలోని టీఎంఆర్ అండ్ సీఎంఎస్ పాఠశాల విద్యార్థులతో మతసామరస్యతకు, రాజ్యాంగ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం రాజ్యాంగ పీఠికపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కేవీ కోటేశ్వరరావు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం లేని జీవితం వృథా

● కేయూ ఆంగ్ల విభాగ అధ్యాపకుడు డాక్టర్ కోటేశ్వరరావు

వన్‌టౌన్, జనవరి 27: లక్ష్యం లేని జీవితం వృథా అని కృష్ణా విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగ అధ్యాపకుడు డాక్టర్ ఎం. కోటేశ్వరరావు అన్నారు. కేబీఎన్ కాలేజీ ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో జీవిత నైపుణ్యాలు-లక్ష్యాన్ని సాధించడం ఎలా అంశంపై జరిగిన సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు అత్యున్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలన్నారు. లక్ష్యం లేని జీవితం వృథా అన్నారు. లక్ష్యాన్ని సాకారం చేసుకోవడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేయాల్సిన అవసరంపై, ఇందుకు అవసరమైన నైపుణ్యం పెంపొందించడంపైన ఆయన నొక్కి చెప్పారు. లక్ష్యాన్ని ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. నారాయణరావు, విభాగాధిపతి డాక్టర్ హెచ్ నరేంద్రకుమార్, అధ్యాపకులు బి. మోహనతేజ, కె.రాధ పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న డాక్టర్ కోటేశ్వరరావు

హెచ్‌ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం పంపిణీ

పాతరాజరాజేశ్వరి పేట, జనవరి 27 : నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పెజ్జోనిపేటలోని నీతోడు మానసిక వికాస కేంద్రంలో శనివారం హెచ్‌ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నవజీవన్ బాలభవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాదర్ నీలం రత్నకుమార్ మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని, తద్వారా కుటుంబం అంతా ఆనందంగా ఉంటుందన్నారు. అనంతరం హెచ్‌ఐవీ బాధిత కుటుంబాలకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. నవజీవన్ బాల భవన్ ప్రోగ్రాం మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు, సైకాలజిస్ట్ జి. అనూష, వలంటీర్లు హైమావతి, దుర్గా, రాణి పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవస్థానం పనులు పూర్తి

గవర్నర్‌పేట, జనవరి 27: చల్లపల్లి బంగ్లా సమీపంలోని శ్రీ కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో రూ. 1. 20 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తి కావడంతో శుక్రవారం రాత్రి సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ప్రారంభించారు. అభివృద్ధి పనులు ప్రారంభ సూచికగా ఏర్పాటు చేసిన శిలాఫలకం ఆవిష్కరణ కార్యక్రమానికి 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి, ఆలయ ఈవో నూతక్కి వెంకట సాంబశివరావు, దేవాలయం అర్చకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే విష్ణు, కార్పొరేటర్ బాలస్వామి

ద్విచక్రవాహనం చోరీ

అజిత్‌సింగ్‌నగర్: ద్విచక్రవాహనం చోరీ ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం దేవీనగర్ ప్రాంతానికి చెందిన షేక్ షఫీక్ బాష ఈనెల 14న రాత్రి తన ద్విచక్రవాహనంపై ఇంటికి వచ్చి తాళం వేసి లోపలికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం చూడగా ద్విచక్రవాహనం కనిపించలేదు. ద్విచక్రవాహనం చోరీకి గురైనట్టు భావించి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.


CHADALAVADA BROTHERS
PRESENTS
GRAND RELEASE
FEB 2ND
TRAILER
OUT NOW
ధీర
Nizam & Vizag
SRI VENKATESWARA FILMS
Andhra pradesh
RADHAMADHAVI FILMS
#DHEERAMOVIE
/STTVFILMS


FEB
2
2024
GRAND RELEASE
WORLDWIDE
BUNNY VAS & VENKATESH MAHA
PRESENT
అంబాజీపేట
మ్యారేజి బ్యాండు
DHEERAJ MOGILINENI
DUSHYANTH KATIKANENI


మీ జీతాలతో మా జీవితాలు మార్చండి
GLOBAL FILMS
KATHA VENTURES
FEBరవరి
2nd
టాకీస్ ల కలుద్దాం
బూట్ CUT
బాలరాజు
MD. PASHA
SREE KONETI


ఫిబ్రవరి
2న
విడుదల
TEENA SREE CREATIONS
PRODUCER M NAGA MUNEIAH (MUNNA)
CO - PRODUCERS NANDIPATI SRIDHAR REDDY KONDRASI UPENDER
STORY - SCREENPLAY - DIALOGUES - DIRECTION MUNI SAHEKARA
MUSIC VINOD YAJAMANYA LYRICS MUNI SAHEKARA D.O.P S.V.SIVARAM
EDITOR SHIVA SARVANI PRODUCTION EXECUTIVE BANDI SRINIVAS RAO
THRILLS DRAGAN PRAKASH CHOREOGRAPHER KAPIL MASTER, BALU MASTER DIGITAL
PROMOTIONS CHANDRA, VINEETH GOUD, MANOHAR CG CHERRY SANTHOSH
DI ARYAN MOULI PUBLICITY DESIGNS JK FRAMES P.R.O B. VEERABABU
DIRECTION DEPARTMENT THOTA SRIKANTH-TADI SATHYA-JAGAN-PURUSHOTTHAM-SUBHANI NAGA BABU
MECHANIC
మెకానిక్
TROUBLE SHOOTER


తొంభై రెండు సంవత్సరాల తెలుగు సినిమా
సంక్రాంతి రికార్డుల చరిత్ర తిరగరాసిన హనుమాన్
||జై శ్రీ రామ్||
3RD
WEEK
PRASANTH VARMA CINEMATIC UNIVERSE
హను మాన్
PRODUCED BY K NIRANJAN REDDY
WRITTEN & DIRECTED BY PRASANTH VARMA
TELUGU HINDI MARATHI TAMIL KANNADA MALAYALAM ENGLISH SPANISH KOREAN CHINESE JAPANESE


PRE GAME EVENT
TOMORROW
FEBRUARY
2ND
RELEASE
WORLDWIDE
GAME ON


VALENTINES WEEK RELEASE
MILLION DOLLAR STUDIOS
A SKN RELEASE
TRUE
LOVER
WRITTEN & DIRECTED BY PRABHURAM VYAS
TEASER FROM TOMORROW



ఎన్నో లాభాలిచ్చే పద్మాసనం

యోగాలో ఒక ముఖ్యమైన ఆసనం- పద్మాసనం. ఒకప్పుడు చిన్నపిల్లల చేత ఈ ఆసనాన్ని తప్పనిసరిగా వేయిస్తూ ఉండేవారు. ఈ ఆసనం వల్ల శరీరంలోని అన్ని అవయవాలకు ఎంతో మేలు జరుగుతుంది. యోగా నేర్చుకోవాలనుకొనే వారందరికీ పద్మాసనం ఒక తొలి మెట్టు. ఈ పద్మాసనం వల్ల కలిగే ఆరోగ్యపరమైన లాభాలేమిటో చూద్దాం.

- మోకాళ్లు, పిరుదులు, చేతి మణికట్లలో ఈ ఆసనం వల్ల కదలికలు ఏర్పడతాయి. దీని వల్ల రక్తప్రసరణ బాగా పెరుగుతుంది. నెప్పులు తగ్గుతాయి.
- వెన్ను నెప్పి ఉన్నవారికి ఈ ఆసనం ఎంతో ఉపకరిస్తుంది. వెన్నెముక చుట్టూ ఉన్న కండరాలను ఈ ఆసనం బలోపేతం చేస్తుంది. నిలబడినప్పుడు శరీరం నిటారుగా ఉండేడట్లు చేస్తుంది.
- పద్మాసనం వేసి కూర్చొన్నప్పుడు మన ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో మార్పు ఏర్పడుతుంది. ఊపిరి క్రమబద్ధీకరణ జరిగినప్పుడు మనసు ప్రశాంతంగా మారుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.
- ధ్యానం చేసేవారు ఆ ఆసనంలో కూర్చుని.. ధ్యానం చేయాలి. అప్పుడే సరైన ఫలితాలు లభిస్తాయి.
- యోగశాస్త్రం ప్రకారం- ఈ ఆసనంలో కూర్చుని ధ్యానం చేయటం వల్ల శరీరంలో ఉన్న శక్తికేంద్రాలు, చక్రాలు ఉత్తేజితమవుతాయి.
- బీపీ సమస్య ఉన్నవారు ప్రతి రోజు ఒక అరగంట ఈ ఆసనంలో కూర్చుంటే బీపీ సమస్య తగ్గుతుంది. ఇదే విధంగా నరాలకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఇది ఎంతో ఉపకరిస్తుంది.
- రుతుస్రావ సమస్యలున్న మహిళలకు ఇది చాలా ఉత్తమమైన ఆసనం.

ఆసనాన్ని ఎలా వేయాలి?

నేల మీద కూర్చుని.. కుడి అరికాలిని ఎడమ తొడపైన.. ఎడమ అరికాలిని కుడి తొడపైన ఉంచాలి. వెన్ను నిటారుగా ఉంచి కూర్చోవాలి. చూపుడు వేలు, బొటకన వేళ్లను ఒక దానితో మరొకటి కలపాలి. అరిచేతులను ఆకాశంవైపు పెట్టాలి. ఊపిరిపై ధ్యాస పెట్టాలి. దీర్ఘ శ్వాస తీసుకొని ఐదు సెకన్లు బిగపెట్టి శ్వాసను వదిలివేయాలి.

సండే సెలబ్రిటీ

ఆ మందలింపు అభినందనలా అనిపించింది



'మజిలీ'లో హీరో లవర్ చనిపోయుంటుంది. ఆమెకు ఓ కూతురుంటుంది. ఆ అమ్మాయికీ... వాళ్ల అమ్మ గురించి, వాళ్ల ప్రేమ గురించి వివరించి చెబుతాడు హీరో ఫ్రెండ్ జాంటీ. ఆ పాత్ర చేశాడు సుహాస్. అప్పటికి తన పేరు ఎవరికీ పెద్దగా తెలియదు. కానీ ఆ సన్నివేశంలో చాలామంది అతనిలో హీరోను చూశారు. ఛాయ తక్కువైనా ఏదో తెలియని ఆకర్షణ. పెద్దగా ఎత్తు లేకపోయినా అద్భుతమైన గొంతు. కొన్ని కథలకు అతికినట్టు సరిపోయే బాడీ లాంగ్వేజ్. అనుకున్నట్టే హీరోగా తొలి చిత్రం 'కలర్‌ఫొటో'తో హిట్ కొట్టేశాడు. 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండ్'తో మరో హిట్ తన ఖాతాలో వేసుకోవాలనుకుంటున్న సుహాస్‌తో 'నవ్య' ముచ్చట్లు.

ఏంటి? హ్యాట్రిక్‌కి రెడీ అయ్యారా?

అది జనం చేతిలో ఉందండీ. మంచి కథ. తప్పకుండా హిట్ అవుతుందని అనుకుంటున్నాను.

మీ పాత్ర ఎలా ఉంటుంది?

కొత్తగా ఉంటుంది. ఇది కవలలైన అక్కాతమ్ముళ్ల కథ. ఓ పుట్టినరోజు వారిద్దరి జీవితంలో అనూహ్యమైన మార్పుకు కారణమవుతుంది. అదేంటనేది తెరపైనే చూడాలి. నేపథ్యం కొత్తగా ఉంటుంది.

విభిన్నమైన కథల్ని ఎంచుకుంటున్నారు. జడ్జిమెంట్ మీదేనా? వెనక అదృశ్యశక్తి ఉందా?

లేదండీ. పూర్తిగా జడ్జిమెంట్ నాదే. నా సర్కిల్ పెద్దది. నా ఫ్రెండ్సే నా డైరెక్టర్లు. యూట్యూబ్‌లో షార్ట్‌ఫిల్మ్ చేసే రోజుల నుంచి మేం కలిసే ఉన్నాం. వాళ్లలో కొందరికి డైరెక్టర్ కావాలని ఆశ. నేను హీరో అయ్యాను కదా.. వాళ్లందర్నీ దర్శకుల్ని చేసే పనిలో ఉన్నాను. (నవ్వుతూ)

స్నేహితులందరూ మంచి దర్శకులవుతారని గ్యారంటీ ఉందా?

తప్పకుండా అవుతారు. నా స్నేహితుల గురించి నాకు తెలుసు. ఇప్పటి వరకూ నేను చేసిన కథలు వాళ్లవే. చేయబోతున్న కథలు కూడా వాళ్లవే. అన్నీ అద్భుతంగా ఉంటాయి.

బయట నిర్మాతలకు దొరకనంత బిజీ అయిపోయారని బయట టాక్..?

నిజమేనండీ. ఉన్న కమిట్‌మెంట్లు పూర్తవ్వడానికే రెండుమూడేళ్లు పట్టేలా ఉంది. లైన్లో మొత్తం ఎనిమిది సినిమాలున్నాయి. నిర్మాతలు కూడా రెడీగా ఉన్నారు. బయట కథలు వింటే వాళ్లు ఊరుకోవడం లేదు. ఏంచెయ్యమంటారు? అందుకే, ముందు ఓ రెండుమూడు సినిమాలు పూర్తి చేసేసి, తర్వాత వినడం మొదలుపెడతా.

ఇంత బిజీని ముందు ఊహించారా?

అస్సలు లేదండీ. తెరపై కనిపిస్తే చాలని అనుకున్నాను. హీరో ఫ్రెండ్ వేషాలు వచ్చినప్పుడు తెగ సంబరపడిపోయా. తెరపై నన్ను నేను చూసుకున్నప్పుడు సాధించేశానని గర్వపడిపోయా. ఇప్పుడు ఏకంగా హీరోనే అయిపోయా. అంతా కలలా ఉంది.

ఎలా ఎదగాలనుకుంటున్నారు? స్టార్‌గానా? నటుడిగానా?

నటుడిగానే. నాకు నటన అంటే పిచ్చి. విభిన్న పాత్రలు చేయాలి. జన హృదయాల్లో నిలిచిపోవాలి. అందుకే 'హిట్ 2'లో విలన్‌గా కూడా చేశాను. ఆ పాత్రకు అభినందనలతోపాటు అవార్డులు కూడా వచ్చాయి.

'హిట్ 2'లో విలన్‌గా మిమ్మల్నెలా అనుకున్నారు?

అదేకదా డెస్టినీ. డైరెక్టర్ శైలేష్ నాకు మంచి ఫ్రెండ్. పైగా ఆ సినిమా ప్రొడ్యూసర్ నాని అన్న. తను చేయమన్నాడు చేసేశాను. అది నా కెరీర్‌లో ప్రత్యేకమైన సినిమా.

> **మళ్లీ విలన్‌గా చేయమంటే చేస్తారా?**
> తప్పకుండా చేస్తాను. హీరోగానే చేస్తానని గిరిగీసుకుని కూర్చునే రకంకాదు నేను. నాకు భేషజాలేం లేవు. కేరక్టర్ నచ్చితే చాలు.

అమ్మానాన్న ఎలా ఫీలవుతున్నారు?

చాలా సంతోషిస్తున్నారు. వాళ్లు విజయవాడలో ఉంటారు. మాది విజయవాడ. అప్పడప్పుడు ఖాళీ చూసుకొని వెళ్తావుంటా. మొన్న వినాయక చవితికి వెళ్లా. 'రేయ్ నువ్వు పదేపదే రాకు. నీవల్ల వినాయకచవితి చందా పెంచేశారు. వంద రూపాయలిచ్చేవాళ్లం. ఇప్పుడు వేలకువేలు అడుగుతున్నారు' అంటూ సున్నితంగా మందలించారు. అది నాకు మందలింపులా అనిపించలేదు. అభినందనలా అనిపించింది.

రెమ్యునరేషన్ భారీగా పెంచేశారా?

అన్యాయమండీ. నా పరిధి ఏంటో నాకు తెలుసు. నామీద ఎంత ఖర్చు పెట్టొచ్చో అంతకు పైసా కూడా బడ్జెట్ పెరగనివ్వను. అందుకు తగ్గట్టే పారితోషికం కూడా తీసుకుంటాను. నిర్మాతల్ని ఇబ్బందిపెట్టే టైప్ కాదు నేను. (నవ్వుతూ)

తండ్రి అయినట్టున్నారు..?

అవును. మొన్ననే బాబు పుట్టాడు. అదో గమ్మత్తయిన ఫీలింగ్. ఇన్నాళ్లూ నేను ఒకళ్ల కొడుకుని. ఇప్పుడు నాకు ఒక కొడుకు. పెద్దరికం వచ్చేసినట్టుంది.

మీది లవ్ మ్యారేజా?

అవును. డిగ్రీ చదువుతున్న రోజుల్లో ఇష్టపడ్డాం. కెరీర్ మీద నమ్మకం కుదరగానే పెళ్లి చేసుకున్నాం. ఇంట్లోవాళ్లు కూడా పెద్ద ఇబ్బంది పెట్టలేదు. తేలిగ్గానే ఒప్పేసుకున్నారు.

బ్యాగ్రౌండ్ లేకుండా ఈ స్థాయికి వచ్చారు కదా? ఏవైనా అవమానాలు ఎదురయ్యాయా?

పెద్దవాళ్లు ఎప్పుడూ పద్ధతిగానే ఉంటారు. కింది స్థాయివాళ్ల దగ్గరే ఎవరికైనా ఇబ్బందులు వచ్చేది. అందరిలాగే నేనూ ఇబ్బందుల్నీ, చిన్న చిన్న అవమానాలనూ ఎదుర్కొన్నాను. కానీ వాటిని సీరియస్‌గా తీసుకోలేదు. నా దగ్గర అలా బిహేవ్ చేసినవాళ్లు కనిపిస్తే.. నేనే పలకరిస్తాను. చెడ్డవాళ్లెవరూ ఉండరు. నా కెరీర్ ఈ స్థాయిలో ఉందంటే అందరి సహకారం వల్లే కదా.

● నరసింహ బుర్రా

భరద్వాజీయం

అంతా దాడికి సిద్ధమైన సమయంలో...



తెలుగు చిత్ర పరిశ్రమ మద్రాసు నుంచి హైదరాబాద్‌కు వచ్చే క్రమంలో చిత్రవిచిత్ర సంఘటనలు చోటుచేసుకున్నాయి. 1955లో 'రోజులు మారాయి' వంద రోజుల వేడుక కోసం నగరానికి వచ్చిన సందర్భంలో రామకృష్ణ ప్రసాద్ గారు ఇక్కడ స్టూడియో కడదాం అనుకున్నారు. సీవీఆర్ ప్రసాద్ గారు, నాన్న తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారు వచ్చి 'సారథి స్టూడియోస్' కోసం స్థలం చూశారు. ఆ వెంటనే కొన్ని ఫ్లోర్స్‌తో స్టూడియో ప్రారంభించారు. స్టూడియో అభివృద్ధి పనులు సాగుతున్న సమయంలో అక్కినేని నాగేశ్వరరావు గారు కొన్ని కారణాలవల్ల మద్రాసు నుంచి వచ్చేసి... హైదరాబాద్‌లోనే సినిమా చేస్తానన్నారు. దాంతో 'సారథి స్టూడియోస్' బాగా బిజీ అయిపోయింది. ఆ తరువాత ఎన్టీ రామారావు గారు కూడా ఇక్కడకు వచ్చేశారు. అప్పటికి అన్ని క్రాఫ్ట్స్ అందుబాటులోకి రాలేదు. మన ఫిలిం చాంబర్ లాంటివన్నీ మద్రాసులోనే ఉండేవి. అయితే హైదరాబాద్‌లో తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా ఇక్కడ 'ఏపీ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్' బ్రాంచ్ ఒకటి పెట్టాం. వాస్తవానికి 1940ల్లోనే ఆంధ్రాలో ఫిలిమ్ చాంబర్ ఏర్పాటైంది. అయితే హైదరాబాద్‌లో 'తెలంగాణ స్టేట్ ఫిలిమ్ చాంబర్ ఆఫ్ కామర్స్' అని వేరే ఉండేది. ఆ తరువాత జరిగిన పరిణామాల్లో 'ఏపీ చాంబర్' ఇక్కడకు మారింది. అలాగే మద్రాసులోని 'తెలుగు చిత్ర నిర్మాతల మండలి'ని కూడా హైదరాబాద్‌కు తీసుకువచ్చాం. దానికి దాసరి నారాయణరావు గారు అధ్యక్షుడిగా, కేఎస్ రామారావు గారు కార్యదర్శిగా, నేను ఉపాధ్యక్షుడిగా ఉండేవాళ్లం.

ఈ తరుణంలో... అంటే 1992-93 ప్రాంతంలో మేం అనుకున్నాం... 'పరిశ్రమ అంతా ఇక్కడే ఉన్నప్పుడు... మద్రాసు నుంచి నియంత్రణ ఎందుకు' అని. అప్పటికి దాసరి గారు, ఇంకా చాలామంది హైదరాబాద్‌కు రాలేదు. ఆయన అప్పటికే ఇక్కడ చాలా చిత్రాలు తీశారు. అయితే మద్రాసు నుంచి వచ్చి వెళుతుండేవారు. స్థానికంగా స్థిరపడిన వారితోనే పని చేద్దామనే ఆలోచనతో వీబీ రాజేంద్ర ప్రసాద్ గారు అధ్యక్షుడిగా ఒక కమిటీ ఏర్పాటు చేసి, 'తెలుగు ఫిలిమ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్' అని ఇక్కడ పెట్టాం.

అప్పుడు 'ఆలిండియా ఫిలిమ్ ఎంప్లాయీస్ కాన్ఫడరేషన్' అని ఉండేది. మద్రాసుతో పాటు ముంబయి, కోల్‌కతా, బెంగళూరుల్లో మాత్రమే దీని శాఖలు పని చేసేవి. అయితే తెలంగాణలోని ఫెడరేషన్‌ను వాళ్లు గుర్తించలేదు. దాంతో హైదరాబాద్‌లో కూడా మద్రాసు నుంచి వచ్చిన వర్కర్లే పని చేయాలని వాళ్లు అప్పుడు పట్టు పట్టారు. ఏదో పంచాయతీ నడుస్తూ ఉండేది. 'ముప్ఫై శాతం మేము... మిగిలింది మీరు' అన్నట్లు ఏవో చర్చలు జరుగుతుండేవి. జూనియర్ ఆర్టిస్టులు ఇక్కడే ఉండేవారు. ఫైటర్స్ డ్యాన్సర్లు అక్కడ. వాళ్లు ఇక్కడివారిని చేయనిచ్చేవారు కాదు. ఆ సమయంలోనే మేం ఈ నిర్మాతల మండలి ఏర్పాటు చేశాం. అది మద్రాసులోని కొంతమంది పెద్దలకు కోపం తెప్పించింది. అక్కడ ఏం జరిగిందో తెలియదు కానీ... హైదరాబాద్‌లో తీసే సినిమాలకు తమ వర్కర్స్‌నే పెట్టుకోవాలనే డిమాండ్‌తో... సౌతిండియన్ ఫిలిమ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్' సమ్మెకు పిలుపునిచ్చింది. దాంతో ఇక్కడ షూటింగ్‌లన్నీ ఆగిపోయాయి. దాసరి గారి 'మాయాబజార్' షూటింగ్ మద్రాస్‌కు మారింది. కె.విశ్వనాథ్ గారు కమల్‌హాసన్‌తో తీస్తున్న 'శుభ సంకల్పం' కేరళకు, రాఘవేంద్రరావు గారి 'పెళ్లి సందడి' కర్ణాటకకు వెళ్లాయి. నాలాంటి చిన్నచిన్నవాళ్లం ఇక్కడే చేయాలనుకున్నాం. అయితే అక్కడి నుంచి టెక్నీషియన్లు ఎవరూ రాకూడదన్నారు. ఇక్కడేమో పూర్తిస్థాయిలో టెక్నీషియన్స్ లేరు. అప్పుడు నేను 'కూతురు' తీస్తున్నాను. ఉన్న టెక్నీషియన్స్‌తోనే చేసుకొంటూ పోయాను.

ఇలా నడుస్తుండగా... ఒక రోజు శ్యాంప్రసాద్‌రెడ్డికి ఫోన్ చేశాను. 'ఏమయ్యా... మనం ఇంతమంది ఇక్కడ ఉండి, షూటింగ్‌లు ఆపేస్తుంటే చేతగానివాళ్లలా ఊరుకోవాలా' అని తనతో అన్నాను. దాంతో సురేశ్‌బాబుకు ఫోన్ చేసి ఏంచేద్దామని శ్యాం అడిగాడు. అలా నేను, శ్యాం, సురేశ్‌బాబు, వెంకట్ అక్కినేని... నలుగురం కలిసి సంప్రతింపుల కోసం మద్రాసు వెళ్లడం... రావడం జరుగుతోంది. ఆ క్రమంలో ఒక విమానంలో నిర్మాతలు, దర్శకులు, నటులు... 130 మందిని అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకువచ్చాం. బాలకృష్ణ గారు కూడా అందులో ఉన్నారు. కొంత విజయం... కొంత అపజయంలా సాగుతున్నాయి మా ప్రయత్నాలు. ఒకే రోజు 'అన్నపూర్ణ స్టూడియో'లో 14 సినిమాలు ప్రకటించాం. నాగార్జున, వెంకటేష్, రాజశేఖర్ తదితర హీరోలతో పాటు స్థానికంగా ఉండే నటులతో క్లాప్ కొట్టాం. నేను, శివనాగేశ్వరరావు, కృష్ణవంశీ తదితరులం కలిసి తలా రెండు సినిమాలు అన్నట్లు హడావుడి చేశాం. అయితే తదనంతర పరిణామాల నేపథ్యంలో వాటిల్లో ఏ సినిమా ముందుకు వెళ్లలేదనుకోండి. ఏదేమైనా దానివల్ల మద్రాసులో సమ్మెవల్ల ఇక్కడ షూటింగ్‌లు సజావుగా సాగడానికి ఏంచేయాలి? ఎలా చేయాలి అనే ఆలోచన మొదలైంది. నేను, సురేష్‌బాబు, అక్కినేని వెంకట్, శ్యాంప్రసాద్ కలిసి నెలకు పైగా మద్రాసులోనే మకాం పెట్టి, రోజూ దాసరి ఇంటికి వెళ్లి, ఆయనతో చర్చించేవాళ్లం. అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత గారి ఇంటికి కూడా వెళ్లాం. ఫిలిమ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ వాళ్లతో కూడా సమావేశమయ్యాం. చాంబర్ ఆఫ్ కామర్స్‌ను కలిశాం. అందరూ అక్కడి వర్కర్స్‌కే మద్దతునిచ్చారు.

ఈ సమస్యకు పరిష్కారం ఇలా కాదనుకుని, చివరకు ఒక రాజీ మార్గానికి వచ్చాం. అదేంటంటే... వాళ్లు ఇక్కడి ఫెడరేషన్ తీసేయమన్నారు. సరేనని చెప్పి... వేరే పేరుతో ఒక సొసైటీలాగా పెట్టి, ఫెడరేషన్‌లోని వారందరినీ అందులో చేర్పిద్దామని అనుకున్నాం. అదే సమయంలో కోట శ్రీనివాసరావు గారు నిరాహార దీక్షకు కూర్చున్నారు. ఆయన ఇంటి ఎదురుగానే మా ఆఫీస్ ఉండేది. ఆయన రోజూ నా దగ్గరకు వచ్చి... 'నేను దీక్షకు దిగుతా' అని బెదిరిస్తుండేవారు. ఒకరోజు ఉప్పలపాటి నారాయణరావు గారు కూడా మా ఆఫీసులో ఉన్నారు. కోట గారు అలా అనగానే... 'చేసేయ్ బాబాయ్' అన్నాం. ఏదో సరదాగా అన్నాం కదా అనుకొంటే.. కోట గారు నిజంగానే వెళ్లిపోయి దీక్షకు కూర్చున్నారు.

అప్పటికి ఆయన నిరాహార దీక్ష మొదలుపెట్టి ఆరు రోజులైంది. ఏడో రోజుకు అది తీవ్ర రూపం దాల్చింది. పెద్ద సమావేశం జరగుతోంది. దాసరి గారు, చిరంజీవి గారు తదితర పరిశ్రమ పెద్దలందరూ ఆ సమావేశంలో ఉన్నారు. బయట నేను, ఫెడరేషన్ వర్కర్స్. వాతావరణం వేడిగా ఉంది. వర్కర్లు ఆవేశంతో ఊగిపోతున్నారు. భౌతిక దాడికి సిద్ధమవుతున్నారు. 'అరగంట చూద్దాం. ఈలోపు వాళ్లు హైదరాబాద్‌కు మారడానికి ఒప్పుకోకపోతే మీరు చెప్పినట్టే చేద్దాం' అని చెప్పాను. రోడ్డుకు అటూ ఇటూ కార్లు బారులు తీరాయి. అందులో మనకు మద్దతునిచ్చేవి... ఇవ్వనివీ ఉన్నాయి. డ్రైవర్లను పిలిచి మనకు మద్దతుగా ఉన్న కార్లన్నిటినీ పక్కకు తీసేయమన్నాను. తీసేశారు. మిగిలిన కార్లను పగలగొట్టడమో... తగలబెట్టడమో... ఏదో చేయడానికి మానసికంగా అందరూ సిద్ధమైపోయారు. నేను ఓకే అనేశాను. వీళ్లు బయలుదేరుతున్నారు. సరిగ్గా అదే సమయంలో దాసరి గారు, చిరంజీవి గారు బయటకు వచ్చారు... 'సమస్య పరిష్కారమైంది' అంటూ! దాంతో వీళ్లను హడావుడిగా ఆపేసి, కోట గారికి నిమ్మకాయ రసం ఇచ్చి, దీక్ష విరమింపజేశాం. మా సూచనలకు అనుగుణంగా, అంతా కలిసి పని చేసేలా ఒక నిర్ణయం తీసుకున్నారు. అలా అప్పటికి ఆ సమస్య పరిష్కారమైంది.

● **తమ్మారెడ్డి భరద్వాజ**, దర్శకనిర్మాత

అపజయాలొచ్చినా.. నడక ఆపను!

తొంభయ్యవ దశకంలో బాలీవుడ్‌లో పేరు తెచ్చుకున్న నటి 'రవీనా టాండన్'. ఆ మధ్య 'కేజీఎఫ్-2' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన రవీనా ఇపుడు వెబ్‌సిరీస్‌లతోనూ పాపులర్ అవుతోంది. ఆమె గురించి కొన్ని విశేషాలు..

ఇటీవలే 'కర్మ కాలింగ్' అనే వెబ్‌సిరీస్‌లో రవీనా టాండన్ నటించింది. ఆమె చేసిన ఇంద్రాణి పాత్రకు జనాలు ఫిదా అవుతున్నారు. దీంతో రవీనా టాండన్ మళ్లీ ఆమె కెరీర్ గాడిలో పడిందంటున్నారు కొందరు. రవీనా మాత్రం 'ఇదో మంచి కథ. వెబ్‌సిరీస్‌లతో మరిన్ని వైవిధ్యమైన కథలు చెప్పవచ్చు. ఈ ప్లాట్‌ఫామ్‌లో మంచి స్కోప్ ఉంది. ముఖ్యంగా కథానాయికలకు మంచి ఫుల్ లెంగ్త్ ఉన్న క్యారెక్టర్స్ దొరుకుతాయి. ఇదో గొప్ప అవకాశం' అంటోంది రవీనా.



అలా మా నాన్న వల్ల..

ఆ మధ్య కేజీఎఫ్-2 లో ప్రధాన మంత్రి పాత్రలో పవర్‌ఫుల్‌గా నటించింది. ఆమాటకొస్తే రవీనా కెరీర్‌లో ఒడిదుడుకులు ఉన్నా పట్టించుకోలేదు. చిన్న పాత్రలు చేసింది. 'అపజయాలకు భయపడను. నాకంటూ మంచి క్యారెక్టర్ వచ్చే వరకూ వెతుకుతా. చిన్నప్పుడు మానాన్న చెప్పేవాడు.. 'ఒక పిల్లవాడు కిందపడినా.. నడిచే వరకూ నడుస్తాడు. అలా పోరాటం చివరి వరకూ చేయాలని'. అందుకే నేను నడక ఆపను. వచ్చిన మంచి పాత్రలను ఎంచుకుంటా.

సోషల్ మీడియాతో సంతోషం..

సల్మాన్‌ఖాన్ జోడీగా 'పత్థర్ కే ఫూల్' చిత్రంతో 1991 సంవత్సరంలో బాలీవుడ్‌లోకి అడుగెట్టింది రవీనా. తొలి చిత్రానికే ఫిల్మ్‌ఫేర్ అవార్డు గెలుచుకుంది. 'క్షత్రియ', 'దిల్‌వాలే', 'జమానా దివానా', 'కీమత్- దే ఆర్ బ్యాక్', 'బడే మియాన్ చోటే మియాన్', 'పరదేశీ బాబు', 'దావన్'.. ఇలా హిందీ చిత్రాలతో మెప్పించింది. ఇటీవల ఓ ఆంగ్ల పత్రిక 'మీతో పాటు జూహీ చావ్లా, శిల్పా శెట్టి, మాధురీ దీక్షిత్.. లాంటి వారు ఉండేవారు. మీ తోటి నటులతో గొడవలు ఉన్నాయంట కదా?' అని అడిగితే రవీనా ఇలా చెప్పుకొచ్చింది.. 'ఆ రోజుల్లో అంటే 1990లో మ్యాగజైన్స్ ఎక్కువగా ఉండేవి. గాసిప్స్ ఎక్కువ రాసేవారు. మేమంతా స్నేహితులం. తోటి నటీమణులతో కలిసి నటించేదాన్ని. అయితే అప్పుడు మేం పుకార్లను ఆపలేకపోయాం. ఇప్పుడలా కాదు.. సోషల్ మీడియా ఉండటం ఎంతో సంతోషం. గొప్పగా అనిపిస్తుంది. పాతవాళ్లం అంతా ఇన్‌స్టాతో టచ్‌లో ఉంటాం. సల్మాన్, మాధురి.. ఇలా ఎవరిని కలిసినా ఫొటో దిగి సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తాం. ఇక్కడ ప్రూఫ్ ఉంది. అలా పుకార్లకు తావు లేదు. ఇప్పుడే చాలా బావుంది..ఈ విషయంలో' అంటుంది రవీనా టాండన్.

సహనం అలా వచ్చింది..

'నా భర్త అనిల్ తడాని వల్ల ఈ స్టెబిలిటీ వచ్చింది. ఇంత సైలెంట్‌గా ఉన్నానంటే ఆయన ఆలోచనల ప్రభావమే. ఇకపోతే అమ్మ అయ్యాక.. ఎవరికయినా సహనం వస్తుంది. నాకూ అంతే! నా కూతురు, కొడుకు ఆలోచనలు, ఆశయాలు అనుగుణంగా సమయం కేటాయించాను. అందుకే సినిమాల విషయంలో శ్రద్ధ తీసుకోలేకపోయా. వారితో కలసి వెకేషన్స్‌కు వెళ్లటం, స్కూల్ ఫంక్షన్స్‌కు అటెండ్ అయ్యేదాన్ని. అయితే వారితో గడిపిన క్షణాలు అమూల్యమైనవి. రెండూ బ్యాలెన్స్ చేయటం కష్టమే కదా! ఇప్పుడిప్పుడే కాస్త సమయం దొరుకుతోంది. ఎందుకంటే పిల్లలు పెద్దవారయ్యారు కాబట్టి. ఫిల్మ్‌ఫేర్, జాతీయ అవార్డులు వచ్చాయి. పద్మశ్రీ లాంటి ఉన్నత పురస్కారం గతేడాది అందుకున్నా. ఓ నటిగా ఇలాంటి అవకాశాలు, అదృష్టం దొరుకుతుంది అనుకుంటా. ఏదేమైనా ఇతరుల మీద ఆధారపడకూడదు. ఆత్మవిశ్వాసంతో యువత పని చేయాలి' అంటుంది రవీన టాండన్.

నవ్య 'దృశ్యం పేజీ' లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/6I2DLBfలో చదవండి.

'దిక్సూచి' వెబ్ పేజీలో... సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/6sUv9kgలో చదవండి.

మెగా డీఎస్సీ సాధనకు 36 గంటల దీక్ష

భగ్నం చేసిన పోలీసులు


ధర్నా చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

విజయవాడ (ధర్నాచౌక్), జనవరి 27: తక్షణమే డీఎస్సీ విడుదల చేసి టీచర్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరుద్యోగులు, సంఘం నేతలు స్థానిక ధర్నాచౌక్‌లో 36గంటల దీక్షకు దిగారు. ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఈ దీక్షను ప్రారంభించారు. నాడు-నేడు నిధులతో పాఠశాలలను అభివృద్ధి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న సీఎం జగన్ ఈ ఐదేళ్లలో టీచర్ పోస్టులు భర్తీ చేయకుండా నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. నూతన విద్య విధానం సాకుతో తెలుగు మీడియం పాఠశాలలను తీసివేశారన్నారు. మెగా డీఎస్సీ విడుదల చేసి 50 వేల టీచర్ పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క డీఎస్సీ కూడా ఇవ్వని జగన్ చరిత్ర హీనుడుగా మిగిలిపోతారన్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష,కార్యదర్శులు వై.రాము, జి.రామన్న మాట్లాడుతూ బీఈడీ, టీటీసీ పూర్తి చేసినవారు రాష్ట్రవ్యాప్తంగా పది లక్షలకు పైగా ఉన్నారన్నారు. వీరంతా రెండేళ్ల క్రితమే టెట్ రాసి డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. కాగా, ఈ దీక్షను అనుమతి లేదనే కారణంతో సాయంత్రం 5గంటలకు పోలీసులు భగ్నం చేశారు. ఈ సందర్భంగా పోలీసులతో సంఘం నేతలు వాగ్వాదానికి దిగారు.

రీయింబర్స్‌మెంటు రాక చదువులు ఆపేశాం

సర్టిఫికెట్లు కళాశాలల్లోనే ఉండిపోయాయి

15 రోజుల్లో ఇప్పించాలి: విద్యార్థుల ధర్నా

ధర్నాచౌక్, జనవరి 27: "మాకు ఉచితాలు వద్దు, భవిష్యత్తు కావాలి" అంటూ నినదిస్తూ విదార్థులు రోడ్డెక్కారు. ఆంధ్రప్రదేశ్ అన్ ఎంపాయిస్ అండ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో విజయవాడ ధర్నాచౌక్‌లో శనివారం ధర్నా జరిగింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ అధ్యక్షుడు దాడి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎల్‌కేజీ నుంచి పీజీ దాకా ఫీజు రీయంబర్స్‌మెంట్ రాకపోవడంతో అత్యధిక ఫీజులు చెల్లించలేక తమ చదువులు మధ్యలోనే ఆపేశామన్నారు. అయితే సర్టిఫికెట్లు వెనక్కివ్వకపోవడంతో తమ భవితవ్యం అంధకారంలోకి జారిపోయిందని వాపోయారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 22 శాతం పైగా విద్యార్థుల సర్టిఫికెట్లు కళాశాలల్లోనే ఉండిపోయాయన్నారు. 15 రోజుల్లోగా విద్యార్థుల సర్టిఫికెట్లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ సమస్యను పరిష్కరించాలని, లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. టీడీపీ నేతలు పఠావుల్లా, మాధవ్, బీసీ సంక్షేమ సంఘం నేత లక్ష్మణరావు ధర్నాకు మద్దతు పలికారు.


ధర్నా చేస్తున్న విద్యార్థులు

డీఈడీ అభ్యర్థులకే ఎస్జీటీ పోస్టులు

- బీఈడీవారు అర్హులు కాదని ప్రభుత్వం స్పష్టీకరణ
- పలు సవరణలతో ఉత్తర్వులు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ ఇవ్వాలని నిర్ణయించిన ప్రభుత్వం ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు సంబంధించి పలు మార్పులు చేసింది. ఇటీవల సుప్రీంకోర్టు జారీచేసిన తీర్పునకు అనుగుణంగా ప్రాథమిక తరగతులకు బోధించేవారు డీఈడీ అభ్యర్థులే అయ్యుండాలని, బీఈడీవారు అర్హులు కాదని స్పష్టంచేసింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. కాగా, బీఈడీ అభ్యర్థులు కూడా ప్రాథమిక తరగతులకు బోధించేందుకు ఎస్జీటీలు కావొచ్చని జాతీయ ఉపాధ్యాయ విద్య మండలి తెలిపింది. రాజస్థాన్‌కుచెందిన కొందరు దీన్ని సుప్రీంకోర్టులో సవాలు చేయగా బీఈడీ అర్హత ఉన్నవారు పైతరగతులకే బోధించాలని ఇటీవల తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో అందుకు అనుగుణంగా టెట్ ఎవరు రాయాలనే అర్హతలపై రాష్ట్ర ప్రభుత్వం సవరణలు చేసింది. డీఈడీ చేసినవారు ఎస్జీటీలకు సంబంధించిన టెట్ పేపర్-1 రాయాలని, బీఈడీ ఉన్నవారు ఉన్నత పాఠశాలల్లో బోధించేందుకు పేపర్-2 రాయాలని వివరించింది. అలాగే పేపర్-2లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులకు సడలింపు ఇచ్చింది. డిగ్రీలో 40శాతం మార్కులుంటే బీఈడీలో అడ్మిషన్ లభిస్తుంది. కానీ, అనంతరం టెట్ రాయాలంటే డిగ్రీలో 45శాతం మార్కులుండాలనే నిబంధన ఉంది. ఇదెలా సాధ్యమని, దీనిని సవరించాలని అభ్యర్థులు చాలాకాలంగా కోరుతున్నారు. దీంతో డిగ్రీలో 40శాతం మార్కులున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగ అభ్యర్థులు టెట్ పేపర్-2 రాసేందుకు ప్రభుత్వం సడలింపునిచ్చింది. అయితే ఇది ఈ ఒక్కసారికే వర్తిస్తుందని స్పష్టంచేసింది.

స్కెచ్ వేసి స్వాహా!

- కాకినాడలో మరో టీడీఆర్ కుంభకోణం
- 4.67ఎకరాల పనికిరాని ప్రైవేటు భూమికి 251కోట్లకు పైగా టీడీఆర్ బాండ్లు జారీ

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడలో మరో టీడీఆర్ బాండ్ల కుంభకోణం వెలుగు చూసింది. అధికార పార్టీ కీలక నేత కనుసన్నల్లో జరిగిన ఈ కుంభకోణంలో భాగంగా కార్పొరేషన్ ఏకంగా రూ.251కోట్లకు పైగా టీడీఆర్ బాండ్లు జారీ చేయడం అనేక అనుమానాలకు తావిస్తోంది. కాకినాడ నగరంలో సముద్ర తీరానికి సమీపాన దుమ్ములపేట ప్రాంతంలో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించాలని కార్పొరేషన్ అధికారులు ప్రతిపాదించారు. ఇందుకు యాంకరేజ్ పోర్టుకు చెందిన వందల ఎకరాలు ఖాళీగా ఉన్నాయి. రెవెన్యూశాఖకు కూడా పదుల ఎకరాల్లో భూములున్నాయి. కానీ ఇవన్నీ వదిలేసి ప్రైవేటు భూసేకరణకు అధికారులు సిద్ధమయ్యారు. అధికార పార్టీ కీలక నేత వెనుక ఉండి కథ నడిపించారు. దుమ్ములపేట సమీప ప్రాంతంలో సర్వే నం. 1986/3బి2, 1989/1ఏ, 4ఏలో హైదరాబాద్‌కు చెందిన పీవీఆర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అనే కంపెనీకి 4.67 ఎకరాల భూమి ఉంది. దీనికి ఆనుకుని వందల ఎకరాల ప్రభుత్వ భూములున్నా సబ్‌స్టేషన్‌ను ప్రైవేటు స్థలంలోనే నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకోసం నగర పాలక సంస్థ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా ఆ స్థలాన్ని సేకరించారు. గజం రూ.28 వేల మార్కెట్ విలువ చొప్పున 1:4 నిష్పత్తిలో సుమారు రూ.251 కోట్ల విలువ లెక్కగట్టారు. ఈ మేరకు టీడీఆర్ బాండ్లను కార్పొరేషన్ జారీ చేసింది. ప్రభుత్వ భూములు ఉన్నా కాదని ప్రైవేటు భూములను సేకరించడం, ఎకరం రూ.3కోట్లు కూడా విలువ చేయని భూములకు ఏకంగా రూ.251 కోట్లకు పైగా బాండ్లు జారీ చేయడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సేకరించిన భూమి మోకాలిలోతు నీటిలో ఉండి తరచూ సముద్రపు ఆటు పోట్లకు గురవుతోంది. ఈ స్థలానికి చేరుకోవడానికి రహదారే లేదు. అయినా మెయిన్‌రోడ్డు లాంటి ప్రాంతాల్లో జారీ చేసే నాలుగురెట్ల ప్రాతిపదికన రూ.15 కోట్లు కూడా పలకని ఈ భూములకు అంత మొత్తం విలువ కలిపి టీడీఆర్ బాండ్లు జారీ చేసేశారు. ఇలాంటిచోట విద్యుత్తు సబ్‌స్టేషన్ ఎలా కడతారనేది ప్రశ్నార్థకంగా మారింది. వాస్తవానికి సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఎకరం నుంచి ఎకరంన్నర సరిపోతుంది. కానీ అధికారులు ఉద్దేశపూర్వకంగానే ప్రైవేటు వ్యక్తికి సహకరించడం కోసం అంత స్థలం తీసుకుని బాండ్లు ఇవ్వడం వెనుక భారీ కుంభకోణమే ఉందని ఆరోపణలు వస్తున్నాయి. బాండ్లు జారీ కావడంతో స్థలం మార్కెట్ విలువను భూయజమానికి ఇచ్చేసి బాండ్లను సదరు కీలకనేత, ఆయన అనుచరులు రాష్ట్రవ్యాప్తంగా విక్రయించుకోవాలని చూస్తున్నట్లు సమాచారం.


కాకినాడలో టీడీఆర్ బాండ్లు జారీ చేసిన ప్రైవేటు స్థలం

అంతా రహస్యమే...

టీడీఆర్ బాండ్ల జారీ వ్యవహారాన్ని అధికారులు గుట్టుగా నడిపించారు. గతేడాది నవంబరులో సదరు ప్రైవేటు భూములను కార్పొరేషన్ రిజిస్ట్రేషన్ చేసుకున్నా వ్యవహారం బయటకు రానివ్వలేదు. ఊరు, పేరు లేని ఓ పత్రికలో నోటిఫికేషన్ జారీ చేయించి రహస్యంగా పావులు కదిపారు. అధికారులతో ఫైళ్లపై సంతకాలు చేయించారు. వాస్తవానికి గతేడాది అక్టోబరులో ఎనిమిది మంది అధికారులతో కూడిన కమిటీ ఆమోదించాకే కార్పొరేషన్ నుంచి బాండ్లు జారీచేయాలని నిర్ణయించారు. కానీ ఈ గుడ్డి వ్యవహారానికి రూ.215కోట్లకు పైగా బాండ్లు ఎవరి ఒత్తిడితో జారీ చేసి ఖజానాకు కన్నం పెట్టారనే దానిపై దర్యాప్తు జరగాల్సి ఉంది. ఇదిలాఉంటే కార్పొరేషన్‌లో ఎన్నో ఏళ్ల నుంచి పాతుకుపోయిన ఓ కీలక అధికారి సదరు నేత కనుసన్నల్లో పనిచేస్తారు. ఈ కుంభకోణం వెనుక ఆయన సహకారం కూడా ఉందని తెలుస్తోంది. గతేడాది కాకినాడ సురేష్‌నగర్ లో ప్రభుత్వ భూమికి విలువ పెంచి రూ.100కోట్ల టీడీఆర్ బాండ్లు జారీ చేసిన వ్యవహారంలో ఓ సబ్‌రిజిస్ట్రార్ సస్పెండ్ కాగా, ఇద్దరు కమిషనర్లు బదిలీ చేయించుకొని వెళ్లిపోయారు. ఆ తర్వాత వచ్చిన ఈ అధికారి సదరు ప్రజాప్రతినిధి కోరినట్లు అడ్డగోలుగా బాండ్లు జారీ చేశారు. కాగా, ఇదే వ్యవహారంపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. టీడీఆర్ కుంభకోణంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జాయింట్ కలెక్టర్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేశారు.


నిడదవోలు మహిళా కళాశాలలో డిగ్రీ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు, (ఇన్‌సెట్‌లో) నిడదవోలు మహిళా కళాశాలలో ఆసరా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు

నిడదవోలు ఎమ్మెల్యే సాక్షిగా.. ఓవైపు డిగ్రీ పరీక్షలు.. మరోవైపు ఆసరా సభ!

- మైకులు, సౌండ్‌బాక్సుల హోరు
- పరీక్ష రాయలేక తలలు పట్టుకున్న విద్యార్థులు

నిడదవోలు, జనవరి 27: నిడదవోలు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శనివారం డిగ్రీ విద్యార్థులకు ఉదయం 9నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5 గంటల వరకు డిగ్రీ మొదటి, తృతీయ సంవత్సరం సెమిస్టర్ పరీక్షలు నిర్వహించారు. ఇదే కళాశాల ఆవరణలో నిడదవోలు పురపాలక సంఘం మెప్మా ఆధ్వర్యంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. భారీ స్ర్కీన్లు, లౌడ్ స్పీకర్ల ద్వారా వైసీసీ ప్రభుత్వ ప్రచార ప్రకటనలు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజాప్రతినిధులు ఊకదంపుడు ఉపన్యాసాలతో కళాశాల పరీక్షల కేంద్రాన్ని ఆసరా సంబరాల సభగా మార్చేశారు. ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు హాజరై మీకు అది చేస్తున్నాం.. ఇది చేస్తున్నాం అంటూ ప్రసంగించారు. డిగ్రీ పరీక్షలు జరుగుతున్నాయన్న సోయి ఆయనలో ఇసుమంత కూడా లేకపోవడం గమనార్హం. మరోపక్క విద్యార్థులు పరీక్ష రాయలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇదే విషయమై మెప్మా సిబ్బందిని ప్రశ్నిస్తే ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయంటూ చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారంపై జనసేన నాయకులు గౌడూరి శివనాయుడు, దొడ్డిగర్ల ప్రకాష్ నిరసన తెలిపారు.

రైల్లో రూ.1.5 కోట్ల నగలు, నగదు స్వాధీనం

- కోయంబత్తూరు వాసులు ఇద్దరు అరెస్ట్

నెల్లూరు(క్రైం), జనవరి 27: రైల్లో అక్రమంగా తరలిస్తున్న రూ.1.5 కోట్ల బంగారు ఆభరణాలు, నగదును నెల్లూరు రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ భుజంగరావు కథనం మేరకు.. శుక్రవారం రాత్రి శబరి ఎక్స్‌ప్రెస్‌లో తనిఖీలు చేయగా, తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన కన్నన్ సాయికుమార్, లోగనాథన్‌ల బ్యాగ్‌లలో బిల్లులు లేని 2.800 కిలోల బంగారు ఆభరణాలు, రూ.10.32 లక్షల నగదు కనిపించాయని తెలిపారు. వాటిని స్వాధీనం చేసుకొని, ఆ ఇద్దరినీ అరెస్టు చేసినట్టు చెప్పారు. సాయికుమార్ నుంచి బిల్లులు లేకుండా తరలిస్తున్న 2.065 కిలోల బంగారు ఆభరణాలు, రూ.7,62,520 నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. అలాగే, ఎన్.లోగనాథన్ నుంచి రూ.2.70లక్షల నగదు, 790గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు రైల్వే ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

28 కేసుల్లో నిందితుడి పట్టివేత


హైదరాబాద్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో నిందితుడిగా ఉండి తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని రైల్వే పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. విశాఖపట్నం గాజువాకకు చెందిన గణేష్(32) దొంగతనం, దోపిడీ, అత్యాచారంతో పాటు మొత్తం 28 కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. కొన్నికేసుల్లో ఇప్పటికే జైలుకు వెళ్లిరాగా మరికొన్ని కేసుల్లో తప్పించుకు తిరుగుతున్నాడు. హైదరాబాద్ శివారు శివరాంపల్లిలో ఉంటున్నాడు. సెంట్రింగ్ పనిచేస్తూ మహబూబ్‌నగర్‌కు చెందిన యువతిని రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఇటీవల అత్తవారింటికి వెళ్తొస్తుండగా రైల్వే పోలీసులు అతడి వివరాలు సేకరించి ఫింగ్ ప్రింట్స్ మొబైల్ డివైజ్‌తో వేలిముద్రలతో సరిపోల్చి పాత కేసులో తప్పించుకు తిరుగుతున్నట్లు గుర్తించారు. గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. అనుమానాస్పద ప్రయాణికుల్ని కచ్చితంగా విచారిస్తామని, నేరం చేసి తప్పించుకునేందుకు ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటామని అదనపు డీజీపీ మహేష్ భగవత్ తెలిపారు.

ఆ బాధ్యత ప్రభుత్వాలదే

- న్యాయవ్యవస్థకు మౌలికసదుపాయాల కల్పనపై హైకోర్టు స్పష్టీకరణ
- కేంద్ర వాటా నిధుల విడుదలకు రాష్ట్రం విజ్ఞప్తి చేసి ఉండాల్సింది
- నిధుల కొరతతో మెజార్టీ ప్రాజెక్టులు నిలిచిపోయాయి
- రాష్ట్రం కంటే ఇతర రాష్ట్రాలకే ఎక్కువ నిధులు: ధర్మాసనం
- నిధుల విడుదలకు చర్యలు తీసుకోండి
- అదనపు సొలిసిటర్ జనరల్‌కు ఆదేశం.. విచారణ ఫిబ్రవరి 21కి వాయిదా

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీలో న్యాయవ్యవస్థకు మౌలికసదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని హైకోర్టు పేర్కొంది. రాష్ట్రంలో చేపట్టిన 19 జ్యుడీషియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు కేంద్రం వాటా కింద ఇవ్వాల్సిన 60 శాతం (రూ.394కోట్లు) సొమ్మును విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసి ఉండాల్సిందని అభిప్రాయపడింది. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన 19 ప్రాజెక్టులలో నిధులు కేటాయించకపోవడం వల్ల నిధుల కొరతతో మెజార్టీ ప్రాజెక్టులు నిలిచిపోయాయని గుర్తుచేసింది. రాష్ట్రంలో చేపట్టిన జ్యుడీషియల్ ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు రూ.656కోట్లు ఖర్చు అవుతుందని, ఇందులో కేంద్రం తన వాటాగా రూ.394 కోట్లు విడుదల చేయాల్సి ఉండగా, ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ.19.26 కోట్లు కేటాయించి, మొదటి విడతలో రూ.4.82కోట్లు విడుదల చేసిందని తెలిపింది. కేంద్రం నుంచి ఇంకా రావాల్సిన రూ 14.44 కోట్లతో ఆ 19 ప్రాజెక్టులు పూర్తి చేయడం సాధ్యపడదని పేర్కొంది. న్యాయవ్యవస్థకు మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధించి కేంద్రం ఇతర రాష్ట్రాలకు కేటాయిస్తున్న నిధులు చాలా ఎక్కువగా ఉన్నాయని తమ దృష్టికి వచ్చినట్టు తెలిపింది. ఈ వ్యవహారాన్ని కేంద్ర న్యాయశాఖ దృష్టికి తీసుకెళ్లి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు అవసరమైన సొమ్ము విడుదలకు చర్యలు తీసుకోవాలని అడిషనల్ సొలిసిటర్ జనరల్‌కు సూచించింది. నిధుల వ్యవహారాన్ని కేంద్ర న్యాయశాఖ దృష్టికి తీసుకెళ్లి వివరాలు కోర్టు ముందు ఉంచేందుకు అడిషనల్ సొలిసిటర్ జనరల్ సమయం కోరడంతో విచారణను ఫిబ్రవరి 21కి వాయిదా వేసింది. ఈ మేరకు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావుతో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. కృష్ణాజిల్లా గన్నవరంలో నూతన కోర్టు భవన నిర్మాణాన్ని చేపట్టడంతోపాటు ఇప్పటికే ఉన్న పాత భవనానికి మరమ్మతులు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ గన్నవరానికి చెందిన దేవిరెడ్డి రాజశేఖరరెడ్డి ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ సందర్భంగా.. రాష్ట్రంలో కోర్టు భవన నిర్మాణాల పురోగతిపై హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కొన్ని భవనాల పనులు 2018లో ప్రారంభమైనప్పటికీ 10శాతం కూడా పూర్తికాలేదని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. రాష్ట్రంతో పోలిస్తే ఇతర రాష్ట్రాలకు కేంద్రం ఎక్కువ నిధులు విడుదల చేసిందని పిటిషనర్ తరఫు న్యాయవాది ఎమ్మార్కే చక్రవర్తి తెలిపారు. కాగా, కేంద్ర ప్రభుత్వం తన వాటా కింద కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన రూ.83.33 కోట్ల విడుదల కోసం హైకోర్టు కేంద్రానికి లేఖరాసిందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సుమన్ గుర్తు చేశారు.

డోన్‌లో కోర్టు కాంప్లెక్స్ నిర్మాణాలకు శంకుస్థాపన


కోర్టు కాంప్లెక్స్ నిర్మాణాలకు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తులు

డోన్, జనవరి 27: నంద్యాల జిల్లా డోన్‌లో రూ.23.5 కోట్లతో నిర్మిస్తున్న నాలుగు కోర్టు కాంప్లెక్స్ నిర్మాణాలకు రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సురేష్ రెడ్డి, జస్టిస్ కె.శ్రీనివాసరెడ్డి, జస్టిస్ హరినాథ్ నూనెపల్లి శనివారం శంకుస్థాపన చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డితో కలిసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ రెండు ఎకరాల విస్తీర్ణంలో నాలుగు కోర్టుల కాంప్లెక్స్ నిర్మాణాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. న్యాయసేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జిల్లా న్యాయాధికారి శ్రీనివాసరావు, డోన్ సబ్ కోర్టు న్యాయాధికారి తంగమణి, డోన్ కోర్టు జూనియర్ సివిల్ న్యాయాధికారి రాహుల్, జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ న్యాయాధికారి హనీషా, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రేగటి రాజశేఖర్‌రెడ్డితో పాటు న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలానికి కన్వేయన్స్ డీడ్!

- పీవోటీ చట్టంలో సవరణలతో ఆర్డినెన్స్
- కన్వేయెన్స్ డీడ్‌లపై జగన్ ఫొటో, పేరు
- ఎన్నికల్లో రాజకీయ లబ్ధే అసలు వ్యూహం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పేదలకు ఇచ్చే ఇంటిస్థలాల పట్టాలపైనా సీఎం జగన్ పేరు, ఫొటో శాశ్వతంగా ఉండేలా మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. దాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు కన్వేయెన్స్ డీడ్‌ల పేరిట ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ చట్టం-1977 (పీవోటీ యాక్ట్)ను సవరిస్తూ ప్రత్యేకంగా ఆర్డినెన్స్ తీసుకొచ్చారు. గవర్నర్ అబ్దుల్ నజీర్ సంతకంతో ఆర్డినెన్స్ 1 ఆఫ్ 2024ను విడుదల చేస్తూ న్యాయశాఖ కార్యదర్శి జి. సత్యప్రభాకర్‌రావు తాజాగా గజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. కన్వేయెన్స్ డీడ్ పేరిట తన పేరు, ఫొటోతో కూడిన డాక్యుమెంట్‌ను ఇంటి స్థలాల హక్కులు కల్పిస్తూ ప్రజలకు అందించాలని, దాన్ని వారు చిరకాలం గుర్తుంచుకోవాలన్నది సీఎం జగన్ ఆలోచన. అందుకే ఇంటి స్థలం ఇచ్చిన ఐదేళ్లకే అమ్ముకోవచ్చంటూ ప్రచారం కూడా చేశారు. 2019లోనే కన్వేయెన్స్ డీడ్ ఆలోచన తెరపైకి తీసుకురాగా హైకోర్టు బ్రేకులు వేసింది. ఏ చట్టం పరిధిలో అవి చెల్లుతాయని కోర్టు వేసిన ప్రశ్నకు సర్కారు వద్ద జవాబు లేదు. దీంతో కన్వేయెన్స్ డీడ్ ఇవ్వాలన్న ఉత్తర్వులను, వాటి ఆధారంగా చేపట్టిన ప్రయత్నాలను కోర్టు నిలిపివేసింది. దీనిపై ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. అది ఇంకా పెండింగ్‌లోనే ఉంది. ఇంకా కేసు పరిష్కారం కాకపోవడంతో సర్కారు వెనక్కి తగ్గి పేదలకు డి-ఫాం పట్టా రూపంలోనే ఇంటి స్థలాలు ఇచ్చింది. 20ఏళ్ల దాటిన తర్వాతే ఇంటి స్థలాలపై పూర్తి హక్కులు ఉంటాయని గత టీడీపీ ప్రభుత్వం 2019లో చేసిన చట్ట సవరణను జగన్ సర్కారు 2021లో మార్చేసింది. ఇంటిస్థలం కేటాయించిన పదేళ్ల తర్వాత అసైనీలకు పూర్తి హక్కులు వచ్చేలా పీవోటీ చట్టంలో సవరణలు తీసుకొచ్చింది. ఇటీవల అసైన్‌చట్టంలో సవరణలు చేస్తూ సాగు భూములకు 20ఏళ్ల తర్వాత, ఇంటి స్థలాలకు పదేళ్ల తర్వాత పూర్తి యాజమాన్య హక్కులు ఇస్తామని పేర్కొంది. ఇటీవలే రూల్స్ కూడా విడుదలయ్యాయి. ఇప్పుడు అనూహ్యంగా కన్వేయెన్స్ డీడ్‌ల జారీ, వాటి రిజిస్ట్రేషన్ అంశాన్ని తెరపైకి తెచ్చింది.

డీడ్‌పై వీఆర్‌వో సంతకం

అసైన్డ్ ఇంటి స్థలాలను రిజిస్ట్రేషన్ చేసే కన్వేయెన్స్ డీడ్‌లపై సీఎం జగన్ ఫొటో ఉన్న నవరత్నాల లోగోతోపాటు విడిగా ఆయన ఫొటో, పేరు ముద్రిస్తున్నారు. ఇప్పటికే వీటిని గ్రామాలకు పంపించారు. గతంలో భూమి పట్టాలపై కూడా జగన్ ఫొటోలు ముద్రించారు, రెవెన్యూ రికార్డుల్లోనూ సీఎం, రెవెన్యూ అధికారుల ఫొటోలేసుకున్నారు. ఇప్పుడు ఇంటి పట్టాలపైనా జగన్ ఫొటోలు ముద్రించారు. మరోవైపు అసైన్డ్ ఇంటిస్థలాల లబ్ధిదారులకు ఇచ్చే కన్వేయెన్స్ డీడ్‌ల రిజిస్ట్రేషన్‌కు రెవెన్యూశాఖ తరఫున గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌వో) సంతకం చేయనున్నారు. ఈ మేరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శనివారం ఉత్తర్వులు (జీవో 36) జారీ చేశారు. వీఆర్‌వోలకు ఎన్నికల డ్యూటీ లేకపోవడంతో ఈ పనిని వారికి అప్పగించారు.

డీడ్‌కు చట్టబద్ధత


2019 నుంచి ఇచ్చిన ఇంటి స్థలాలు, 2021లో వచ్చిన చట్టసవరణ వల్ల పదేళ్ల గడువు తీరిన ఇంటి స్థలాలను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు కన్వేయెన్స్ డీడ్ ఇస్తారు. వీటిని గ్రామ, వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేస్తారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ భూముల చట్టం-1977లో సవరణ చేసి ఆంధ్రప్రదేశ్ అసైన్‌మెంట్ భూములు(బదలాయింపు నిషేధం) (సవరణ) ఆర్డినెన్స్-2024ను ప్రభుత్వం విడుదల చేసింది. చట్టంలోని సెక్షన్ 3ని సవరిస్తూ సబ్ సెక్షన్ 1 తర్వాత 1ఏ, 1బీని చేర్చింది. 1ఏ ప్రకారం... ప్రధాన చట్టం నిర్దేశించిన మేరకు పదేళ్ల గడువు తీరిన అసైన్డ్ ఇంటి స్థలానికి పూర్తి యాజమాన్య హక్కులు కల్పించాలి. ఆ స్థలంలో తప్పనిసరిగా ఇంటి నిర్మాణం జరిగి ఉండాలి. అలాంటి వాటికి పూర్తి యాజమాన్య హక్కులు లభిస్తాయి. 1బీ ప్రకారం: "పదేళ్ల గడువు నిర్దేశించే చట్టసవరణ అమల్లోకి వచ్చేనాటికి(2021) లేదా అంతకుముందు (2019) ఇచ్చిన ఇంటి స్థలాలపై కన్వేయెన్స్ డీడ్ జారీ చేయాలి. వీటి ద్వారా పదేళ్ల గడువు తీరిన వాటికి పూర్తి యాజమాన్య హక్కులు దక్కాలి" అని ఆర్డినెన్స్‌లో పేర్కొన్నారు. ఈ సవరణలతో భవిష్యత్తులో ఎన్‌వోసీల అవసరం ఉండకూడదని, పదేళ్ల గడువు తీరిన ఇంటిస్థలాలకు ఎలాంటి నిరభ్యంతర పత్రాలు లేకుండానే కన్వేయెన్స్ డీడ్ రూపంలో పూర్తి హక్కులు రావాలన్నది ప్రభుత్వ ఉద్దేశమని అందులో వివరించారు. అసైన్‌మెంట్ జరిగిన సంవత్సరం, పూర్తి హక్కులు దక్కే సంవత్సరం, ఇతర వివరాలు కన్వేయెన్స్ డీడ్‌పైనే ఉంటాయి. కాబట్టి, గడువు తీరిన తర్వాత లబ్ధిదారులు మళ్లీ రెవెన్యూ ఆఫీసు నుంచి ఎన్‌వోసీ తీసుకోవాల్సిన అవసరం లేదని ప్రభుత్వం పేర్కొంటోంది. కాగా, కన్వేయెన్స్ డీడ్‌ల రిజిస్ట్రేషన్‌ను ఫిబ్రవరి మొదటి వారంలోగా పూర్తిచేయాలని ప్రభుత్వ పెద్దలు జిల్లా కలెక్టర్లకు టార్గెట్ ఇచ్చారు. ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా జగన్, ఆయన ఫొటో, పేరున్న కన్వేయెన్స్ డీడ్‌లను రిజిస్ట్రేషన్ చేసి లబ్ధిదారుల చేతుల్లో పెట్టాలని సర్కారు భావిస్తోంది. లక్షల మందికి ఇంటిపట్టాలు ఇచ్చాననే పేరుతో ఎన్నికల ప్రచారం చేసుకోవాలన్నది వ్యూహంలా కనిపిస్తోంది.

17న జీఎస్ఎల్వీ-ఎఫ్14 ప్రయోగం

- షార్‌కు చేరిన ఇన్‌శాట్-3డీ ఉపగ్రహం
- పేలోడ్ లక్ష్యాలు సాధించిన పీవోఈఎం-3: ఇస్రో


ఇన్‌శాట్-3డీ ఉపగ్రహాన్ని షార్‌కు తరలిస్తున్న ప్రత్యేక వాహనం

సూళ్లూరుపేట, జనవరి 27: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ మరో ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ నుంచి ఫిబ్రవరి 17న జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ ప్రయోగం చేపట్టనున్నారు. ఈ రాకెట్ ద్వారా రోదసిలోకి పంపే ఇన్‌శాట్-3డీ ఉపగ్రహం శనివారం షార్‌కు చేరింది. బెంగళూరులోని ఉపగ్రహ కేంద్రం నుంచి రోడ్డు మార్గాన ప్రత్యేక వాహనంలో భారీ భద్రతతో దీన్ని శ్రీహరికోటకు తీసుకొచ్చారు. షార్‌లోని రెండో ప్రయోగ వేదిక నుంచి ప్రయోగించే జీఎస్ఎల్వీ-ఎఫ్14 రాకెట్ అనుసంధాన పనులను శాస్త్రవేత్తలు పూర్తిచేస్తున్నారు. ఇన్‌శాట్-3డీ ఉపగ్రహాన్ని క్లీన్‌రూమ్‌లో ఉంచి తుది పరీక్షలు నిర్వహిస్తారు. కాగా, పోలార్ ఆర్బిటల్ ఎక్స్‌పెరిమెంటల్ మాడ్యూల్-3(పీవోఈఎం-3) విజయవంతమైందని ఇస్రో ప్రకటించింది. ఈ మాడ్యూల్ తన పేలోడ్ లక్ష్యాలన్నింటినీ విజయవంతంగా పూర్తిచేసిందని శనివారం తెలిపింది. జనవరి 1న ఎక్స్‌రే పోలారిమీటర్ (ఎక్స్‌పోశాట్)ను ప్రయోగించిన పీఎస్ఎల్‌వీ-సీ58 రాకెట్‌లోని పీఎస్4 దశను ఈ మాడ్యూల్ ఉపయోగించుకుంటుంది. విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ ఫిజికల్ రీసెర్చ్ లేబొరేటరీ, అకాడెమియా, స్పేస్ స్టార్టప్‌లు రూపొందించిన 9 పేలోడ్‌లతో పీవోఈఎం-3 ప్రయాణించిందని పేర్కొంది. కక్ష్యలో ప్రవేశపెట్టిన 25వ రోజు నాటికి 400 పరిభ్రమణాలను విజయవంతంగా పూర్తిచేసిందని వెల్లడించింది. ప్రతి పేలోడ్‌ను ఆన్ చేసి, దాని పనితీరును విశ్లేషించడంతో పాటు డేటాను సేకరించినట్లు వివరించింది.


విశాఖలో లక్కీడ్రా సందర్భంగా మాట్లాడుతున్న సోనోవిజన్ మేనేజింగ్ పార్ట్‌నర్ భాస్కరమూర్తి

సోనోవిజన్ లక్కీ డ్రా

విజేతలకు రెండు కార్లు, ఇతర బహుమతులు

విజయవాడ(కృష్ణలంక), జనవరి 27: రిపబ్లిక్ డే సందర్భంగా సోనోవిజన్ వైజాగ్, గాజువాక, గోపాలపట్నం, మధురవాడ, రాజమండ్రి, కాకినాడ బ్రాంచిలకు సంబంధించి గృహోపకరణాల కొనుగోలుదారులకు లక్కీడ్రా ద్వారా రెండు కార్లు, ఇతర ఖరీదైన బహుమతులను అందజేసినట్లు సంస్థ మేనేజింగ్ పార్ట్‌నర్ పి.భాస్కరమూర్తి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వైజాగ్ ద్వారకానగర్ సోనోవిజన్ షోరూంలో శనివారం సాయంత్రం కొనుగోలుదారుల సమక్షంలో లక్కీడ్రా తీశామని పేర్కొన్నారు. ఇందులో హోండా అమేజ్ కారు విజేత కూపన్ నం.18160, వై.శ్రీనివాసరావు, ఎంవీపీ కాలనీ, విశాఖపట్నంగా తెలిపారు. ఎల్ఈడీ టీవీ విజేత కూపన్ నం.248503, ఎస్.గోవిందరావు, కంచరపాలెం, విశాఖపట్నం, రిఫ్రిజిరేటర్ విజేత ఎస్.రాము, వన్‌టౌన్, విశాఖపట్నం, కూపన్ నెం.147797, వాషింగ్ మెషీన్ విజేత కూపన్ నం.51929, కె.సంతోషి, ఓల్డ్ డైరీఫాం, విశాఖపట్నం. అలాగే, రాజమండ్రి, కాకినాడ షోరూం కొనుగోలుదారులకు.. రాజమండ్రి షోరూంలో టీడీపీ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ముఖ్య అతిథిగా లక్కీ డ్రా తీశారు. ఈ లక్కీడ్రాలో మారుతీ కారు విజేత కూపన్ నం.55121, జె.సుబ్రహ్మణ్యం, కాకినాడ రామయ్యపేట నివాసిగా తెలిపారు. ఎల్ఈడీ టీవీ విజేత కూపన్ నం.074758, జె.ప్రవీణ్, ఎ.సి.గార్డెన్, రాజమండ్రి. రిఫ్రిజిరేటర్ విజేత కూపన్ నం.069423, కె.వీరేంద్రకుమార్, చిత్రద, కాకినాడ. వాషింగ్ మెషీన్ విజేత కూపన్ నం.119765, సి.హెచ్.రామకృష్ణ, గొల్లగుంట, జగ్గంపేట. కాగా, ఏపీలో అతిపెద్ద ఎలక్ట్రానిక్స్ షోరూం అయిన సోనోవిజన్ సంస్థ బ్రాంచీల్లో.. అందరికంటే తక్కువ ధరలలో అమ్మకాలతోపాటు నమ్మకమైన సర్వీస్ అందిస్తున్నామని, అందుకే ఇంత ఆదరణ లభిస్తోందని సోనోవిజన్ మేనేజింగ్ పార్ట్‌నర్ భాస్కరమూర్తి తెలిపారు.

గుంటూరులో అరుదైన మోకీళ్ల మార్పిడి ఆపరేషన్

విండ్ స్వైప్ వైకల్య సవరణ శస్త్రచికిత్స.. ఈ తరహా సర్జరీ ఇదే మొదటిసారి




ఆపరేషన్‌కు ముందు, తర్వాత,... దాడి వెంకటేశ్వర్లు

గుంటూరు (మెడికల్), జనవరి 27: విండ్ స్వైప్ డిఫార్మిటీ అనే అరుదైన సంక్లిష్టమైన కీళ్ల సమస్యతో 15 ఏళ్లుగా బాధపడుతున్న వ్యక్తికి గుంటూరుకు చెందిన ప్రముఖ జాయింట్, రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ శివయ్య పోట్ల, క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ఈ తరహా వైకల్య సవరణ సర్జరీ చేయడం గుంటూరులో ఇదే మొదటిసారని ఆయన ప్రకటించారు. బాపట్ల జిల్లా కొలగానివారి పాలెం గ్రామానికి చెందిన దాడి వెంకటేశ్వర్లు (70) 15 ఏళ్లుగా తీవ్రమైన మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నారు. ఆయన మోకాళ్లు వంగిపోయి, అరిగిపోయి అస్థిరంగా మారాయి. ఇటీవల నొప్పితో నడవలేక దాదాపు మంచం పట్టారు. ఆయన కుడి మోకాలు 40 డిగ్రీలు లోపలకు వంగిపోయింది. (బో లెగ్/వారస్ డిఫార్మిటీ) ఎడమ మోకాలు 50 డిగ్రీలు బయటకు వంగిపోయింది. (నాక్ నీ/వాల్గస్ డిఫార్మిటీ) ఇలాంటి వ్యాధిని వైద్య పరిభాషలో విండ్ స్వైప్ డిఫార్మిటీగా పిలుస్తారు. వెంకటేశ్వర్లు చికిత్స కోసం గుంటూరులోని శ్రీరామచంద్ర జాయింట్ రీప్లేస్‌మెంట్ సెంటర్‌లో డాక్టర్ శివయ్య పోట్లను కలిశారు. రోగి కాలి ఎముక, తొడ ఎముక దెబ్బతినడంతో పాటు లిగమెంట్స్ సాగిపోయినట్టు ఆయన గుర్తించారు.

రెండు దశల్లో ఆపరేషన్

డాక్టర్ శివయ్య రెండు దశల్లో వెంకటేశ్వర్లుకు శస్త్రచికిత్స నిర్వహించారు. గత ఏడాది నవంబరు 27న మొదట కుడి మోకీలు మార్పిడి ఆపరేషన్ చేశారు. అమెరికా నుంచి తెప్పించిన జిమ్మర్ ఇంప్లాంట్లను ఉపయోగించి, టిబియా పునర్నిర్మాణం చేసి కుడి మోకీలు మార్పిడి చేశారు. అనంతరం ఈ నెల 23న ఎడమ మోకీలు మార్పిడి ఆపరేషన్ చేశారు. ఇది క్లిష్టమైన సర్జరీ. ఇందులో కూడా జిమ్మర్ ఇంప్లాంట్‌ను వాడారు. అరిగిపోయిన, దెబ్బతిన్న టిబియా, ఫీమర్ ఎముకలను బోన్ సిమెంట్, టైటానియం స్క్రూలు, టైటానియం ఆగ్మెంట్, స్టెమ్స్ ఉపయోగించి లిగమెంట్‌ను సమతుల్యం చేశారు. శస్త్రచికిత్స ముగిసిన ఐదు గంటల్లో రోగిని నడిపించారు. శనివారం వెంకటేశ్వర్లును ఆసుపత్రి నుంచి డిశ్చార్జి చేశారు. డాక్టర్ శివయ్య మాట్లాడుతూ ఈ శస్త్రచికిత్స చేసే సమయంలో రోగి పాదాలు చచ్చుబడే ప్రమాదం ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకొని ఆపరేషన్‌ను విజయవంతంగా చేసినట్టు తెలిపారు.



శ్రీసత్యసాయి జిల్లాలోని లేపాక్షి దుర్గా వీరభద్ర స్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మన్మథరావు శనివారం దర్శించుకున్నారు.



గుంటూరు జిల్లా పొన్నూరులోని శ్రీసహస్రలింగేశ్వర స్వామి, బాపట్ల జిల్లా చందోలులోని శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయాలను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ శనివారం దర్శించుకున్నారు.



లోకేశ్ పాదయాత్ర మొదలు పెట్టి ఏడాది అయిన సందర్భంగా టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న అచ్చెన్నాయుడు తదితరులు

టీడీపీలోకి భారీగా చేరికలు

» అచ్చెన్నాయుడు, లోకేశ్ సమక్షంలో చేరిన నేతలు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ వైసీపీ నుంచి పెద్ద సంఖ్యలో నేతలు శనివారం ఇక్కడ వేర్వేరు కార్యక్రమాల్లో టీడీపీలో చేరారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి వచ్చిన నేతలు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమక్షంలో పార్టీ కేంద్ర కార్యాలయంలో చేరారు. వీరిలో ఉమ్మడి గుంటూరు జిల్లా వైసీపీ మైనారిటీ విభాగం మాజీ అధ్యక్షుడు సయ్యద్ మహబూబ్, వైసీపీ యువజన విభాగం పల్నాడు జిల్లా కార్యదర్శి అంకాళ్ల రాంబాబు, ప్రముఖ వైద్యుడు శింగరాజు సాయికృష్ణ, వైసీపీ కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీశ్, వెసీపీ నేతలు ఉన్నారు. పెద్ద సంఖ్యలో ముస్లిం మైనారిటీలు తరలిరావడంతో టీడీపీ కార్యాలయం కిటకిటలాడింది. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన కొందరు ప్రముఖ వైసీపీ నేతలు మరో కార్యక్రమంలో లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. జడ్పీటీసీ యడ్ల వెంకట్రావు, జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షురాలు యేళ్ల జయలక్ష్మి, దుగ్గిరాల మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పాటిబండ్ల కృష్ణ ప్రసాద్, దుగ్గిరాల సొసైటీ చైర్మన్ పాటిబండ్ల హరి ప్రసాద్ తదితర వైసీపీ నేతలు టీడీపీలో చేరారు. కాగా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగళం ప్రారంభించి ఏడాది అయిన సందర్భంగా టీడీపీ జాతీయ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

పర్చూరు ఎమ్మెల్యేపై రెవెన్యూ కక్షపూరిత ధోరణి

అధికారపార్టీ ఓట్ల అక్రమాలపై పోరాటం చేస్తున్న పర్చూరు టీడీపీ ఎమ్మెల్యే ఏలూరు సాంబశివరావుపై రెవెన్యూ అధికారులు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు కేంద్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. 'ప్రతిపక్షాల ఓట్లు తొలగించాలని అధికారపార్టీ పెద్దఎత్తున ఫారం7, నమోదు కోసం ఫారం 6లు ఇవ్వడంపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాలకి సాంబశివరావు ఫిర్యాదు చేశారు. దీంతో అధికార పార్టీ నేతల ఆదేశాలతో ఏపీడీఆర్ఐ అధికారులు ఎమ్మెల్యేపై కక్ష సాధింపులకు దిగారు. సాంబశివరావు వ్యాపారాలపై, ఆస్తులపై దాడులు చేస్తూ తప్పుడు కేసులు పెట్టి తప్పుడు ప్రచారం చేస్తున్నారు. సాంబశివరావు కంపెనీలో పనిచేసిన ఉద్యోగి నోట్‌బుక్‌లో 2019 ఎన్నికల్లో ఆయన నగదు పంపిణీ చేసినట్లు ఆధారాలు దొరికాయని డీఆర్ఐ అధికారులు చెప్తున్నారు. సాంబశివరావు కంపెనీ సేల్స్ టాక్స్ చెల్లించలేదనే నెపంతో ఆయన కంపెనీపై అన్యాయంగా దాడులు చేశారు' అని అచ్చెన్న తెలిపారు.

పులివెందుల్లోనే జగన్ సీటు చించుతారు: ప్రత్తిపాటి

'నోట్ల వరదతో ఓట్ల వరదను అడ్డుకోలేరు. అవినీతి సొమ్ముతో ప్రజాభిప్రాయాన్ని మార్చలేరు. పులివెందుల ప్రజలు ఈ దఫా జగన్ సీటు చించుతారు. ఆ భయంతో జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో నిద్రలేని రాత్రుళ్లు గడుపుతున్నారు' అని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. శనివారం మంగళగిరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. డబ్బు ఉందన్న అహంకారంతోనే జగన్ ఇన్నేళ్లు సొంతపార్టీ నేతలకు మొహం చూపించలేదన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలనే కలవని వ్యక్తి ఇప్పుడు 'సిద్ధం' అంటూ కార్యకర్తల ముందుకొస్తే జగన్ మాటలు నమ్మే పరిస్థితి లేదన్నారు.

జగన్ పేదల ద్రోహి: కళా వెంకట్రావు

ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపిన జగన్ పేదల ద్రోహి అని టీడీపీ నేత కిమిడి కళా వెంకట్రావు ఆరోపించారు. ధరలు, చార్జీలు, పన్నులు, అప్పుల బాదుడుతో పేదలను ఆర్థికంగా దెబ్బతీసిన జగన్ చెప్పిన అబద్ధాన్నే వందసార్లు చెప్తున్నారని ఆరోపించారు.

వైసీపీని వీడినందునే అక్కసు: రామచంద్రయ్య

'వైసీపీకి రాజీనామా చేసినందుకే ప్రభుత్వం తన పట్ల అక్కసుతో ఉంది. అందుకే నా వివరణకు సమయం ఇవ్వకుండా చర్యలకు ఉపక్రమించింది' అని ఎమ్మెల్సీ సీ రామచంద్రయ్య ఆరోపించారు. శనివారం టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'శాసనమండలి నుంచి అందిన నోటీసులపై నాలుగు వారాల వ్యవధి కావాలని కోరాను. సమయమివ్వకుండా నాపై చర్యలు చేపట్టడం రాజ్యాంగ విరుద్ధం. నా సతీమణి ఆరోగ్యం బాలేదని, నాలుగు వారాలు సమయం కావాలని కోరాను. అయితే వారం వ్యవధి మాత్రమే ఇచ్చారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న నాపై అన్యాయంగా చర్యలకు ఉపక్రమించడం సరైంది కాదు' అని సీఆర్ అన్నారు.

దేవుడే జగన్ కాళ్ల వద్ద ఉన్నాడట: బుద్దా వెంకన్న

విజయవాడ, జనవరి 27: దేవుడే తన కాళ్ల వద్ద ఉన్నాడంటూ భీమిలి సభలో జగన్ మాట్లాడారు అంటూ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న ఎక్స్‌లో పోస్ట్ చేశారు. అతని అహం పూర్తి పరాకాష్ఠకు చేరిందని వ్యాఖ్యానించారు. 'దేవుడే నా కాళ్ల వద్ద ఉన్నాడు. ప్రతిపక్షాలు ఎంత?' అంటూ తనను తాను అర్జునుడితో పోల్చుకోవడం విచిత్రంగా ఉందన్నారు.

ఇవిగో ఆధారాలు.. కాకాణీ రాజీనామా చేస్తావా!?

» కృష్ణపట్నం కంటైనర్ టెర్మినల్ ఈ నెలాఖరులో మూత: సోమిరెడ్డి

నెల్లూరు (వైద్యం), జనవరి 27: కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్ ఈ నెలాఖరులో మూత పడుతుందని, దీనికి తగిన ఆధారాలున్నాయని మాజీ మంత్రి, టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. శనివారం నెల్లూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. జనవరి 31నుంచి పోర్టులో కార్యకలాపాలు ఆగిపోతున్నాయన్నారు. ఇక నుంచి ఎగుమతులు, దిగుమతులు తమిళనాడు ఎన్నూరు కాటుపల్లి పోర్టుల నుంచి జరుపుకోవాలని ఆదానీ కార్యాలయం నుంచి కంపెనీకి ఈ మెయిల్ పంపారని.. ఇవిగో ఆధారాలు అంటూ వాటిని చూపించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నంత కాలం టెర్మినల్‌ను తరలిస్తే పదవిలో కొనసాగే ప్రసక్తే లేదన్న కాకాణి ఇప్పుడు రాజీనామా చేస్తారా... లేదంటే సీఎం కేబినెట్ నుంచి బర్తరఫ్ చేస్తారా అని ప్రశ్నించారు.

వైసీపీ ఫేక్ ప్రచారాలపై వర్ల ఫిర్యాదు

మంగళగిరి, జనవరి 27: టీడీపీ-జనసేన మధ్య పొత్తులను విచ్ఛిన్నం చేయాలన్న కుట్రతో వైసీపీ సోషల్ మీడియాలో చేస్తున్న దుష్ప్రచారాన్ని అడ్డుకునేలా బాధ్యులపై తగు చర్యలను తీసుకోవాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం ఆయన మంగళగిరి రూరల్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వర్ల మాట్లాడుతూ టీడీపీ-జనసేన మధ్య సీట్ల పంపకాలు జరిగాయంటూ ఓ ఫేక్ జాబితాను వైసీపీ తన సోషల్ మీడియాలో విడుదల చేసి ఇరుపార్టీల కార్యకర్తల్లో గందరగోళాన్ని సృష్టిస్తున్నారని చెప్పారు. పార్టీల మధ్య వైషమ్యాలను రగిల్చేవిధంగా ఫేక్ లెటర్లను సృష్టిస్తున్నవారిపై వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

జగన్ భూకబ్జా కోరు: వెంకట్

న్యూఢిల్లీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం భూ బకాసురుడిలాగా మారింది. సీఎం జగన్ భూకబ్జాకోరుగా మారారు' అని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బీ వెంకట్ ఆరోపించారు. శనివారం ఏపీ భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'ఏపీలో జగన్, దళితుల హక్కులను కాలరాస్తున్నారు. సామాజిక న్యాయం పేరిట దళితులకు, గిరిజనులకున్న భూములు లాగేసుకుంటున్నారు. అసైన్డ్ భూమిపై జారీ చేసిన జీవోను వెనక్కి తీసుకోవాలి' అని వెంకట్ డిమాండ్ చేశారు.

ఆసుపత్రికి డోలీ కట్టడమేనా అభివృద్ధి: సీపీఐ

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గిరిజన గ్రామాల నుంచి రోగులను, గర్భిణీలను ఆసుపత్రులకు తీసుకువెళ్లాలంటే డోలీలు కట్టడమేనా సీఎం జగన్ చెబుతున్న అభివృద్ధి? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ శనివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు.

వైసీపీలో వైఎస్సార్ లేరు!

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఆశయాలు ఒక్కటైనా నెరవేర్చావా? ప్రజా ప్రయోజనాలను ఏమాత్రం పట్టించుకోకుండా వైఎస్సార్ తీవ్రంగా వ్యతిరేకించే బీజేపీకి రాష్ట్రాన్ని తాకట్టు పెట్టావు" అని సీఎం జగన్‌పై నిప్పులు చెరిగారు. శనివారం నెల్లూరు, ఒంగోలు ప్రాంతాల్లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో షర్మిల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా సమావేశాల్లో మాట్లాడుతూ.. సీఎం జగన్‌పైనా, ఆయన పాలనపైనా విమర్శల వర్షం కురిపించారు. వైఎస్సార్ పాలనకు, జగన్ పాలనకు నక్కకు నాగలోకానికీ ఉన్నంత తేడా ఉందని ఎద్దేవా చేశారు.

అప్పుల సొమ్ము ఏమైంది?

ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు అప్పు తెచ్చిన సీఎం జగన్ ఆ నిధులు ఏం చేశారని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. "రాజధాని కట్టావా? పోలవరం నిర్మించావా? భారీ ప్రాజెక్టులు కట్టావా? అంత డబ్బును ఏం చేశావ్?" అని నిలదీశారు. బీజేపీకి తాను బానిసగా మారడంతోపాటు రాష్ట్ర ప్రజలను కూడా జగన్ బానిసలుగా చేశారని ఘాటుగా విమర్శించారు. "రాష్ట్ర విభజన తర్వాత ప్రజల మీద ఉన్న అప్పు రూ.1.8 లక్షల కోట్లు. టీడీపీ హయాంలో చేసిన అప్పు మరో రూ.1.8 లక్షల కోట్లు. కానీ, జగన్ తన హయాంలో ఏకంగా రూ.8 లక్షల కోట్ల అప్పు తెచ్చి ప్రజల నెత్తిన పెట్టాడు. పోనీ, ఆ సొమ్ముతో రాష్ట్రంలో ఏదైనా అభివృద్ధి చేశారా అంటే అదీ లేదు. రాజధాని నిర్మించి ఉన్నా దాన్ని చూసి పరిశ్రమలు వచ్చేవి. యువతకు ఉపాధి లభించేది. రాష్ట్రానికి నికర ఆదాయం వచ్చేది. పోనీ, పోలవరం నిర్మించి ఉన్నా 20 లక్షల ఎకరాలకు సాగునీరందే ఉండేది. విజయవాడ, విశాఖ వంటి నగరాల్లో మెట్రో అయినా తెచ్చి ఉంటే కొంత ప్రయోజనం జరుగుండేది. ఒక్కటంటే ఒక్క అభివృద్ధి కూడా చేయకపోగా రాష్ట్ర ప్రజల నెత్తిన మాత్రం రూ.8 లక్షల కోట్ల అప్పు మిగిలింది. బీజేపీకి బానిసలుగా మారి ఊడిగం చేస్తున్నారే తప్ప రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలన్న జ్ఞానం లేకుండా పోయింది" అన్నారు.



నెల్లూరులో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో వైఎస్‌కు నివాళులర్పిస్తున్న షర్మిల

ఎవరి కోసం బీజేపీతో దోస్తీ

సీఎం జగన్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రాష్ట్రానికి ప్రత్యేక హోదా కోసం సమావేశాలు పెట్టారని షర్మిల తెలిపారు. విద్యార్థులను రెచ్చగొట్టారని అన్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థులందరినీ గెలిపించండి, ప్రత్యేక హోదా తీసుకొస్తానని గొప్పలు చెప్పారని, మరి అధికారంలోకి వచ్చిన తర్వాత హోదా గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. పోలవరానికి కూడా పనికిరాని బీజేపీతో దోస్తీ ఎవరికి ఉపయోగపడిందో చెప్పాలని నిలదీశారు. "జగనన్న మూడు రాజధానులు అన్నాడు. ఒక్క రాజధానికి కూడా లేకుండా చేశారు. బీ అంటే బాబు, జే అంటే జగన్, పీ అంటే పవన్ కల్యాణ్ ఈ ముగ్గురిలోనే బీజేపీ ఉంది" అని అన్నారు. నెల్లూరు జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు మొత్తాన్నీ అదానీకే ఇచ్చాశారని, ఆ సంస్థ ఇప్పుడు జిల్లా ప్రజల కడుపుకొట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. కంటైనర్ టెర్మినల్‌ను ఎత్తివేసి 10వేల మంది కార్మికులను వీధినపడేసేందుకు సిద్ధమైందన్నారు.

సజ్జలా.. సిగ్గుందా?

ప్రకాశం జిల్లా పర్యటనలో భాగంగా షర్మిల ఇక్కడి గుండ్లకమ్మ ప్రాజెక్టును సందర్శించారు. ఆమె మాట్లాడుతూ.. వైఎస్ హయాంలో జలయజ్ఞంలో భాగంగా గుండ్లకమ్మ ప్రాజెక్టును నిర్మించారని, సీఎం జగన్ కనీసం నిర్వహణను పట్టించుకోలేదని అన్నారు. నిర్వహణకు ఏటా రూ.కోటి కూడా ఖర్చుపెట్టకపోవడంతో గేట్లు కొట్టుకుపోయాయని విమర్శించారు. జగనన్న పాలనలో అప్పు లేని రైతు ఉన్నాడా? అని ప్రశ్నించారు. రూ.70 వేల కోట్ల విలువజేసే గంగవరం పోర్టును కేవలం రూ.600 కోట్లకే అదానీకి రాసిచ్చేశారని, ఇంతకన్నా అన్యాయం ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. పైగా, గంగవరం పోర్టును అభివృద్ధి చేసేందుకే రూ.600 కోట్లకు అమ్మేశామని చెబుతున్న సజ్జల రామకృష్ణారెడ్డికి కొంచెమైనా సిగ్గుందా? అని షర్మిల ప్రశ్నించారు.

వైసీపీలో వణుకు పుట్టిందా!

"ఈ రాష్ట్రం నా పుట్టిల్లు. కష్టాల్లో ఉన్న ప్రజలను కాపాడుకోవడం వైఎస్ఆర్ బిడ్డగా నా బాధ్యత. నన్ను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ రోజు నెల్లూరులో మా పార్టీ నాయకులు, కార్యకర్తలను బెదిరించారు. హోర్డింగ్‌లను తొలగించారు. సోషల్ మీడియాలో నన్ను దుమ్మెత్తిపోస్తున్నారు. అంటే వైసీపీలో వణుకు పుట్టినట్లే కదా. నేనంటే భయం ఉన్నట్లే కదా! ఎన్ని చేసినా, ఎన్ని బెదిరింపులకు దిగినా వెనక్కు తగ్గే ప్రసక్తే లేదు" అని షర్మిల తేల్చి చెప్పారు.

ఓటమి నాలో కసి పెంచింది

» మంగళగిరితో అనుబంధం పెంచుకొన్నా

» కొందరు వద్దంటున్నా.. ఇక్కడే పోటీ చేస్తున్నా

» టీడీపీలో చేరిన దుగ్గిరాల వైసీపీ నాయకుల సభలో లోకేశ్

మంగళగిరి, జనవరి 27: 'గెలుపు ముఖ్యం కాదు...రికార్డు స్థాయి మెజారిటీని సాధించడమే నా లక్ష్యం' అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. భారీ మెజారిటీని సాధించే దిశగా పార్టీలో చిన్నాపెద్దా నేతలు... కొత్తా పాత నాయకులందరూ కలిసి పనిచేయాలని ఆయన పార్టీ క్యాడర్‌కు పిలుపునిచ్చారు. ఉండవల్లిలోని తన నివాసంలో శనివారం దుగ్గిరాల మండల వైసీపీ నాయకులు భారీగా టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ నియోజకవర్గంలో వైసీపీకి చెందిన నాయకులు టీడీపీలో చేరడం తనకెంతో సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. గత ఎన్నికల్లో మంగళగిరిలో ఓటమి బాధ కలిగించినా, ఎన్నో అవమానాలకు గురి చేసినా తాను కుంగిపోలేదన్నారు. ఆ ఓటమి తనలో కసి పెంచిందన్నారు. పార్టీకి కంచుకోట వంటి నియోజకవర్గాల్లో పోటీ చేసి కాలర్ ఎగరేసే రకాన్ని తాను కాదన్నారు. టీడీపీ జెండా ఎగరని చోట భారీ మెజారిటీతో గెలిచి చూపడమే నిజమైన గెలుపు అన్నారు. పార్టీలో సీనియర్లను గౌరవిస్తానని, కష్టపడి పనిచేసేవారిని ప్రోత్సహిస్తానని చెప్పారు. 'మంగళగిరి వద్దు...ఉత్తరాంధ్ర నుంచి పోటీ చేయమని కొందరు సలహాలు ఇచ్చారు. కానీ నాకెందుకో మంగళగిరి ప్రజలతో మంచి అనుబంధం ఏర్పడింది. అందుకే ఇక్కడి నుంచే పోటీ చేసి, భారీ మెజారిటీతో గెలుపొందాలని చాలా సిన్సియర్‌గా పనిచేస్తున్నా' అని తెలిపారు. భారీ మెజారిటీతో గెలిస్తేనే మంగళగిరిని మోడల్ నియోజకవర్గంగా అభివృద్ధి చేయడానికి తనకు మంచి అవకాశం లభిస్తుందని లోకేశ్ చెప్పారు.

షర్మిలపై నోరు జారితే నాలుక కోస్తాం

» సొంత చెల్లెలిపై అసభ్యకర పోస్టింగులు

» ఆ ఘనత జగన్‌కే: సుంకర పద్మశ్రీ

అమరావతి, విజయవాడ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలపై వైసీపీ నేతలు ఇష్టానుసారంగా నోరు జారితే నాలుక కోస్తామని పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ హెచ్చరించారు. విజయవాడలో మీడియాతో ఆమె శనివారం మాట్లాడారు. 'రాజకీయంగా ఎదుర్కోలేక వైసీపీ నేతలు షర్మిలపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారు. విమర్శలు చేసే వారికి సిగ్గుండాలి. షర్మిల ఆడపిల్ల కాదని, ఆడ పులి. ఆమె వైసీపీ నేతలు చేసే బెదిరింపులకు, విమర్శలకు వెనకడుగు వేయదు. వ్యక్తిగత విమర్శలు చేసి షర్మిలను మానసికంగా దెబ్బతీయాలని చూస్తున్నారు. దళితులపై దాడులు చేస్తూ భారీ అంబేడ్కర్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే సరిపోతుందా అని షర్మిల ప్రశ్నించడంలో తప్పు ఏముంది? షర్మిల పర్యటనలతో వైసీపీ నేతల వెన్నులో వణుకు పుట్టుకొస్తోంది. జగన్ స్వార్థపూరిత రాజకీయాలను ఆమె ప్రజాక్షేత్రంలో ఎండగడుతున్నారు. గత ఎన్నికల సమయంలో జగన్... తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలను ఉపయోగించుకున్న మాట వాస్తవం కాదా? సొంత చెల్లెలుపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టింగులు పెట్టించిన ఘనుడు జగన్. తనపై పోస్టింగ్‌లు పెడుతున్నారని కన్నీరు పెట్టుకున్న మంత్రి రోజా ఇప్పుడు ఎందుకు స్పందించడం లేదు?' అని పద్మశ్రీ నిలదీశారు.

ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా మంత్రి రోజా!

» జిల్లా నేతలకు సమాచారమిచ్చిన విజయసాయిరెడ్డి

(ఒంగోలు - ఆంధ్రజ్యోతి)



అధికార వైసీపీ ఒంగోలు లోక్‌సభ స్థానం నుంచి మంత్రి ఆర్‌కే రోజాను రంగంలోకి దించాలని చూస్తోంది. ఆ మేరకు ప్రకాశం జిల్లా నాయకులకు ఆ పార్టీ నేత విజయసాయిరెడ్డి సమాచారం ఇచ్చారు. సీఎం జగన్ కాదన్నా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డితో వైసీపీ నాయకులు మంతనాలు ప్రారంభించిన నేపథ్యంలో అధిష్ఠానం రోజా పేరు ప్రతిపాదించటం విశేషం. తాను పెట్టిన షరతులకు అంగీకరించని ఎంపీ మాగుంటకు తిరిగి టికెట్ ఇచ్చేది లేదని జగన్ తేల్చిచెప్పిన విషయం తెలిసిందే. ఆ తర్వాత కూడా మాగుంటకు టికెట్ ఇప్పించేందుకు మాజీ మంత్రి బాలినేని ప్రయత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పేరును ఒంగోలు ఎంపీ స్థానానికి అధిష్ఠానం ప్రతిపాదించింది. అయితే బాలినేనితో సహా జిల్లాలోని నాయకులు అందరూ చెవిరెడ్డిని వ్యతిరేకించారు. 'తండ్రీకొడుకులు ఇద్దరికీ టికెట్లు ఇచ్చే విధానం లేదన్నారు కదా..! చెవిరెడ్డికి ఎలా ఇస్తారు? అలాగైతే నా కుమారుడు ప్రణీత్‌రెడ్డి కూడా పోటీకి సిద్ధంగా ఉన్నాడు' అని విజయసాయి, సజ్జలతో బాలినేని అన్నట్లు సమాచారం. మరోవైపు శుక్రవారం ఒంగోలులో మాగుంటతో మరోసారి బాలినేని, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి భేటీ అయ్యారు. 'లోక్‌సభ పరిధిలో అసెంబ్లీల నుంచి పోటీ చేయబోతున్న నాయకులు సీఎంను కలవాలి. ఎంపీ మాగుంటకు టికెట్ ఇచ్చే విషయాన్ని పరిశీలించాలని కోరాలి' అన్న ఆలోచన చేశారు. అయితే ఆ బృందానికి ఎవరు నాయకత్వం వహించాలన్న విషయం దగ్గరే మీమాంస మొదలయింది. ఈ నేపథ్యంలో విజయసాయిరెడ్డి శనివారం బాలినేని, మంత్రి సురేశ్‌తోపాటు మరో ఇద్దరు ముగ్గురు నాయకులతో మాట్లాడారని తెలిసింది. 'ఒంగోలు ఎంపీ అభ్యర్థిగా రోజా పేరు పరిశీలనలో ఉంది. సోమ, మంగళవారాల్లో ఖరారు కావచ్చు' అని సాయిరెడ్డి చెప్పినట్లు సమాచారం. దీనిపై రేపో మాపో ప్రకటన రానుంది.

ఎస్సీ నిధులు గోల్‌మాల్?

» వ్యవసాయ పరికరాల కొనుగోలులో అక్రమాలు

» ఆగ్రోస్‌ను కాదని రంగంలోకి ఎస్సీ కార్పొరేషన్

» మంత్రి సిఫారసు చేసిన కంపెనీకే టెండర్

» రైతులకు నాణ్యతలేని పరికరాలు కట్టబెట్టే యత్నం

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రకృతి సేద్యం చేసే ఎస్సీ రైతులకు కేంద్ర ప్రభుత్వం ఉచితంగా ఇచ్చే వ్యవసాయ పరికరాల టెండర్లలో భారీగా నిధులు స్వాహా చేసేందుకు రంగం సిద్ధమైంది. వ్యవసాయ పరికరాల సరఫరాకు నోడల్ ఏజెన్సీగా ఉన్న ఏపీ ఆగ్రోస్ గత అక్టోబరులో పిలిచిన టెండర్లను గుంటూరు జిల్లాకు చెందిన ఓ మంత్రి ఒత్తిడితో పక్కన పెట్టేశారు. నిధులు విడుదల చేసే ఎస్సీ కార్పొరేషనే కొత్తగా టెండర్లు పిలిచి, మంత్రి సిఫారసు చేసిన సీఎం సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి కంపెనీకి టెండరు కట్టబెట్టారు. టెండరు పొందిన కంపెనీ ఎస్సీ రైతులకు నాణ్యత లేని పరికరాలను అంటగట్టేందుకు ప్రయత్నాలు చేస్తోంది. పరికరాల నాణ్యతను.. ఆగ్రోస్ పిలిచిన టెండరుకు, ఎస్సీ కార్పొరేషన్ పిలిచి టెండరకు మధ్యలో ఉన్న వ్యత్యాసాలే స్పష్టం చేస్తున్నాయి. నాణ్యత లేని పరికరాలకు అధిక ధరలు చెల్లించేందుకు ఎస్సీ కార్పొరేషన్ నిర్ణయం తీసుకుంది. ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన కింద 100% రాయితీతో రాష్ట్రవ్యాప్తంగా 29,272 మంది ఎస్సీ రైతులకు 2 టార్పాలిన్ పట్టాలు, 100, 200 లీటర్ల 2 ప్లాస్టిక్ డ్రమ్స్ ఇవ్వాలని కేంద్రం నిర్దేశించింది. గతేడాది బడ్జెట్‌లో ఈ నిధులు మంజూరుకాగా, ఎన్నికల నేపథ్యంలో అధికార పార్టీ ప్రచారం చేసుకునేందుకు ఇప్పుడు టెండర్లు ఖరారు చేసి, పరికరాలను పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఒక్కో టార్పాలిన్‌కు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.2,500. ఇదే ధరకు ఐఎస్ఐ మార్కు లేని టార్పాలిన్లు సరఫరా చేయడానికి ఎస్సీ కార్పొరేషన్ అనుమతిచ్చినట్టు తెలియవచ్చింది. 6/8 మీటర్ల పొడవు ఉండే టార్పాలిన్‌లు 12కేజీల బరువు, 220జీఎస్ఎంతో 3లేయర్లు ఉండేవి సరఫరా చేయాలని ఆగ్రోస్ టెండర్లలో పేర్కొనగా, నాణ్యత లేని టార్పాలిన్ల సరఫరాకు ఎస్సీ కార్పొరేషన్ టెండర్లు ఖరారు చేసిందని చెప్తున్నారు. డ్రమ్స్ విషయంలో టెండరు డాక్యుమెంటే ఆగ్రోస్ టెండరుకు విరుద్ధంగా ఉందని చెప్తున్నారు. సాధారణంగా ఎక్కువ లీటర్ల డ్రమ్‌కు ధర ఎక్కువ ఉంటుంది. జీఎస్టీతో కలిపి 200లీటర్ల డ్రమ్‌ను రూ.1,676కు, 100లీటర్ల డ్రమ్‌ను రూ.1,047కే ఇస్తామని ఆగ్రోస్ పేర్కొంది. ఆ ధరలను కాదని, 200 లీటర్ల డ్రమ్‌కు రూ.1,020, 100 లీటర్ల డ్రమ్‌కు రూ.1,830గా పేర్కొంటూ ఎస్సీ కార్పొరేషన్ టెండరు డాక్యుమెంట్ రూపొందించింది. దీనివల్ల నాణ్యత లేని డ్రమ్స్‌ను సరఫరా చేయడానికి ఆస్కారం ఏర్పడుతుందని రైతులు అంటున్నారు. అలాగే ప్లాస్టిక్ ఐటమ్స్ కొనేటప్పుడు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పెట్రో కెమికల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ సంస్థ సర్టిఫికేషన్ ఉండాలి. ఇదేమీ లేని కంపెనీకి టెండరు ఖరారు చేసినట్లు తెలిసింది. పైగా నాణ్యత లేని వస్తువులు ఇచ్చి, ధరల వ్యత్యాసంతో నిధులు గోల్‌మాల్ చేసేందుకు అధికారులు, టెండరుదారు కుమ్మక్కయ్యారని ఆరోపణలు వస్తున్నాయి. నాణ్యత లేని వస్తువులను సరఫరా చేయడం ద్వారా పెత్త మొత్తంలో కమీషన్లు చేతులు మారేందుకు అవకాశం కల్పించేలా ఎస్సీ కార్పొరేషన్ టెండరు ఉందంటున్నారు. ఈ టెండర్లపై విజిలెన్స్ విచారణ జరిపితే అవకతవకలన్నీ వెలుగులోకి వస్తాయని అంటున్నారు.

సోనియా వదిలిన బాణం షర్మిల

» ఆమె ఇంటి వేడుకలో జగన్‌కు అవమానం: నారాయణస్వామి

గంగాధరనెల్లూరు, జనవరి 27: 'నాడు... జగనన్న వదిలిన బాణంగా చెప్పుకుని కాంగ్రెస్ పెద్దలపై తిరగబడి జగన్‌కు బాసటగా నిలిచింది. నేడు... సోనియాగాంధీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ వదిలిన బాణంగా మారి సొంత అన్న జగన్‌ని దూషిస్తోంది. ఇది తగదు' అని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలపై డిప్యూటీ సీఎం నారాయణస్వామి ధ్వజమెత్తారు. గంగాధరనెల్లూరులో శనివారం మాట్లాడారు. 'జగన్మోహన్‌రెడ్డి అని కూడా అనకుండా జగన్‌రెడ్డి అంటూ మాట్లాడుతున్న షర్మిలమ్మను చూస్తుంటే నాకు చాలా బాధగా ఉంది. ఆమె కుమారుడు నిశ్చితార్థానికి అన్నగా వెళ్లిన జగన్‌కి షర్మిలమ్మ ఇచ్చిన గౌరవం సరిగా లేదు. ఆయనకు జరిగిన అవమానం టీవీల్లో చూస్తుంటే నాకు కన్నీళ్లు వచ్చాయి' అని అన్నారు.

25 పార్లమెంటు స్థానాలు.. 10 మంది బాధ్యులు

» ఖరారు చేసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 25 పార్లమెంటు స్థానాలకు 10 మంది పార్టీ ముఖ్య నాయకుల్ని ఇన్‌చార్జిలుగా బీజేపీ నియమించింది. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి ఓ ప్రకటన చేశారు. 'ఉత్తరాంధ్రలోని అరకు, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లికి పీవీఎన్ మాధవ్‌తోపాటు సీతారామాంజనేయ చౌదరి ఇన్‌చార్జిలుగా వ్యవహరిస్తారు. ఉభయ గదావరి జిల్లాల్లోని కాకినాడ, అమలాపురం, రాజమండ్రి, నర్సాపురం, ఏలూరుకు కాశీ విశ్వనాథ రాజుతోపాటు కోడూరి లక్ష్మీనారాయణకు బాధ్యతలు అప్పగిస్తున్నాం. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నర్సరావుపేటకు శ్రీనివాసరాజుతో పాటు మట్టా ప్రసాద్... ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, రాజంపేటకు దయాకర్ రెడ్డితోపాటు సామంచి శ్రీనివాస్‌ను ఇన్‌చార్జిలుగా నియమిస్తున్నాం. కడప, హిందూపురం, అనంతపురం, కర్నూలు, నంద్యాలకు బిట్ర శివన్నారాయణ, యాల్లారెడ్డి బాధ్యులుగా వ్యవహరిస్తారు' అని ఆమె పేర్కొన్నారు.

బీజేపీ అనుమతిస్తే ఎంపీగా పోటీ: పరిపూర్ణానంద

హిందూపురం అర్బన్, జనవరి 27: బీజేపీ అధిష్ఠానం అనుమతిస్తే హిందూపురం నుంచి ఎంపీగా పోటీ చేస్తానని శ్రీపీఠం పీఠాధిపతి పరిపూర్ణానంద స్వామి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'హిందూపురం నుంచి పోటీ చేయాలన్న ఆలోచన ఉంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరికి, పార్టీ ముఖ్య నాయకులకు తెలియజేశా. నాకు గెలుపు ముఖ్యం కాదు. ఢిల్లీలో హిందూపురం గొప్పదనాన్ని చాటాలని అనుకుంటున్నా. ఇక్కడి ఆలయాలు, మాన్యం భూములు మాయమైపోతున్నాయని విన్నా' అని పరిపూర్ణానంద అన్నారు.

వైజాగ్‌లో జగన్ విధ్వంసమే ఎక్కువ: రఘురామ

న్యూఢిల్లీ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో హుద్ హుద్ తుఫాను కంటే సీఎం జగన్‌రెడ్డి చేసిన విధ్వంసమే ఎన్నో రెట్లు ఎక్కువని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణరాజు అన్నారు. శనివారం రచ్చబండలో భాగంగా తన నివాసంలో మాట్లాడారు. 'విశాఖపట్నంలో జగన్ ప్రభుత్వం చేయని దరిద్రం, అరాచకమన్నది లేదు. ఇంకా ఏ మొహం పెట్టుకొని ఓట్లు అడుగుతారు? అక్కడ ఆ పార్టీ తరఫున పోటీ చేసేందుకు అభ్యర్థులే దొరకడం లేదు. స్థానిక ఎంపీ కుటుంబానికే రక్షణ లేదు. జగన్ పాలనలో విశాఖపట్నం విలవిలలాడుతోంది' అని అన్నారు.

మాదిగ జాతి గుండెల్లో మోదీ: ఎంఆర్‌పీఎస్

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): 'మా జాతికి నరేంద్ర మోదీ ఇచ్చిన ప్రాధాన్యం దేశంలో ఇప్పటి వరకూ ఏ ప్రధాన మంత్రీ ఇవ్వలేదు. ఆయన్ను మాదిగ జాతి గుండెల్లో పెట్టుకుంది' అని ఎమ్మార్పీఎస్ పేర్కొంది. విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయానికి వచ్చి అధ్యక్షురాలు పురందేశ్వరితో ఎంఆర్‌పీఎస్ నేతల బృందం భేటీ అయింది. తెలంగాణలో జరిగిన మాదిగల విశ్వరూప సభలో మాదిగల కల నెరవేర్చే హామీని మోదీ ఇచ్చారని గుర్తు చేశారు.

సీమ ద్రోహి జగన్: తులసిరెడ్డి

కడప, జనవరి 27: రాష్ట్ర విభజన తరువాత రాయలసీమకు రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీ, స్టీల్ ఫ్యాక్టరీ, కడప-బెంగళూరు రైల్వే నిర్మాణ పనుల హక్కులను సాధించడంలో సీఎం జగన్ సీమ ప్రజలకు శఠగోపం పెట్టాడని పీసీసీ మీడియా చైర్మన్ తులసిరెడ్డి మండిపడ్డారు. శనివారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మాట్లాడు తూ.. 'రాయలసీమ ప్రజలకు నవ మోసాలు, ద్రోహాలు చేయడంలో జగన్‌రెడ్డి దిట్ట. కడప-బెంగళూరు రైల్వే పనులను కాంగ్రెస్ హయాంలో వైఎస్ ప్రారంభిస్తే ఆ రైల్వే లైనే వద్దంటూ కేంద్రానికి జగన్ లేఖ రాసి ద్రోహిగా మిగిలాడు' అని అన్నారు.

ఎన్టీఆర్ భవన్‌లో రాజానగరం, రాజోలు వేడి

» నియోజకవర్గ నేతలకు సర్దిచెప్పి పంపిన అగ్ర నేతలు

అమరావతి, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఇక్కడి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శనివారం రాజానగరం, రాజోలు నియోజకవర్గాల వేడి కనిపించింది. తమ సీట్లను మిత్రపక్షం జనసేన పార్టీకి కేటాయించడాన్ని నిరసిస్తూ ఈ రెండు నియోజకవర్గాల నుంచి పెద్ద సంఖ్యలో టీడీపీ నేతలు, కార్యకర్తలు కేంద్ర కార్యాలయానికి తరలివచ్చారు. పొత్తులో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని ఈ రెండు సీట్లలో తమ పార్టీ పోటీ చేస్తున్నట్లు జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ ప్రకటన ఆ రెండు నియోజకవర్గాల్లోని టీడీపీ శ్రేణుల్లో కలకలం సృష్టించింది. రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బొడ్డు వెంకట రమణ, రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న గొల్లపల్లి సూర్యారావు అనుచర వర్గం శుక్రవారం ఉదయం ఇక్కడకు వేర్వేరుగా భారీగా తరలివచ్చింది. రాజానగరం నియోజకవర్గ నేతలు, కార్యకర్తలు కొంత సంయమనంతో ఉన్నా రాజోలు నియోజకవర్గ కార్యకర్తలు నినాదాలతో పార్టీ కార్యాలయాన్ని హోరెత్తించారు. తర్వాత ఈ రెండు నియోజకవర్గాల నేతలతో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సమావేశం అయ్యారు. ఆయనతోపాటు మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు కూడా ఉన్నారు. రెండు నియోజకవర్గాల నేతలు తమ తమ వాదనలను వారికి వినిపించారు. వీటిని టీడీపీనే తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఏదైనా కారణం వల్ల కుదరకపోతే ఆ నేతలకు ప్రత్యమ్నాయంగా మరెక్కడైనా పోటీ చేసే అవకాశం ఇవ్వాలని కొందరు పార్టీ అధ్యక్షుడిని కోరారు. వారి అభిప్రాయాలను పార్టీ అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తానని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు. అగ్ర నేతలు సర్ది చెప్పడంతో వచ్చిన వారు తమ నియోజకవర్గాలకు తిరిగి వెళ్లిపోయారు. కాగా, ఆ తరువాత జరిగిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ, టీడీపీ, జనసేన సీట్లపై ఎవరూ కంగారుపడాల్సిన అవసరం లేదు. మేం వారితో మాట్లాడాం. వారి వాదన విన్నాం. పార్టీ నాయకత్వం అన్ని కోణాల నుంచి ఆలోచిస్తుంది. రెండు పార్టీల అధ్యక్షులు... చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలసి కూర్చుని ఈ అంశాలపై చర్చించి ఒక స్పష్టత ఇస్తారు. ఉభయతారకంగా నిర్ణయాలు ఉంటాయి' అని చెప్పారు.



వైసీపీ నాయకుల దాడిలో గాయపడ్డవారిని ఉరవకొండ ఆస్పత్రిలో పరామర్శిస్తున్న కాలవ శ్రీనివాసులు, పయ్యావుల కేశవ్, ఉమామహేశ్వరనాయుడు

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకుల దాడి

చంద్రబాబు సభ ముగించుకుని వెళుతుండగా గొడవ

ఉరవకొండ, జనవరి 27: అనంతపురం జిల్లా ఉరవకొండలో టీడీపీ అధినేత చంద్రబాబు బహిరంగసభను ముగించుకుని వెళ్తున్న టీడీపీ కార్యకర్తలపై వైసీపీ నాయకులు శనివారం రాత్రి దాడి చేశారు. బ్రహ్మసముద్రం మండలం ముప్పలకుంటకు చెందిన టీడీపీ కార్యకర్తలు వాహనంలో వెళుతూ.. రేణుమాకులపల్లిలో అడ్డంగా ఉన్న వాహనాలు తీయాలని కోరారు. దీంతో ఆ గ్రామ వైసీపీ కార్యకర్తలు గొడవకు దిగారు. టీడీపీ కార్యకర్తలు వెళుతున్న వాహనాన్ని కట్టెలతో ధ్వంసం చేశారు. వాహనంలో ఉన్న టీడీపీ కార్యకర్తలు రవితేజ, వన్నూరుస్వామి, నల్లప్ప, నరసింహులుపై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, టీడీపీ నాయకులు కాలవ శ్రీనివాసులు, ఉమామహేశ్వరనాయుడు బాధితులను పరామర్శించారు.





టార్గెట్ 3 లక్షలు..
వచ్చింది 30 వేలే

సంగివలస జగన్ సభకు జనం హాజరు ఇంతే

- ఉత్తరాంధ్రలో 34 నియోజకవర్గాల నుంచి భారీ జనసమీకరణకు పెద్దల ఆదేశం
- 1000కి పైగా ఆర్టీసీ బస్సులు
- పోలిపల్లి టీడీపీ సభను తలదన్నేలా నిర్వహించాలని వైసీపీ నేతల యత్నం
- టీడీపీ సభకు 2 లక్షలకు పైగా హాజరు
- 40 ఎకరాల్లో సభకు ఏర్పాట్లు
- సంగివలసలో కేవలం 12 ఎకరాలే
- అధికారమంతా ఉపయోగించినా జగన్ సభకు జనం అంతంతే

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

ఎన్నికల యుద్ధానికి 'సిద్ధం' అంటూ ముఖ్యమంత్రి జగన్ విశాఖపట్నం జిల్లా సంగివలసలో శనివారం నిర్వహించిన సభకు ఆశించిన స్థాయిలో జన సమీకరణ చేయలేకపోయారు. ఉత్తరాంధ్రలోని 34 నియోజకవర్గాల నుంచి 3 లక్షల మందిని సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుని, అధికారమంతా ఉపయోగించినా 30 వేలకు మించి జనాలను తీసుకురాలేకపోయారు. జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ నుంచి వేయికి పైగా బస్సులు తీసుకున్నారు. భారీగా నిధులు వెచ్చించారు. అయినా జనం మొహం చాటేశారు. గత నెలలో ఉత్తరాంధ్రలోనే ఇక్కడికి సమీపంలో విజయనగరం జిల్లా భోగాపురం మండలం పోలిపల్లిలో టీడీపీ నిర్వహించిన 'యువగళం.. నవశకం' సభను తలదన్నేలా జగన్ సభ నిర్వహించాలని యత్నించారు. సర్వశక్తులూ ఒడ్డారు. అయినా పోలిపల్లి సభకు వచ్చిన జనంలో ఐదో వంతు మందిని కూడా జగన్ సభకు తీసుకురాలేకపోయారు. పైగా జగన్ వేదికపైకి వచ్చి ప్రసంగించక ముందే జనాలు వెనక్కి వెళ్లిపోవడం ప్రారంభించారు. పలుచగా వచ్చిన జనాలను చూసే జగన్ కేరింతలు కొట్టారు. 'వైనాట్ 175' అంటూ తొడలు చరిచారు. టీడీపీ బహిరంగ సభలో జిల్లా స్థాయి నాయకులు అందరికీ మాట్లాడే అవకాశం ఇవ్వగా.. జగన్ సభలో మంత్రులు ధర్మాన ప్రసాదరావు, రాజన్నదొర, బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేలు గొల్ల బాబూరావు, ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో మాత్రమే మాట్లాడించారు. ఆ తరువాత సీఎం జగనే గంటన్నర మాట్లాడారు. జగన్ మాట్లాడుతున్నప్పుడు రోడ్డుపై జనం నిల్చొని చూస్తుండగా పోలీసులు తాళ్లు వేసి వారిని బలవంతంగా లోపలికి లాక్కొని వచ్చారు. ప్రాంగణంలో చాలా ఖాళీ ఉందని, అక్కడ నిల్చోవాలని సూచించారు. జగన్ జనం మధ్యకు వెళ్లి వారితో మాట్లాడాలనే ఉద్దేశంతో గ్యాలరీల మధ్య శిలువ ఆకారంలో ర్యాంపు వేశారు. అయితే ముందే ఆ ర్యాంపు పై జగన్ నడుచుకుంటూ వెళ్లి చేతులు ఊపి వచ్చేశారు. ముందుగా అనుకున్నట్టుగా ఎవరితోనూ ముచ్చటించలేదు. మొత్తానికి టీడీపీ పోలిపల్లి సభలా నిర్వహించాలని యత్నించి వైసీపీ నాయకులు తీవ్రంగా విఫలమయ్యారు.

బస్సులు నిండక పాట్లు

అటు ఇచ్ఛాపురం నుంచి ఇటు పాయకరావుపేట వరకు జనాలను సంగివలస సభకు తరలించడానికి వైసీపీ వేయికి పైగా ఆర్టీసు బస్సులను తీసుకుంది. వాటిలో వెళ్లేందుకు జనాలు లేకపోవడంతో అనేక బస్సులు గ్రామాల్లోనే మధ్యాహ్నం మూడు వరకు ఉండిపోయాయి. కొన్ని సగం జనాలతోనే వెళ్లాయి. మరికొన్ని బస్సులైతే ఐదారుగురితోనే సభాస్థలికి చేరాయి. విశాఖలో మధ్యాహ్నం రెండు గంటలు అవుతున్నా జనాలు రాక బస్సులు రోడ్డు పక్కన ఉండిపోయాయి. అడిగినన్ని బస్సులు ఇచ్చినా జనాలను తీసుకురాలేకపోయారంటూ నియోజకవర్గ ఇన్‌చార్జులపై పార్టీ పెద్దలు కన్నెర్ర చేశారు.

ఇటు ప్రయాణికులకు అవస్థలు

జగన్ సభకు జనాన్ని తరలించేందుకు ఆర్టీసీ అధికారులు వందలాది బస్సులు ఇచ్చేయడంతో సాధారణ ప్రయాణికులు, గ్రామీణులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విశాఖ జిల్లాలోని ఏడు డిపోల నుంచి 325 బస్సులను తరలించారు. దీంతో ఆయా బస్సులు తిరిగే రూట్లలో ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది. విశాఖ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు బస్సులు లేక క్యాబ్‌లు, ఆటోల్లో గమ్యస్థానాలకు బయలుదేరారు. జేఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కూడా ఆటోలను ఆశ్రయించారు. కళాశాల విద్యార్థులు అయితే ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ప్రయాణించడం కనిపించింది. అనకాపల్లి డిపోలో 107 బస్సులు ఉండగా 45, నర్సీపట్నం డిపోలో 104 బస్సులు ఉండగా 60, పాడేరు డిపోలో 45 బస్సులు ఉండగా 22 బస్సులను సీఎం సభకు జనాన్ని తరలించేందుకు కేటాయించారు.

ఉత్తరాంధ్రలో జరిగిన టీడీపీ, వైసీపీ సభల వ్యత్యాసాలు

	గత నెలలో పోలిపల్లిలో టీడీపీ సభ	శనివారం సంగివలసలో వైసీపీ సభ
సభకు ఎంపిక చేసిన స్థలం	50 ఎకరాలు	14 ఎకరాలు
జనం కోసం ఏర్పాట్లు	40 ఎకరాల్లో	12 ఎకరాల్లో
ఆర్టీసీ బస్సులు	ఇవ్వలేదు	వేయికిపైగా బస్సులు
ప్రైవేటు బస్సులు	ఇవ్వకుండా సర్కారు ఆంక్షలు	బలవంతంగా స్వాధీనం
ఆటోలు	కార్యకర్తలను తీసుకువచ్చినవాటిపై కేసులు	చాలా బస్సుల్లో ఖాళీగా సీట్లు
సభ సమయం	మ.3 గంటల నుంచి రాత్రి 8 వరకు	మ.3 నుంచి సాయంత్రం 5.30 వరకు
నాయకుల ప్రసంగం	పదుల సంఖ్యలో అవకాశం	ఐదుగురికి మాత్రమే చాన్స్
సభకు హాజరు	2 లక్షల మందికి పైగా	కేవలం 30 వేల మందే రాక

పోలిపల్లి సభలో చంద్రబాబు ప్రసంగం ముగిసేంత వరకూ జనం ఉండగా, సంగివలసలో జగన్ ప్రసంగానికి ముందే జనం తిరుగుముఖం పట్టారు.

రెండు నెలల్లో ఎన్నికల యుద్ధం

- కార్యకర్త నుంచి రాజ్యసభ సభ్యుడి వరకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలి
- వలంటీర్లు వైసీపీ కార్యకర్తలే.. సంగివలస సభలో సీఎం జగన్



విశాఖపట్నం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రానున్న రెండు నెలల్లో రాష్ట్రంలో ఎన్నికల యుద్ధం జరగనుందని, దీనికి వైసీపీ కార్యకర్త నుంచి రాజ్యసభ సభ్యుడి వరకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని సీఎం జగన్ పిలుపునిచ్చారు. విశాఖపట్నం జిల్లాలోని భీమిలి నియోజకవర్గంలో ఉన్న సంగివలసలో శనివారం 'సిద్ధం' పేరిట నిర్వహించిన వైసీపీ తొలి ఎన్నికల ప్రచార సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చినహామీల్లో 99 శాతం అమలు చేశామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమల్లో టీడీపీ, వైసీపీ ప్రభుత్వాల మధ్య తేడాను ప్రతి ఇంటికీ వెళ్లి చెప్పాలని సూచించారు. గడచిన 56 నెలల్లో ప్రతి కుటుంబానికి, గ్రామానికి వైసీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి అందించిందని గొప్పలు చెప్పుకొన్నారు. వచ్చే ఎన్నికల్లో 175కి 175 ఎమ్మెల్యే సీట్లు, 25కి 25 ఎంపీ సీట్లు గెలిచి తీరుతామని ధీమా వ్యక్తంచేశారు. వైసీపీ చేసిన మంచి పనులు చెబితే చాలని, ప్రజలే ఓట్లు వేస్తారని అన్నారు. రాబోయే ఎన్నికలు కురుక్షేత్ర యుద్ధమని, ఈ యుద్ధంలో అటు వైపు దుష్టచతుష్టయం, కౌరవ సైన్యం ఉందన్నారు. తాను పద్మవ్యూహంలో చిక్కుకున్న అభిమన్యుడిని కాదని.. విజయం సాధించిన అర్జునుడినని చెప్పుకొన్నారు. ప్రజలు, దేవుడి దయ కృష్ణుని రూపంలో తన వెంట ఉన్నాయన్నారు. ఎన్నికల్లో వైసీపీ ఒంటరిగా పోటీ చేస్తుందని తెలిపారు. చంద్రబాబు దత్తపుత్రుడితో పొత్తు కోసం వెంపర్లాడుతున్నారని విమర్శించారు. వారికి 175 స్థానాల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా లేరని వ్యాఖ్యానించారు. చంద్రబాబుకు గత ఎన్నికల్లో వచ్చిన 23 సీట్లు కూడా ఈసారి రావని జగన్ వ్యాఖ్యానించారు.

వలంటీర్లు మనవాళ్లే

రాష్ట్రంలో పనిచేస్తున్న వలంటీర్లు వైసీపీ కార్యకర్తలేనని సీఎం జగన్ అంగీకరించారు. ఏ పథకమైనా నేరుగా గడప వద్దకే చేరేలా వలంటీర్ల వ్యవస్థను తీసుకువచ్చామన్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా వైసీపీ..జగన్ మార్కు పాలనే కనిపిస్తోందని చెప్పారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కొత్తగా 2.13 లక్షల మందికి ఉద్యోగాలు ఇచ్చానన్నారు. ఎవరైనా సరే ఏ పదవికి పోటీ చేసినా తప్పక గెలుస్తారని, ఆ విధంగా పరిపాలన అందించామన్నారు. వలంటీర్లు కూడా పార్టీ నుంచి వచ్చిన వారేనని, వాళ్లను చూసి మనవారేనని గర్వపడాలన్నారు. రానున్న ఎన్నికలు పెత్తందారు వర్గమైన చంద్రబాబు, అతని వర్గానికి, పేదవారమైన వైసీపీకి మధ్యే పోరు జరగనుందని జగన్ చెప్పుకొచ్చారు.

ప్రజలను రెచ్చగొడుతూ..

సెల్‌ఫోన్ ఉన్న ప్రతి ఒక్కరూ వైసీపీ తరఫున సోషల్ మీడియాలో యుద్ధం చేయాలని సీఎం జగన్ రెచ్చగొట్టారు. విపక్షాల యుక్తులను తిప్పికొట్టాలన్నారు. పథకాలు వద్దనుకుంటేనే ప్రతిపక్షాలకు ఓట్లు వేయాలని ప్రజలకు సూచించాలన్నారు. "మీ బిడ్డ ఎవరికీ భయపడడు" అంటూ ఎన్నికల శంఖం పూరించారు. అనంతరం ఢంకా కొట్టి నగారా మోగించారు. కాగా, సిద్ధం సభలో సీఎం జగన్ చేసిన విన్యాసాలకు జనం పగలబడి నవ్వారు. నా బీసీలు, నా అక్కచెల్లెళ్లు.. అని ఆయన మాట్లాడుతుంటే కామెడీగా అనిపించి ప్రజలు నవ్వుకున్నారు. ముఖ్యంగా "నా..నా...నా..నా.." అంటూ సాగదీస్తూ మాట్లాడడంతో సభ ప్రాంగణంలోని జనాలు పడిపడి నవ్వుకున్నారు.

వేదిక ముందు శిలువ ఆకారంపై నడక

సంగివలసలో నిర్వహించిన సభలో ఏర్పాటు చేసిన గ్యాలరీల వద్దకు నడిచి వెళ్లేందుకు వీలుగా ఒక ర్యాంపు నిర్మించారు. ఇది క్రైస్తవులు ఆరాధించే 'శిలువ' ఆకారంలో ఉంది. దీనిపై గ్రీన్ కార్పెట్ వేశారు. సీఎం తన ప్రసంగానికి ముందే శిలువ ఆకారంలో ఉన్న ర్యాంపుపై నడుచుకుంటూ వెళ్లి పార్టీ నాయకులు, కార్యకర్తలకు అభివాదాలు చేశారు. ఈ వీడియో సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. క్రైస్తవుల మనోభావాలు దెబ్బతీసేలా జగన్ వ్యవహరించారని, శిలువ ఆకారంలో ర్యాంపు ఏర్పాటుచేయడం, దానిని తొక్కుకుంటూ ఆయన సెక్యూరిటీతో కలిసి వెళ్లడం ఏమిటని పలువురు విమర్శలు గుప్పించారు.

సీఎం జగన్ సభకు ఆర్టీసీ బస్సులు

- ప్రయాణికులకు తప్పని ఇబ్బందులు

పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): భీమిలిలో శనివారం నిర్వహించిన ముఖ్యమంత్రి జగన్ బహిరంగ సభకు జనాలను తరలించేందుకు పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల నుంచి భారీగా ఆర్టీసీ బస్సులను మళ్లించారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పలేదు. పార్వతీపురం, సాలూరు, పాలకొండ డిపోల నుంచి 130 బస్సులను, విజయనగరం, ఎస్.కోట డిపోల నుంచి 96 బస్సులను సీఎం సభకు పంపించారు. దీంతో ప్రయాణికులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది. ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో ప్రయాణికులు బస్సుల కోసం గంటల కొద్దీ నిరీక్షించారు. సీఎం జగన్ సమావేశానికి బస్సులను తరలించారని తెలిసి, సర్కారు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా, భీమిలిలో జరిగిన వైసీపీ సభకు శ్రీకాకుళం జిల్లా నుంచి 154 ఆర్టీసీ బస్సులను తరలించారు. కొన్ని పాఠశాలల బస్సులు, ప్రైవేటు వాహనాలను సైతం భీమిలి సభకు మళ్లించేశారు. దీంతో జిల్లా ప్రజల అవస్థలు అన్నీ ఇన్నీ కావు. జిల్లాకేంద్రానికి రోజూ పలు ప్రాంతాల నుంచి వందలాది మంది జనం రాకపోకలు సాగిస్తుంటారు. వారంతా బస్సులు లేక గంటల పాటు నిరీక్షించి ఇబ్బందులు పడ్డారు. చివరకు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

సీఎం సభకు వెళ్తుండగా అపశ్రుతి

- బస్సు వెనుక టైర్ కిందపడి క్లీనర్ మృతి

కోటబొమ్మాళి, జనవరి 27: సీఎం జగన్ సభకు బస్సులో వెళ్తుండగా అపశ్రుతి చోటుచేసుకుంది. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళిలో బస్సు వెనుక టైర్ కింద పడి ఓ క్లీనర్ మృతి చెందాడు. భీమిలిలో శనివారం జరిగిన సీఎం జగన్ సభకు పార్టీ శ్రేణులను, ప్రజలను తరలించేందుకు కోటబొమ్మాళి నుంచి ఏడు బస్సులు కేటాయించారు. వీటిలో ఒక బస్సు స్థానిక ఇండియన్ బ్యాంక్ సమీపానికి వచ్చేసరికి బస్సు డోర్ వద్ద ఫుట్‌రెస్ట్‌పై నిల్చున్న క్లీనర్ ఉప్పాడ లక్ష్మణరావు(40) అదుపుతప్పి కాలుజారి పడిపోయాడు. బస్సు వెనుక టైరు లక్ష్మణరావు తలపై నుంచి వెళ్లిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





జగన్.. ఇక ఇంటికే

(మొదటి పేజీ తరువాయి)


వేదికపై చంద్రబాబునాయుడుతో పాటు రాజంపేట పార్లమెంటు అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, చల్లా రామచంద్రారెడ్డి, నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డి

టీడీపీ గెలుపును ఆపలేరు' అని అన్నారు. గత నాలుగు సంవత్సరాలా 9 నెలల పాటు రాష్ట్రంలో దుర్మార్గమైన పాలన సాగిందన్నారు. ఈ పాలనకు చరమగీతం పాడి, మారీచుడైన జగన్‌ను ఓడించేందుకు ఎన్నికలు ఎప్పుడొస్తాయా అని ప్రజలు ఎదురుచూస్తున్నారన్నారు. వైసీపీ జెండాను పాతిపెట్టేందుకు ఆ పార్టీ అరాచకాలు, అక్రమ కేసులు, తప్పుడు కేసులతో ఇబ్బంది పడ్డ ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త 74 రోజులు పాటు సైకిల్ ఎక్కాలన్నారు. జగన్ దుర్మార్గపు పాలన గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. 'ఒక్క అవకాశం అంటూ.. అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని పీల్చి పిప్పి చేశాడు. ఎన్నో హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశాడు. ఇప్పుడు మళ్లీ ప్రజలను మాయ మాటలతో మోసం చేసేందుకు వస్తున్నాడు' అని చంద్రబాబు నిప్పులు చెరిగారు.

జగన్ రాయలసీమ ద్రోహి

'రాయలసీమ ప్రాంతానికి నీళ్లు ఇస్తే ఇక్కడి భూముల్లో బంగారమే పండుతుంది. రాయలసీమలో తెలుగుగంగ, హంద్రీ-నీవా, గాలేరు- నగరి ప్రాజెక్టులను దివంగత ఎన్టీ రామారావు హయాంలో మొదలు పెట్టారు. నేను అధికారంలో ఉన్న సమయంలో రాయలసీమలో ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.12,500 కోట్లు ఖర్చు చేశాం. గత ఐదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వం మేం ఖర్చు చేసిన మొత్తంలో 20 శాతం కూడా ఖర్చు చేయలేదు. జగన్ రాయలసీమ ద్రోహిగా మిగిలిపోయాడు. సీమను మేం ఉద్యాన పంటల హబ్‌గా తయారు చేయాలని చూస్తే, జగన్ వచ్చి సర్వనాశనం చేశాడు. సీమలో ఉన్న రెడ్లు, ముస్లింలను కూడా మోసం చేశాడు. సీమలో టమోటా రైతులను ఆదుకోవడానికి ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తాం' అని అన్నారు.

ఎటు చూసినా దోపిడీ

'వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చి బ్రాండ్లను అమ్ముతూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 35 లక్షల మంది మద్యం ప్రియులు బాధితులుగా మారారు. దాదాపు 30 వేలమంది నాసిరకం మద్యం తాగి మృతి చెందారు. అక్రమ మద్యం వ్యాపారంతో వచ్చే డబ్బు ప్రతి రోజూ తాడేపల్లె కొంపకు చేరుతోంది. ముఖ్యమంత్రి బటన్ నొక్కుతూ ఏటా కోట్లాది రూపాయలను దోచేస్తున్నాడు. అధికార పార్టీ నాయకులు ఇసుకను దోచేస్తూ వందల కోట్లు అక్రమంగా సంపాదిస్తున్నారు. గత ఐదేళ్లలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. కరెంటు చార్జీలు గతంలో కంటే ఐదు రెట్లు పెరిగాయి' అని విమర్శించారు.

'అన్నమయ్య' నిర్మాణం ఎప్పుడు?

'ముఖ్యమంత్రి జగన్ సొంత జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోయి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటి వరకు కనీసం ఇటుక రాయి కూడా వేయలేదు. డ్యామ్‌కు కనీసం గ్రీసు కూడా వేయలేని వ్యక్తి మూడు రాజధానులు నిర్మిస్తాడా? ఈ ప్రాజెక్టు కొట్టుకుపోయినపుడు 40 మంది చనిపోయారు. 450 ఇళ్లు కోల్పోయారు. ఇప్పటికీ కనీసం ఒక్క ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదు' అని బాబు మండిపడ్డారు.

పాపాల పెద్దిరెడ్డిని ఓడిస్తాం

'పాపాల పెద్దిరెడ్డీ.. నీకు వయసు పెరిగింది గానీ బుద్ధి పెరగలేదు. ఇంతకాలం నా దయాదాక్షిణ్యాలతో గెలుస్తూ వచ్చావ్. వచ్చే ఎన్నికల్లో నా తడాఖా చూపిస్తా. ఇకపై పుంగనూరులో ఎలా గెలుస్తావో చూస్తా. ప్రాజెక్టుల నిర్మాణంలో ఆయన చేసిన అవినీతిని బహిర్గతం చేసినందుకు అంగళ్లు, పుంగనూరులో టీడీపీ శ్రేణులపై అన్యాయంగా అక్రమ కేసులు బనాయించారు. సుమారు 600 మందిపై అక్రమ కేసులు పెట్టి టీడీపీ వారిని వేధించారు. ఆయన కుప్పం వెళ్లి నన్ను ఓడిస్తానని ప్రగల్భాలు పలుకుతున్నాడు. వచ్చే ఎన్నికల్లో పుంగనూరులో ఓడించి నా సత్తా ఏంటో ఆయనకు చూపిస్తాను' అని చంద్రబాబు సవాల్ విసిరారు. 'ఇక్కడ ఒకాయన ఉన్నాడు. ఆయన పేరు పాపాల పెద్దిరెడ్డి. ఆయన గురించి మీకు తెలుసా? ఆయన పాపాల పెద్దిరెడ్డి అంటే మీరు ఒప్పుకొంటారా? ఒప్పుకొంటే చేతులు పైకెత్తండి' అంటూ చంద్రబాబు అనగా.. సభకు హాజరైన వారంతా ఒక్కసారిగా చేతులు ఎత్తారు. 'పాపాల పెద్దిరెడ్డీ.. చూడవయ్యా నీ పాపులారిటీ' అంటూ చంద్రబాబు ఎద్దేవా చేశారు.

జగన్ ఓటమిని అంగీకరించాడు

జగన్ వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఉరవకొండ సభలో చంద్రబాబు ధ్వజమెత్తారు. 'రా.. కదలి రా' బహిరంగ సభల ద్వారా ప్రజలను చైతన్యం చేసేందుకు వచ్చానని అన్నారు. 'మేమంతా మీ వెనకాలే ఉన్నాం' అని చెప్పేందుకు మీరంతా ఉత్సాహంతో వచ్చారని, ఇదంతా తన పూర్వజన్మ సుకృతమని అన్నారు. జగన్ కూడా ఉరవకొండలో మీటింగ్ పెట్టాడని, వైసీపీ మీటింగ్‌కు, మన మీటింగ్‌కు పోలికే లేదన్నారు. 'జగన్ ఎక్కడికి వెళ్లినా మా కొద్దని ప్రజలు ఛీదరించుకుంటున్నారు. ఇప్పటికే జగన్ ఓటమిని అంగీకరించాడు. జగన్ స్వరంలో మార్పే ఇందుకు నిదర్శనం. 2021లో గర్వం, అహంభావంతో ఎవరూ నా వెంట్రుక పీకలేరని జగన్ అన్నాడు. 2022లో ప్లీజ్ నన్ను నమ్మండని అడిగాడు. 2023లో నాకు ఎవరూ లేరు, వి ఎమ్మెల్యే నమ్ముకున్నానని అన్నాడు. 2024లో హ్యాపీగా దిగిపోతా అని అంటున్నాడు. జగన్.. నువ్వు దిగిపోవడం కాదు, దించేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారు. ఈ సీఎం మళ్లీ వస్తే మీ ఆస్తులు మీవి కాదు. మనం మాట్లాడితే మన ప్రాణాలు మనవి కాదు. మన ఆడబిడ్డలకు రక్షణ ఉండదు' అని చంద్రబాబు అన్నారు.

ఉరవకొండలో నిర్వహించిన 'రా.. కదలి రా' బహిరంగ సభకు జనం పోటెత్తారు. పీలేరులోనూ చంద్రబాబు సభకు జనం పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దాదాపు లక్షమంది హాజరయ్యారు. సభా ప్రాంగణానికి సుమారు ఐదారు కిలోమీటర్ల వరకు చాలా వాహనాలు పార్కింగ్ చేయాల్సి వచ్చింది. దీంతో జనం చాలా మంది వేదిక వద్దకు రాలేకపోయారు.

ఎటు చూసినా జనమే..


అన్నమయ్య జిల్లా పీలేరులో జరిగిన రా..కదలిరా బహిరంగ సభకు వచ్చిన జనం

వ్యవస్థలన్నీ నాశనం

'జగన్ ఎక్కడైనా రోడ్లు వేశారా..? వ్యవసాయ శాఖ పనిచేస్తోందా..? విద్యా శాఖ ద్వారా నాణ్యమైన చదువులు చెప్పిస్తున్నారా..? సైకో పాలనలో నష్టపోని వ్యక్తి లేడు. నాశనం కాని వ్యవస్థ లేదు. ఎన్నికలకు ముందు మీకు ముద్దులు పెట్టాడు. చేతులు తలపై పెట్టి షైమరిపించాడు. జగన్ మాయలో పడి ఓట్లు వేసి అధికారం ఇచ్చారు. ఐదేళ్ల పాలనలో తెలుగు జాతి 30 సంవత్సరాలు వెనక్కిపోయింది. ఉల్లి గడ్డకు, ఆలుగడ్డకు తేడా తెలియని సీఎం.. జగన్. వ్యవసాయం అంటే ఆయనకు ఏమీ తెలియదు. నేను టీచర్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇస్తే.. జగన్ వలంటీర్ ఉద్యోగం, ఫిష్ మార్ట్, మద్యం దుకాణంలో ఉద్యోగాలు ఇచ్చాడు. టీడీపీ ప్రభుత్వంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. శ్రీసత్యసాయి జిల్లాలో ఇటీవల ప్రధాని మోదీ ప్రారంభించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్ ఇండైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ నేను తీసుకొచ్చిందే. జగన్ పాలనలో రాష్ట్రం నుంచి పరిశ్రమలను తరిమేశారు. అమర్‌రాజా బ్యాటరీని రాష్ట్రం నుంచి తరిమేశాడు. అనంతలో జాకీ పరిశ్రమ కమీషన్లకు భయపడి వెళ్లిపోయింది. టీడీపీ హయాంలో రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం. ఆ పరిశ్రమలన్నీ ఉండి ఉంటే 30 లక్షల ఉద్యోగాలు వచ్చేవి. అనంతకు కియ పరిశ్రమను తీసుకొచ్చి 12 లక్షల కార్లను ఉత్పత్తి చేసేలా చేశాం. జాబు రావాలంటే బాబు రావాలి. బాబు రావాలంటే అందరూ సైకిల్ ఎక్కాలి. టీడీపీ, జనసేన జెండాను ఎగరేయాలి' అని ప్రజలకు పిలుపునిచ్చారు.

జగన్‌రెడ్డి బతుకే ఫేక్

'జగన్‌రెడ్డి బతుకే ఒక ఫేక్. వివేకా హత్య జరిగితే నారాసుర రక్త చరిత్ర అని చెప్పాడు. గుండెపోటు అన్నాడు. అది గొడ్డలిపోటు కాదా? లేని పింక్ డైమండ్ నా ఇంట్లో ఉందని అన్నాడు. ఇప్పుడేమో వైఎస్ కుటుంబాన్ని నేను చీల్చానని అంటున్నాడు. మీ భార్యాభర్తలు కాపురం చేయకపోతే దానికి కూడా కారణం నేనేనా? నేనంటే వైసీపీ వాళ్లకు భయం మొదలైంది. డైపర్లు వేసుకొని వైసీపీ నాయకులు తిరగాల్సి వస్తుంది. జగన్‌కు పేపర్ లేదని, టీవీ చానల్ లేదని నంగనాచి కబుర్లు చెబుతున్నాడు. జగన్ చెల్లెలు షర్మిల కాంగ్రెస్‌లో చేరినా, కాంగ్రెస్ వాళ్లు ఆమెకు పదవి ఇచ్చినా దానికీ నేనే కారణమంటున్నాడు. జగన్‌రెడ్డిని ఎవరు ప్రశ్నించినా వారంతా నాకు స్టార్ క్యాంపెయినర్లని చెబుతున్నాడు. టీడీపీ, జనసేన పొత్తు పెట్టుకున్నప్పుడే వైసీపీ పతనం ఆరంభమైంది. జగన్ చేతిలో నష్టపోయిన ప్రతి ఒక్కరూ టీడీపీకి స్టార్ క్యాంపెయినర్లే. ఉద్యోగం లేని యువత, గుండెమండిన రైతులు, డ్వాక్రా మహిళలు.. ఇలా నష్టపోయిన ప్రతి ఒక్కరూ నాకు స్టార్ క్యాంపెయినర్లే' అని చంద్రబాబు అన్నారు.

దిమ్మ తిరిగి అమ్మ ఒడికి!

(మొదటి పేజీ తరువాయి)

ఆ మాట అమ్మ విజయలక్ష్మితో చెప్పించాలంటూ శుక్రవారం సవాల్ విసిరిన షర్మిల.. శనివారం మరింత డోస్ పెంచారు. వైఎస్సార్ పార్టీలో అసలు వైఎస్సారే లేరని ఆమె తేల్చిపారేశారు. వై అంటే వైవీ సుబ్బారెడ్డి, ఎస్ అంటే సాయిరెడ్డి, ఆర్ అంటే రామకృష్ణారెడ్డి (సజ్జల) అంటూ సరికొత్త అన్వయం చెప్పారు. దోచుకోవడం, దాచుకోవడమే జగన్ పనిగా మారిందని మొదలెట్టి, వైఎస్ పాలనకు, జగన్ పాలనకు అసలు పోలికే లేదంటూ షర్మిల సూటిగా సుత్తి లేకుండా చేస్తున్న వ్యాఖ్యలు జనంలోకి విస్తృతంగా వెళుతున్నాయి. ప్రజల గుండెలకు సూటిగా తాకుతున్నాయి. ముఖ్యంగా వైఎస్ అభిమానులు ఆమె మాటలను పూర్తిగా విశ్వసిస్తున్నారు. నాలుగేళ్లలో విపక్షాలు అన్నీ కలిపి చేసిన విమర్శలు ఒక ఎత్తైతే.. గత కొద్ది రోజుల్లో షర్మిల చేస్తున్న అటాక్ అంతకు ఎన్నో రెట్లు అధికంగా ప్రభావం చూపుతోంది. దీంతో జగన్‌కు కూసాలు కదిలినట్లైమైండ్ బ్లాక్ అవుతున్న పరిస్థితి. షర్మిలను కట్టడి చేయడానికి, తన సోషల్ మీడియాను, పార్టీ నేతలను ఆయన మొదట ఉసిగొల్పారు. ఇది ఆమెను మరింత రెచ్చగొట్టినట్టయి.. ఇంకా డోస్ పెంచేలా చేసింది. ఇప్పుడిక ఆమె ఇంకెన్ని అంతఃపుర రహస్యాలను బయటపెడతారోనన్న భయం జగన్‌కు అరికాళ్లలోంచి వణుకు పుట్టేలా చేసింది. ఒక్క ముక్కలో చెప్పాలంటే కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాలు జగన్‌కు తన భవిష్యత్తు ఏంటో కళ్ల ముందు సాక్షాత్కరించేలా చేశాయి. ఇక తల్లి విజయలక్ష్మి విషయానికొస్తే.. ఒక దశలో తనను జగన్ ఈసడించుకొని, ఇంటి నుంచి తరిమేసినంత పనిచేయడంతో ఆమె కూతురు షర్మిల వద్దే ఉండిపోయారు. పార్టీ గౌరవాధ్యక్షురాలి పదవి నుంచి ఆమెతోనే రాజీనామా చేయించిన ఘన చరిత్ర జగన్‌ది. చివరికి ఆమెకు పుట్టినరోజు శుభాకాంక్షలు కూడా చెప్పలేని స్థాయిలో జగన్ ద్వేషం పెంచుకున్నారు. అవసరార్థం పొడిపొడిగా మాట్లాడటం మినహా ఆమెను ఈ మధ్య కాలంలో తల్లిగానే చూడలేదని చెప్పవచ్చు. అలాంటి జగన్‌కు షర్మిల దెబ్బతో తల్లి గుర్తొచ్చింది. ఇన్నాళ్లు 'రాక్షసులు, మారీచులతో పోరాడుతున్న మీ బిడ్డను ఆశీర్వదించండంటూ' ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ వచ్చిన జగన్‌కు.. షర్మిల దెబ్బతో తాను మళ్లీ విజయమ్మ బిడ్డను అన్న విషయం గుర్తొచ్చింది. అమ్మా.. నువ్వే శరణం అంటూ విజయలక్ష్మికి ఫోన్ చేసి ప్రాధేయపడినట్టు విశ్వసనీయ సమాచారం. "పరిస్థితి ఏమీ బాలేదు. ప్రజా వ్యతిరేకత అనే అగ్నికి చెల్లి షర్మిల ఆజ్యం పోస్తోంది. నేను ఓడిపోతే జైలుకెళ్లాల్సి వస్తుంది. కేసుల్లో కచ్చితంగా శిక్ష పడే అవకాశం ఉంది. అదే జరిగితే మళ్లీ ఎప్పటికి బయటికొస్తానో తెలియదు. నా జీవితం జైలుకే అంకితమైపోతుంది. నువ్వు రావాల్సిందే.. నన్ను ఆదుకోవాల్సిందే" అని ఆమెను బతిమలాడుకున్నట్లు తెలిసింది. ఎప్పుడూ పెడసరంగా మాట్లాడే జగన్.. ఇలా దీన వచనాలు వల్లించడం, ఆయన స్వరంలో వినిపించిన ఆందోళనతో ఆమెకు పరిస్థితి అర్థమైంది. మరీ ముఖ్యంగా జైలు జీవితం గురించి చెప్పిన మాటలతో ఆమె మనసు కరిగింది. ఇన్నాళ్లూ ఎన్ని వేధింపులకు గురిచేసినా కొడుకుని వదులుకోలేం గదా అన్న ఉద్దేశంతో జగన్‌కు సాయం చేసేందుకు ఆమె ముందుకొచ్చినట్టు సమాచారం. జగన్ కోరిన విధంగా ఆయనకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించేందుకు ఆమె అంగీకరించినట్లు తెలిసింది.

షర్మిల వారించినా..

జగన్‌తో విభేదాల నేపథ్యంలో ఇన్నాళ్లూ విజయలక్ష్మి.. తన బిడ్డ షర్మిల వైపే ఉన్నారు. తెలంగాణలో షర్మిల పార్టీ పెట్టినప్పుడు ఆమె వెన్నంటే ఉన్నారు. కొన్ని సందర్భాల్లో షర్మిలకు మద్దతుగా రోడ్డెక్కారు కూడా. కానీ ఇప్పుడు కొడుకు శోకాలు చూసి ఆమె కరిగిపోవడాన్ని షర్మిల తీవ్రంగా వ్యతిరేకించినట్టు సమాచారం. తనకు పూర్తిగా అన్యాయం చేసి, ఎన్నో అవమానాల పాల్జేసిన జగన్ నైజాన్ని తాను ప్రజల ముందుంచుతుంటే.. తల్లి జగన్‌కు మద్దతుగా రాష్ట్రంలో పర్యటించి, ప్రచారం చేయడం సరికాదని ఆమె అభ్యంతరం చెప్పినట్లు తెలిసింది. షర్మిల కాదంటున్నా.. కొడుకు దీన స్థితి దృష్ట్యా తాను అండగా నిలువక తప్పదని భావిస్తున్నానని విజయలక్ష్మి తన సన్నిహితుల వద్ద పేర్కొన్నట్టు సమాచారం. మొత్తంమీద రానున్న రోజుల్లో జగన్‌కు వ్యతిరేకంగా చెల్లి, అనుకూలంగా తల్లి రాష్ట్రంలో పర్యటించబోతున్నారన్న మాట! తన కుమారుడికి మరో అవకాశం ఇవ్వాలని, పదవీ భిక్ష పెట్టాలంటూ గతంలో మాదిరి బైబిల్ చేతబట్టుకొని విజయలక్ష్మి మరోసారి ప్రజల్లోకి రాబోతున్నారని స్పష్టమవుతోంది!

నాకు రాజకీయ జీవితం ఇచ్చింది చంద్రబాబే

» ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవంలో మంత్రి సీతక్క

మొయినాబాద్ రూరల్, జనవరి 27: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడే తనకు రాజకీయ జీవితాన్ని ఇచ్చారని రాష్ట్ర మహిళ, శిశు, సంక్షేమ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా గండిపేటలోని ఎన్టీఆర్ విద్యా సంస్థల వార్షికోత్సవానికి శనివారం ఆమె ముఖ్య అతిథిగా హాజరై ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించారు. నిరుపేదలు, మహిళలు, విద్యార్థుల కోసం ఎన్టీఆర్ ట్రస్ట్ చేస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. తమ ప్రాంతానికి చెందిన ఎందరో నిరుపేద పిల్లలకు చంద్రబాబు సహకారంతో ఎన్టీఆర్ పాఠశాలలో ఉచిత విద్య అందించానని తెలిపారు. నక్సలైట్‌గా కోర్టులో నిలబడిన తాను నల్లకోటు ధరించి న్యాయస్థానంలో పేదల పక్షాన వాదించే న్యాయవాదిగా ఎదిగానని ఆ సమయంలోనే చంద్రబాబు తనను రాజకీయాల్లోకి ఆహ్వానించారని గుర్తు చేసుకున్నారు. ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చైర్మన్ నారా భువనేశ్వరి మాట్లాడుతూ మహిళలను శక్తిమంతులుగా తయారు చేయడమే తమ సంస్థ లక్ష్యమన్నారు. నిరుపేదలకు విద్య అందించాలనే సంకల్పంతో ఎన్టీఆర్ పాఠశాల స్థాపించామని, తమ విద్యాసంస్థలో చదువుకున్న వారు నేడు ఉన్నతస్థాయిలో ఉన్నారని వెల్లడించారు. ఇక, వివిధ అంశాల్లో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సీతక్క, భువనేశ్వరి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ విద్యా సంస్థల సీఈవో విశ్రాంత ఐపీఎస్ రాజేంద్రకుమార్, హెరిటేజ్ ఫుడ్స్ చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ సాంబశివ రావు, తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ దామోదర్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధురాలు

నంబూరి పరిపూర్ణ కన్నుమూత

హైదరాబాద్ సిటీ, జనవరి27(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధురాలు, తొలితరం వామపక్ష విద్యార్థి సంఘం నాయకురాలు, రచయిత్రి నంబూరి పరిపూర్ణ(92) ఇకలేరు. కొంతకాలంగా బెంగుళూరులోని తన పెద్దకుమారుడి వద్ద ఉంటున్న ఆమె శుక్రవారం రాత్రి తుదిశ్వాస విడిచారు. పరిపూర్ణ జీవిత సహచరుడు దివంగత భారత కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు దాసరి నాగభూషణరావు. వీరి సంతానం శిరీష, అమరేంద్ర, శైలేంద్ర. కుమార్తె దాసరి శిరీష రెండేళ్ల కిందట కేన్సర్‌తో మరణించారు. తన సోదరులు శ్రీనివాసరావు, దూర్వాస మహర్షి స్ఫూర్తితో పరిపూర్ణ ఏడవ ఏట జాతీయోద్యమంలో పాల్గొన్నారు. అనేక స్వాతంత్ర్య పోరాట సభలు, సమావేశాలలో దేశభక్తిగీతాలు ఆలపించారు. బ్రిటీష పాలకులకు వ్యతిరేకంగా కృష్ణాజిల్లా కేంద్రంగా సాగిన 'ఆకలి యాత్రలు' లాంటి నిరసన కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించారు.

కరోల్‌కు 8.33 కోట్ల డాలర్లు చెల్లించండి

» డొనాల్డ్ ట్రంప్‌ను ఆదేశించిన అమెరికా కోర్టు

న్యూయార్క్, జనవరి 27: అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు కోర్టులో మరో ఎదురుదెబ్బ తగిలింది. లైంగిక వేధింపుల కేసులో రచయిత్రి ఇ.జీన్ కరోల్‌కు ఆయన 8.33 కోట్ల డాలర్లు (దాదాపు రూ.690 కోట్లు) నష్టపరిహారం కింద చెల్లించాలని మాన్‌హట్టన్ కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. కొన్నేళ్ల క్రితం తనపై అత్యాచారం చేసిన ట్రంప్... ఇప్పుడు ఒక జర్నలిస్టుగా తన విశ్వసనీయతను దెబ్బతీసే వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ కరోల్ కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో ఐదు రోజుల విచారణ అనంతరం మాన్‌హట్టన్ ఫెడరల్ కోర్టు న్యాయమూర్తులు శుక్రవారం మూడు గంటల్లోనే తీర్పును వెలువరించారు. కరోల్‌కు నష్టపరిహారం కింద 1.83 కోట్ల డాలర్లు చెల్లించాలని, అలాగే భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలతో ఆమెను కించపరచకుండా ఉండేందుకు మరో 6.5 కోట్ల డాలర్లు ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. అయితే ఈ తీర్పుపై అప్పీలుకు వెళ్తామని ట్రంప్ ప్రకటించారు.

భారతీయులున్న బ్రిటన్ నౌకపై హౌతీల దాడి

న్యూఢిల్లీ, జనవరి 27: ఎర్ర సముద్రంలో హౌతీలు మరోమారు రెచ్చిపోయారు. గల్ఫ్ ఆఫ్ ఎడెన్‌లో మార్షల్ ఐలాండ్స్ జెండాతో చమురుతో వస్తున్న బ్రిటన్‌కు చెందిన కమర్షియల్ నౌకపై శుక్రవారం రాత్రి క్షిపణి దాడులు చేశారు. దీంతోపాటు.. ఎర్ర సముద్రంలో మోహరించిన అమెరికా యుద్ధనౌక- యూఎస్ఎస్ కార్నీపైనా దాడి చేశారు. బ్రిటన్ నౌక నుంచి ఎమర్జెన్సీ సమాచారం అందుకున్న భారత నౌకాదళానికి చెందిన ఐఎన్ఎస్-విశాఖపట్నం సిబ్బంది వెంటనే రంగంలోకి దిగారు. క్షిపణిదాడితో బ్రిటన్ నౌకకు మంటలు అంటుకున్నాయి. ఐఎన్ఎస్-విశాఖపట్నం సిబ్బంది వాటిని ఆర్పినట్లు భారత నౌకాదళం ఓ ప్రకటనలో తెలిపింది. బ్రిటన్ నౌకలో 22 మంది భారతీయులు, ఒక బంగ్లాదేశీ ఉన్నట్లు వివరించింది. వారంతా క్షేమమేనని చెప్పింది.



'ఇండియా'లో ఆరని మంటలు

యూపీలో 11 సీట్లే ఇస్తాం: అఖిలేశ్.. సీట్ల కోసమే కాంగ్రెస్ వల: డీఎంకే.. ముదిరిన అంతర్గత కుమ్ములాట

ఐక్యతకు కృషి చేస్తున్నాం: ఖర్గే

బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి), న్యూఢిల్లీ: 'ఇండియా' కూటమి పార్టీల ఐక్యత కోసం కృషి చేస్తానని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొంటున్నా క్షేత్రస్థాయిలో మాత్రం కూటమి పార్టీలు కాంగ్రెస్‌పై నిప్పులు చెరుగుతున్నాయి. ఇప్పటికే పంజాబ్‌లోని అధికార ఆప్, పశ్చిమ బెంగాల్‌లోని అధికార టీఎంసీలు పార్లమెంటు ఎన్నికల్లో ఒంటరిగానే బరిలో దిగుతామని స్పష్టం చేశాయి. ఇక ఇప్పుడు మరిన్ని పార్టీలు వ్యతిరేక గళం వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో సీట్లకోసమే తమ వెంట పడుతోందని తమిళనాడు అధికార పార్టీ డీఎంకే విమర్శలు గుప్పించగా, కేవలం 11 సీట్లకు మించి ఇచ్చేది లేదని యూపీ ప్రతిపక్ష పార్టీ సమాజ్‌వాదీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ తేల్చి చెప్పారు. దీనిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది.

11తో మొదలు పెడదాం: ఎస్పీ

"మా సహృదయ కూటమికి నేతృత్వం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీకి 11 సీట్లు ఇస్తున్నాం. ఇక్కడ నుంచి యుద్ధం మొదలు పెడదాం. ఇది విజయాన్ని అందించే ఫార్ములా. ఇండియా కూటమి చరిత్రను మారుస్తుంది" అని సమాజ్ వాదీ పార్టీ చీఫ్, మాజీ సీఎం అఖిలేశ్ యాదవ్ అన్నారు. ఆ 11 స్థానాలు కూడా చాలా బలమైనవేనని చెప్పారు. అయితే.. దీనిపై కాంగ్రెస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. అయితే, ఇంతలోనే ఎస్పీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన వచ్చింది. కాంగ్రెస్ పార్టీ గెలుపు గుర్రాలను చూపిస్తే మరిన్ని సీట్లు ఇచ్చేందుకు అఖిలేశ్ సిద్ధమేనని పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్ పార్టీ కూడా ఇంకో ప్రకటన విడుదల చేసింది. పార్టీ సీనియర్ నేత అశోక్ గెహ్లోత్.. ఎస్పీ నేత అఖిలేశ్‌తో సీట్ల విషయంపై చర్చలు జరుపుతున్నారని తెలిపింది. దీనిపై స్పష్టత వచ్చిన తర్వాత వెల్లడిస్తామని వివరించింది.



ఇదిలావుంటే, శనివారం ఓ మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీపై అఖిలేశ్ విమర్శలు గుప్పించారు. కూటమి పార్టీలతో ఏ విషయం కూడా చర్చించడం లేదని.. అసలు చర్చించే ఆలోచన కూడా కాంగ్రెస్‌కు ఉన్నట్టు కనిపించడం లేదని అన్నారు.

కాంగ్రెస్‌కు బలం లేదు: డీఎంకే

ఇండియా కూటమి పార్టీ, తమిళనాడు అధికార పార్టీ డీఎంకే కూడా మిత్రపక్షం కాంగ్రెస్‌పై విమర్శలు గుప్పించింది. సుదీర్ఘ చరిత్ర, అతి పెద్ద కేడర్ ఉన్న పార్టీనే అయినప్పటికీ.. ఇప్పుడు ఆ పార్టీ సత్తువ కోల్పోయిందని డీఎంకే నేత, మంత్రి రాజా కన్నప్పన్ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సీట్ల కోసమే పార్టీ తమ వెంట పడుతోందని దుయ్యబట్టారు. "కాంగ్రెస్‌ను గమనిస్తే సీట్ల కోసమే వారు పార్టీని నడుపుతున్నట్టుంది. కానీ, దానివల్ల ప్రయోజనమేంటి? కష్టపడి పనిచేయాలని, ప్రజలకు మంచి చేయాలని భావించి వారు పార్టీని నడపడం లేదు. ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలోనే వారు వస్తారు. ఈ తరహా ఆలోచన ప్రజల మధ్య పనిచేయదు" అని రాజా నిప్పులు చెరిగారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోందని, కానీ, తాము ఆ పార్టీని తరిమికొడతామని వ్యాఖ్యానించారు. ఇదిలావుంటే, పార్లమెంటు ఎన్నికల్లో సీట్ల కేటాయింపుపై ఆదివారం డీఎంకే, కాంగ్రెస్ భేటీ అవుతున్నాయి. ఈ నేపథ్యంలో రాజా వ్యాఖ్యలు కలకలం రేపుతున్నాయి.

కాంగ్రెస్ బట్టలూడదీశారు: బీజేపీ

ఇండియా కూటమి పార్టీల్లో కాంగ్రెస్‌పై వెల్లువెత్తుతున్న వ్యతిరేకత నేపథ్యంలో బీజేపీ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. "కటమి పార్టీలన్నీ సమష్టిగా కాంగ్రెస్ బట్టలూడదీశాయి" అని తమిళనాడు బీజేపీ చీఫ్ కె. అన్నామలై ఎద్దేవా చేశారు. డీఎంకే మంత్రి రాజా చేసిన వ్యాఖ్యల వీడియోను ఎక్స్‌లో పోస్టు చేసిన ఆయన.. కూటమి పార్టీలు వాస్తవాలు చెబుతున్నాయన్నారు. కాంగ్రెస్‌లో నేతలే తప్ప కేడర్ లేదని విమర్శించారు.

ఖర్గే ఏమన్నారంటే..

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే శనివారం కలబురగి విమానాశ్రయంలో మీడియాతో మాట్లాడారు. ఇండియా కూటమి ఐక్యత కోసం కలసి పనిచేద్దామని పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీతోపాటు కూటమిలోని పార్టీ నేతలకు లేఖలు రాశానని తెలిపారు. బిహార్ సీఎం నితీశ్‌కుమార్ తన పదవికి రాజీనామా చేసే విషయం తనకు తెలియదని, నితీశ్ గవర్నర్‌ను కలిశారో లేదో కూడా తెలియదని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఐక్యత ముఖ్యమని తెలిపారు. కాగా, బిహార్‌లో చోటు చేసుకుంటున్న రాజకీయాలపై నితీశ్‌కుమార్‌తో మాట్లాడేందుకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఫోన్‌లో పలుమార్లు ప్రయత్నించినా ఆయన బిజీగా ఉండడంతో సాధ్యం కాలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ 'ఎక్స్'లో వెల్లడించారు.

ఉన్నత విద్యా సంస్థల

గ్రేడింగ్‌కు స్వస్తి : న్యాక్

న్యూఢిల్లీ, జనవరి 27 : దేశంలోని ఉన్నత విద్యా సంస్థలకు అక్రెడిటేషన్ విధానం ద్వారా గ్రేడ్లు కేటాయించే పద్ధతికి న్యాక్(నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) స్వస్తి పలికింది. ఇకపై, అక్రెడిటెడ్, నాన్ అక్రెడిటెడ్‌గా ఆయా విద్యాసంస్థలను వర్గీకరించాలని నిర్ణయించింది. ఈ మేరకు శనివారం నిర్వహించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకుంది. అంతేకాక, అక్రెడిటెడ్ విద్యా సంస్థలను మరింత ప్రోత్సహించేందుకు ఇకపై 1 నుంచి 5 వరకు లెవెల్స్ కేటాయిస్తామని పేర్కొంది. ఈ రెండు విధానాలను దశల వారీగా అమలు చేయనున్నారు. బైనరీ అక్రెడిటేషన్(అక్రెడిటెడ్, నాన్ అక్రెడిటెడ్‌గా విభజన) విధానాన్ని నాలుగు నెలల్లోగా, మెచ్యూరిటీ బేస్డ్ గ్రేడెడ్ అక్రెడిటేషన్(లెవెల్ 1-5) విధానాన్ని డిసెంబరు నాటికి అమలు చేస్తామని న్యాక్ వర్గాలు తెలిపాయి.

న్యాయ్ యాత్రకు సాయం చేయండి

న్యూఢిల్లీ, జనవరి 27: దేశం కోసం దానం చేయండి అంటూ ఇప్పటికే విరాళాల సేకరణను ప్రారంభించిన కాంగ్రెస్ పార్టీ.. రాహుల్‌గాంధీ జోడో న్యాయ్ యాత్రకూ ఇలాంటి కార్యక్రమాన్నే చేపట్టింది. న్యాయ్ యాత్రకు సాయం చేయండి (డొనేట్ ఫర్ న్యాయ్) పేరిట తలపెట్టిన విరాళాల సేకరణను శనివారం పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్, కోశాధికారి అజయ్ మాకెన్ ప్రారంభించారు. దాతలకు రాహుల్ సంతకంతో కూడిన లేఖ, ధ్రువపత్రం ఇవ్వనున్నారు. ఇక రూ.670 అంతకంటే ఎక్కువగా ఇచ్చినవారికి టీ షర్ట్‌ను అందిస్తామని, రూ.67 వేల కంటే ఎక్కువ మొత్తం ఇచ్చినవారికి టీ షర్ట్, బ్యాగ్, బ్యాండ్, బ్యాడ్జ్‌లతో కూడిన 'న్యాయ్ కిట్'ను ఇవ్వనున్నట్లు చెప్పారు. కేవలం రెండు గంటల్లోనే రూ.2 కోట్లు వచ్చినట్లు వివరించారు. విరాళాల సేకరణ ముఖ్య ఉద్దేశం కార్యకర్తల్లో ప్రేరణ కలిగించడమేనని.. డబ్బు కోసం కాదని తెలిపారు. డిసెంబరు 18న ఇచ్చిన 'దేశం కోసం దానం' పిలుపుతో రూ.20 కోట్లు వసూలైనట్లు పేర్కొన్నారు. బీజేపీ, ఆప్ ఇలాంటి పిలుపునిస్తే వాటికి రూ.కోటి కంటే ఎక్కువ రాలేదని మాకెన్ అన్నారు.

సయోధ్య కుదరని పని: మమత

బెంగళూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి), న్యూఢిల్లీ: టీఎంసీ అధినేత్రి, బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కాంగ్రెస్ పార్టీతో సయోధ్య చేసుకునే పనిలేదని తేల్చి చెప్పారు. ఇది జరగని పనిగా ఆమె పేర్కొన్నారు. దీంతో పార్లమెంటు ఎన్నికల వేళ ఆమె కాంగ్రెస్‌కు తలుపులు మూసేసినట్టయింది. "భారత్ జోడో న్యాయయాత్ర మా రాష్ట్రంలోకి అడుగు పెట్టింది. కనీసం మాట మాత్రంగా కూడా మాకు చెప్పలేదు. నాకు రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు సోనియా, ప్రియాంక ఫోన్ చేసి పరామర్శించారు. కానీ, యాత్ర గురించి మాట మాత్రం నాకు చెప్పలేదు" అని మమత వ్యాఖ్యానించారు. శనివారం రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం తర్వాత ఆమె మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోకూడదని అనుకున్నాం. దీనిపై పునరాలోచించే అవకాశం లేదు. ఆ పార్టీతో సయోధ్యకుదరని పని" అని మమత అన్నారు. "ఎన్నికల్లో ఒంటరిగానే పోటీ చేయాలని నిర్ణయించుకున్నాక కూడా ఇండియా కూటమి పార్టీలు మాతో మాట్లాడలేదు. వాళ్లని విశ్రాంతి తీసుకోమనండి. ఏం చేయాలో ఎన్నికలయ్యాక చూద్దాం" అని వ్యాఖ్యానించారు. కాగా, బెంగాల్‌లో భారత్ జోడో న్యాయయాత్రలో పాల్గొనే వారికి తగిన భద్రత కల్పించాలని ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే మమతకు లేఖ రాశారు.

నేడు రాజీనామా.. ప్రమాణం!

బీజేపీ మద్దతుతో బిహార్ సీఎంగా 7వ సారి నితీశ్

న్యూఢిల్లీ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జేడీయూ అధ్యక్షుడు నితీశ్ కుమార్ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు బీజేపీ మద్దతుతో మరోసారి బిహార్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేయనున్నట్లు సమాచారం. ఈ కార్యక్రమానికి కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతోపాటు బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా హాజరు కావచ్చని తెలుస్తోంది. 2022 ఆగస్టులో బీజేపీని వీడి ఆర్జేడీతో చేతులు కలిపి సీఎం పగ్గాలు చేపట్టిన నితీశ్ కుమార్ ఇప్పుడు.. ఆర్జేడీకి మొండిచేయి చూపి మళ్లీ బీజేపీతో కలువనున్నారు. ఈ మేరకు సీఎం పదవికి ఆదివారం ఉదయం ఆయన రాజీనామా చేసే అవకాశాలు ఉన్నాయని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. బిహార్‌లో జేడీయూను చీల్చి తనను పదవి నుంచి దించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారంతోనే ఆయన మళ్లీ బీజేపీ చెంతకు చేరుతున్నారని ఆ వర్గాలు పేర్కొన్నాయి. నితీశ్ నేతృత్వంలో జేడీయూ ఎమ్మెల్యేలు పట్నాలో సమావేశమయ్యారు. మరోవైపు, ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఆయన నివాసంలో బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా, లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్) అధ్యక్షుడు చిరాగ్ పాశ్వాన్ భేటీ అయ్యారు. నితీశ్ సారథ్యంలోని జేడీయూకి బీజేపీతోపాటు మాజీ సీఎం జితన్‌రాం మాంఝీ నేతృత్వంలోని హిందుస్థానీ అవామీ మోర్చా కూడా మద్దతు ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. బీజేపీకి రెండు డిప్యూటీ సీఎం పదవులు, అసెంబ్లీ స్పీకర్ పదవితో పాటు మంత్రివర్గంలో ప్రాధాన్యం ఇచ్చేలా ఆ పార్టీతో జేడీయూకు ఒప్పందం కుదిరినట్లు సమాచారం. ఆదివారం ఉదయం బీజేపీ, జేడీయూ విడివిడిగా ఎమ్మెల్యేల సమావేశాన్ని ఏర్పాటు చేశాయి. ఎమ్మెల్యేలతో భేటీ అనంతరం నితీశ్ సీఎం పదవికి రాజీనామా చేస్తారని, ఆ తర్వాత తనకు మద్దతిస్తున్న ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు సమర్పించి ముఖ్యమంత్రిగా ప్రమాణం చేస్తారని తెలుస్తోంది.

నాకు సమాచారమే లేదు: ఖర్గే

నితీశ్ ఇండియా కూటమిని వదిలివెళ్తారన్న వార్తల నేపథ్యంలో ఫోన్‌లో మాట్లాడటానికి పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆయన అందుబాటులోకి రాలేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గే వెల్లడించారు. ఇండియా కూటమిలో అత్యంత ముఖ్యమైన పార్టీల్లో ఒకటైన జేడీయూ.. కూటమిని వదిలి వెళ్తుందన్న సమాచారం తనకు ఇంతవరకూ లేదని చెప్పారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని రక్షించటానికి కూటమి బాగా పని చేయాల్సిన అవసరం ఉందని, దీనిని అర్థం చేసుకున్న వారెవరూ అదరబాదరగా నిర్ణయాలు తీసుకోరని ఆశిస్తున్నట్లు తెలిపారు. కాగా, నితీశ్ వైఖరి లౌకిక ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచేలా ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కే నారాయణ విమర్శించారు.

కేరళ గవర్నర్‌కు జడ్ ప్లస్ భద్రత



తిరువనంతపురం, జనవరి 27: కేరళ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్‌కు కేంద్ర ప్రభుత్వం జడ్ ప్లస్ భద్రత కల్పించింది. అధికార పార్టీ సీపీఎం అనుబంధ విద్యార్థి సంఘం ఎస్ఎఫ్ఐ నిరసనలకు వ్యతిరేకంగా గవర్నర్ రోడ్డుపై రెండు గంటలు బైఠాయించిన నేపథ్యంలో కేంద్ర హోంశాఖ ఈ నిర్ణయం తీసుకుంది. అంతకుముందు.. శనివారం ఉదయం ఒక కార్యక్రమంలో పాల్గొనేందుకు కొల్లాం జిల్లాలో ప్రయాణిస్తున్న గవర్నర్.. రోడ్డుపక్కన ఎస్ఎఫ్ఐ కార్యకర్తలు నల్ల జెండాలతో నిరసన తెలపడం గమనించి కారు ఆపాలని సిబ్బందిని ఆదేశించారు. కారు దిగి నేరుగా ఆందోళనకారుల వద్దకు నడుచుకుంటూ వెళ్లిన గవర్నర్.. రాష్ట్రంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను సీఎం విజయన్ ప్రోత్సహిస్తున్నారని, నిరసనకారులను అరెస్టు చేయడం లేదని నిందించారు. అధికారుల నుంచి స్పందన లేదంటూ నిరసనగా గవర్నర్ అక్కడే రెండు గంటలసేపు బైఠాయించారు. అయితే, తానేమీ నిరసన తెలపలేదని, ఎస్ఎఫ్ఐ నేతలపై చర్యలకు డిమాండ్ చేశానని, ఎఫ్ఐఆర్ కాపీని పోలీసులు తనకు అందించే వరకు అక్కడ వేచి ఉన్నానని గవర్నర్ తెలిపారు.

ఒక్కో ఎమ్మెల్యేకు 25 కోట్లు



» మా ఎమ్మెల్యేల్లో ఏడుగురికి బీజేపీ వల

» మద్యం కుంభకోణంలో నన్ను అరెస్టు చేసి ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చే కుట్ర: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, జనవరి 27 : ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చేందుకు బీజేపీ భారీ కుట్రలు చేస్తోందని ఆ రాష్ట్ర సీఎం, ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఒక్కొక్కరికి రూ.25 కోట్లు ఆశ చూపి ఆప్‌కు చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ యత్నించిందని తెలిపారు. అంతేకాక, రాష్ట్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకే మద్యం కుంభకోణం కేసులో తనని అరెస్టు చేయాలని చూస్తున్నారని చెప్పారు. అయితే, కేజ్రీవాల్ చేసిన ఆరోపణలను బీజేపీ కొట్టిపారేసింది. తమపై నిందలు వేయడం కాదని ఎమ్మెల్యే కొనుగోలు యత్నానికి సంబంధించిన ఆధారాలు ఉంటే బయటపెట్టాలని సవాలు విసిరింది. ఇందుకు స్పందించిన ఆప్ నేతలు తమ వద్ద ఉన్న ఆధారాలను, కాల్ రికార్డింగులను త్వరలోనే బయటపెడతామని కౌంటరిచ్చారు. ఎమ్మెల్యేల కొనుగోలు అంశంపై కేజ్రీవాల్ ఎక్స్(ట్విటర్)లో శనివారం ఓ పోస్టు పెట్టారు. తమ పార్టీకి చెందిన ఏడుగురు ఎమ్మెల్యేలను బీజేపీ వ్యక్తులు ఫోన్ ద్వారా సంప్రదించారని ఆ పోస్టులో పేర్కొన్నారు. కేజ్రీవాల్‌ను త్వరలోనే అరెస్టు చేస్తామని, ఆపై ఢిల్లీ ప్రభుత్వాన్ని కూల్చేస్తామని సదరు వ్యక్తులు తమ ఎమ్మెల్యేలకు చెప్పారని అన్నారు. ఇప్పటికే 21 మంది ఎమ్మెల్యేలతో సంప్రదింపులు జరిపామని, మిగిలిన వారితోనూ మాట్లాడతామని ఆ తర్వాత ఆప్ ప్రభుత్వం లేకుండా చేస్తామన్నారని వివరించారు. తమతో కలిస్తే రూ.25 కోట్ల నగదు, బీజేపీ టికెట్ మీద పోటీ చేసే అవకాశం ఇస్తామని ప్రతిపాదన చేశారని పేర్కొన్నారు. అయితే, 21 మంది ఎమ్మెల్యేలతో ఇప్పటికే మాట్లాడామని ఆ వ్యక్తులు చెప్పిన మాటల్లో నిజం లేదని కేజ్రీవాల్ తెలిపారు. తమకున్న సమాచారం మేరకు ఏడుగురు ఎమ్మెల్యేలకే ఇలాంటి కాల్స్ వచ్చాయని, వారంతా బీజేపీ ప్రతిపాదనలను తిరస్కరించారని కేజ్రీవాల్ స్పష్టం చేశారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు తొమ్మిదేళ్లుగా బీజేపీ ఎన్నో కుట్రలు చేసి విఫలమైందన్నారు.

ఆధారాలు బయటపెట్టు : ఢిల్లీ బీజేపీ చీఫ్

కేజ్రీవాల్ చేసిన ఆరోపణలు ఆయన దివాళాకోరు రాజకీయాన్ని, ఆప్‌లో అసహనాన్ని ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు వీరేంద్ర సచ్‌దేవ ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యేల కొనుగోలు యత్నాలంటూ ప్రజలకు అబద్ధాలు చెప్పడం కాదని చేతనైతే తగిన ఆధారాలు బయపెట్టాలని సవాల్ విసిరారు. బీజేపీని అప్రతిష్ఠపాలు చేసేందుకు కేజ్రీవాల్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఢిల్లీ అసెంబ్లీ ప్రతిపక్ష నేత రాంవీర్ సింగ్ బిధూరీ అన్నారు.

అక్రమాల తోటలో అవినీతి గులాబీ

(మొదటి పేజీ తరువాయి)



సెటిల్మెంట్లు వేస్తారు. ఇక్కడి బియ్యం, మట్టి, ఇసుక.. ఇలా అన్నీ పక్క రాష్ట్రానికి తరలించేసి రూ.కోట్లు సంపాదించుకుంటున్నారని అంటున్నారు. అన్నిరకాల అవినీతి, అక్రమాల్లో ఈ ఎమ్మెల్యే కమ్ మంత్రికి కుడి, ఎడమ భుజాలుగా ఉన్న ఇద్దరు సోదరుల పాత్ర కీలకమని చెబుతారు.

మన్ను నుంచి మణులు

నియోజకవర్గం తమిళనాడుకు సరిహద్దున ఉండడంతో, కొండ ప్రాంతంలోని మట్టి వైసీపీ నాయకులకు బంగారంలా మారింది. తాత్కాలిక లైసెన్సుల పేరుతో నెలరోజులకు మాత్రమే అనుమతులు, పర్మిట్లు పొంది నెలల తరబడి మట్టిని తరలించి రూ.కోట్లు దండుకున్నారు. ఈ మహిళా మంత్రికి సైతం వాటాలు చేరుతున్నాయని ఓ వర్గం నాయకులు చెబుతుండడం గమనార్హం. నియోజకవర్గంలోని ఓ మండలంలో ఏకంగా 300 ఎకరాల ప్రభుత్వ భూములను తన అనుచరుల పేర్లతో ఆన్‌లైన్‌లో నమోదు చేయించుకున్నారు. మూడేళ్ల కిందట 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు రాసి ఈ విషయాన్ని బహిర్గతం చేసింది. అప్పట్లో విచారించిన జిల్లా అధికారులు ఆ భూముల్ని వెనక్కి తీసుకుని నలుగురు కింద స్థాయి రెవెన్యూ ఉద్యోగులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకొన్నారు. తప్పు చేశారని తేలినా 'ఆమె' అండతో తహసీల్దార్ చాకచక్యంగా తప్పించుకున్నారు. నియోజకవర్గ కేంద్రంలోని ఓ నదిలో ఇసుక అక్రమ రవాణాతో భారీగా దండుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న విషయాన్ని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మంత్రి చక్రం తిప్పడంతో ఫిర్యాదులు బుట్టదాఖలయ్యాయి. తమిళనాడులో ఇసుకకు కొరత ఉండడంతో ఆంధ్రా ఇసుకకు డిమాండ్ పెరిగింది. దీంతో మట్టితో పాటు ఇసుకను కూడా అక్కడకు తరలించేసి అందినకాడికి దండుకున్నారు.

బియ్యం కర్ణాటకకు!

ఇసుకను తమిళనాడుకు తరలించినట్టే రేషన్ దుకాణాల్లో లబ్ధిదారులకు అందించే బియ్యాన్ని మంత్రి అనుచరులు కొనుగోలు చేసి కర్ణాటకకు తరలించి అక్కడ పాలిష్ చేసేవారు. అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు స్మగ్లింగ్ చేసేవారు. ఈ అక్రమ దందా నుంచి ఆమెకు నెల మామూళ్లు ముట్టేవి. ఏడాది కిందట విజిలెన్స్ అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేయడంతో, ఎన్నికలకు ముందు తనకు చెడ్డ పేరు వస్తుందని భావించి ప్రస్తుతానికి ఈ తతంగం నుంచి తప్పుకొన్నారట.

అక్రమాల పరాక్రమం

- కంకర క్రషర్ల వద్ద అనుమతులు సక్రమంగా లేవంటూ, అధికారులతో దాడులు చేయించి భారీ మొత్తంలో వసూళ్లు చేస్తున్నట్లు మహిళా మంత్రిపై విమర్శలు ఉన్నాయి. వారికి కేటాయించిన ప్రాంతంలో కాకుండా వేరే ప్రాంతంలో క్రషర్లను నిర్వహిస్తున్నారనే సాకులు చూపిస్తూ తరచూ దాడులు చేయించేవారు. దీంతో చాలా మంది యజమానులు క్రషర్లను మూసేసే పరిస్థితి వచ్చింది.
- నియోజకవర్గంలో ఎక్కడ వెంచర్లు వేసినా ఎమ్మెల్యేకు నాలుగు ప్లాట్లు, అది చాలదన్నట్టు సొమ్ములు ముట్టజెప్పాల్సిందే. తేడా వస్తే సోదరులు రంగంలోకి తడాఖా చూపిస్తారని భయపడి రియల్ వ్యాపారులు ముడుపులు ముట్టజెప్పేవారు.
- నియోజకవర్గంలోని రెండు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి నెల మామూళ్లు రూ.5 లక్షల చొప్పున అధికారులు సమర్పించుకోవాల్సిందే. దీనికి భయపడి గతంలో ఇద్దరు సబ్‌రిజిస్ట్రార్లు బదిలీ చేయించుకుని మరీ వెళ్లిపోయారు. దీంతో పాటు తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్, మున్సిపల్ కార్యాలయాల నుంచి కూడా మంత్రి పేరిట ఉన్న ట్రస్టుకు ముడుపులు ముట్టజెబుతున్నారు.
- ఈ నియోజకవర్గంలో పరిశ్రమల స్థాపన కోసం ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున భూముల్ని సేకరించారు. ఈ క్రమంలో కొందరు వైసీపీ నాయకులు నకిలీ పట్టాలు సృష్టించి అక్రమంగా పరిహారం పొందారు. ఇందులో మంత్రికి కూడా వాటాలు అందినట్లు పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది.


ఖతర్నాక్ కలెక్షన్ కింగ్స్

- మహిళా మంత్రికి ఇద్దరు సోదరులున్నారు. వీరిని స్థానికంగా ఖతర్నాక్ కలెక్షన్ కింగ్స్ అని పిలుచుకుంటారు. అక్రమాలకు సంబంధించిన సొమ్ము వసూళ్లలో వీరిదే కీలకపాత్ర. మంత్రి నేరుగా జోక్యం చేసుకోరు. ఓ మండలంలో బినామీ పేర్లతో గ్రావెల్ క్వారీలను నడిపిస్తున్నారు. చివరికి ఇటుక బట్టీలకు మట్టి తోలుకునే వారు కూడా ఈ సోదరులకు ముడుపులు ఇవ్వాల్సిందే. కాగా, ఈ ఇద్దరు సోదరుల్లో ఒకరు ఆరు నెలల నుంచి ఆమెకు దూరంగా ఉంటున్నారు. ఆర్థిక లావాదేవీల విషయంలో తేడాలు వచ్చి ఆయన దూరమైనట్టు ప్రచారం జరుగుతోంది.
- మంత్రికి దూరంగా ఉంటున్న ఓ సోదరుడు నియోజకవర్గంలో.. ఓ మున్సిపల్ చైర్మన్ పదవిని ఇప్పిస్తానని చెప్పి ఒకరి నుంచి పెద్ద మొత్తంలో వసూలు చేశారు. ఇప్పుడు పదవి గురించి అడుగుతుంటే "మంత్రితో నాకు మాటలు లేవు. చూద్దాం లే" అని తప్పించుకుంటున్నట్లు పదవిని ఆశించి సొమ్ములిచ్చిన వ్యక్తి వాపోతున్నారు. ఇలా ఒక్కరి నుంచే కాదు.. పదవుల ఆశ చూపి చాలా మంది నుంచి ఆ సోదరుడు సొమ్ములు నొక్కేశారని స్థానికంగా చర్చసాగుతోంది.
- ఈ ప్రాంతంలో తహసీల్దార్‌గా పనిచేయాలంటే కచ్చితంగా ఖతర్నాక్ సోదరులకు సుమారు రూ.10 లక్షల వరకు ఇచ్చుకోవాల్సిందే. సీఐలు సహా ఇతర అధికారులు ఎవరైనా ఇక్కడ పనిచేయాలంటే స్థాయిని బట్టి రేటు నిర్ణయిస్తారు. ఆ మొత్తం వారి నుంచి వసూలు చేస్తారు. ఏ మాత్రం మాట వినకున్నా బదిలీ ఉత్తర్వులు రెడీ అవుతాయి.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

భావోద్వేగానికి లోనైన తండ్రీకూతుళ్లు



'లాల్ సలామ్' ఆడియో వేడుకలో తండ్రీకూతుళ్లు రజనీకాంత్, ఐశ్వర్య భావోద్వేగానికి లోనయ్యారు. ఊహించని ఈ పరిణామాలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. రజనీకాంత్ ప్రత్యేకపాత్రలో విష్ణు విశాల్ కథానాయకుడిగా ఐశ్వర్య రజనీకాంత్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'లాల్ సలామ్'. రీసెంట్‌గా జరిగిన ఈ చిత్రం ఆడియోవేడుకలో తన తండ్రి రజనీకాంత్‌పై వస్తున్న ట్రోల్స్‌పై ఐశ్వర్య స్పందిస్తూ.. 'ఈ మధ్యకాలంలో మా నాన్నని కొందరు 'సంఘీ' అంటూ విమర్శిస్తున్నారు. ఏదోఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇచ్చేవారిని 'సంఘీ' అంటారని తర్వాత తెలిసింది. ఈ వేదిక సాక్షిగా చెబుతున్నాను. మా నాన్న 'సంఘీ' కాదు. ఆయన అలాంటివారైతే నా 'లాల్ సలామ్'లో నటించేవారే కాదు. మొదట్నుంచీ సోషల్‌మీడియాకు నేను దూరం. ఇందులో వచ్చే విష ప్రచారాల గురించి నా టీమ్ ద్వారా తెలుసుకుంటూవుంటాను. మేమూ అందరిలాంటివాళ్లమే. కాస్త కంట్రోల్లో ఉండండి..' అంటూ భావోద్వేగానికి లోనయ్యారు ఐశ్వర్య. అదే వేడుకలో రజనీకాంత్ మాట్లాడుతూ.. 'విజయ్ నా బిడ్డలాంటి వాడు. నా కంటిముందు పెరిగిన వాడు. టాలెంట్‌తో, పట్టుదలతో కష్టపడి ఈ స్థాయికి వచ్చినవాడు. అతడ్ని టార్గెట్ చేస్తూ నేను మాట్లాడాననీ, 'జైలర్' ఈవెంట్‌లో 'అర్థమైందా రాజా..' అని నేను అన్నది విజయ్‌నే ననీ, విజయ్‌పై పరోక్షంగా మాటల దాడి చేశానని ఇష్టం వచ్చినట్టు రాశారు. యూట్యూబ్ ఛానల్స్‌లో వీడియోలు కూడా పెట్టారు. నిజంగా చాలా బాధపడ్డాను. నా అభిమానులకు నేను చెప్పేదొక్కటే. నేను ఎవరికీ పోటీ కాదు. నాకెవరూ పోటీ లేరు. నాకు నేనే పోటీ. నన్ను వేరేవాళ్లతో పోల్చి చూడొద్దు' అంటూ ఉద్వేగంగా మాట్లాడారు రజనీకాంత్.



మెగా కోడలా.. మజాకా..

లావణ్య త్రిపాఠి, వరుణ్ ప్రేమించి పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. అయితే.. ఏనాడో ప్రేమలో పడ్డ ఈ జంట.. వారి ప్రేమ వ్యవహారం బయటికి పొక్కకుండా చాలా జాగ్రత్తలు తీసుకున్నారు. ఒక్కసారంటే ఒక్కసారి కూడా మీడియా కెమెరాలకు వీరిద్దరూ చిక్కకపోవడం నిజంగా గ్రేట్. ఏదిఏమైనా పెద్దల అంగీకారంతో ఇద్దరూ పెళ్లాడేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికరంగా తన పెళ్లి ముచ్చట్లను చెప్పుకొచ్చారు మెగా కోడలు లావణ్య త్రిపాఠి. ఈ సందర్భంలో 'ఇంతకీ ఆడపడుచు కట్నం ఎంతిచ్చారేంటి?' అని యాంకరమ్మ అడిగిన ప్రశ్నకు లావణ్య సమాధనమిస్తూ.. 'తనకు నేనేం ఇవ్వలేదు. తను మా ఇంటి పిల్ల. కావాలంటే తనకు ఏమైనా ఇస్తాను. ఈ మధ్య నిహారిక సొంతగా ప్రొడక్షన్ స్టార్ట్ చేసిందికదా.. మంచి కథ ఉంటే తన బ్యానర్‌లో పైసా తీసుకోకుండా నటిస్తాను కూడా' అంటూ చెప్పుకొచ్చారు లావణ్య త్రిపాఠి. లావణ్య సమాధానం విన్న మెగాఫ్యాన్స్. 'మెగా కోడలా మజాకా..' అంటూ కితాబులిచ్చేస్తున్నారట.

రాధిక కామెంట్ ఆ సినిమా గురించేనా?..



సీనియర్ నటి రాధిక తన ఎక్స్(ట్విటర్)లో పెట్టిన చిన్న కామెంట్ ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశమైంది. 'ఈ మధ్య ఏ సినిమా అయినా మీకు చీరాకు పుట్టించిందా..? నాకైతే ఓ సినిమా చాలా చిరాకు పుట్టించింది. మధ్యలోనే ఆపేయాలన్నంత కోపం తెప్పించింది' అంటూ సినిమా పేరు చెప్పకుండా ఎక్స్(ట్విటర్)లో కామెంట్ పెట్టారు రాధిక. అప్పట్నుంచి మొదలైంది నెటిజన్స్‌లో మథనం. రాధిక మాట్లాడింది ఫలానా సినిమా గురించని కొందరు, కాదు ఫలానా సినిమా గురించని మరికొందరు. అయితే ఎక్కువమంది ఓట్లు మాత్రం 'యానిమల్' సినిమాకే పడ్డాయి. రాధిక మాట్లాడింది కచ్చితంగా 'యానిమల్' గురించే అయ్యుంటుందని చాలామంది అనుమానం వెలిబుచ్చారు. ఆ అనుమానాలను బలపరిచే అంశం కూడా లేకపోలేదు. ఈ గణతంత్రదినోత్సవం సందర్భంగా ఈ నెల 26న 'యానిమల్' ఓటీటీ స్ట్రీమింగ్ మొదలైంది. ఈ నేపథ్యంలో రాధిక నుంచి ఈ కామెంట్ రావడంతో ఆమె మాట్లాడింది 'యానిమల్' గురించేనని చాలామంది అంటున్నారు. రాధిక కూడా ఈ విషయంపై మౌనంగా ఉండటం గమనార్హం.

ఊహలకందని ఫాంటసీ విశ్వంభర

సోషియో ఫాంటసీలు చిరంజీవికి కొత్తేం కాదు. పున్నమినాగు, యముడికిమొగుడు, జగదేకవీరుడు-అతిలోక సుందరి, అంజి.. ఈ సినిమాలన్నీ ఫాంటసీ సినిమాలే. ఓ విధంగా చెప్పాలంటే ఇప్పుడున్న హీరోల్లో చిరంజీవి చేసినన్ని ఫాంటసీ సినిమాలు ఏహీరో చేయలేదన్నది నిజం. అలాంటి సూపర్‌స్టార్‌తో సోషియో ఫాంటసీ తీస్తున్నాడు దర్శకుడు వశిష్ఠ. ఆయన తీసిన గత చిత్రం 'బింబిసార' కూడా సోషియో ఫాంటసీనే కావడం విశేషం. మరి మెగాస్టార్‌తో చేస్తున్న



'విశ్వంభర'లో కొత్తదనం ఏంటి? ఈ ఫాంటసీ కథ నేపథ్యం ఏంటి? అనేది ఇప్పుడు అభిమానుల్లో తలెత్తుతున్న ప్రశ్న. హీరో అయిదు లోకాలు తిరుగుతాడని, అయిదుగురు హీరోయిన్లు ఉంటారని, దేవకన్యల నేపథ్యంలో ఎన్టీయార్ 'జగదేకవీరునికథ' లాగా ఉంటుందని చాలామంది వార్తలు రాశారు కూడా.



కానీ.. వశిష్ఠ తీసుకున్న కాన్సెప్ట్ వీటన్నింటికీ అతీతమైందని తెలుస్తోంది. ఊహలకు అందని స్థాయిలో ఈ ఫాంటసీ కథ ఉంటుందని యూనిట్ వర్గాల టాక్. దేవలోకాలూ, దేవకన్యలూ ఈ సినిమా ఉండరట. ఓ కొత్త జానర్‌లో సృష్టి నేపథ్యంలో రోమాంచితమైన సన్నివేశాలతో, వెండితెరపై మునుపెన్నడూ చూడనటువంటి పాత్రలతో మరో లోకంలోకి తీసుకెళ్లేలా 'విశ్వంభర' ఉండబోతోందని సమాచారం. మిగతా వివరాలు తెలియాల్సివుంది.

అభిషేక్ పోస్ట్ ఐశ్వర్య గురించేనా?..



సోషల్ మీడియా పుణ్యమా అని చిన్న హింట్ దొరికితే చాలు, వార్తలు రాసేయడం కొందరు నెటిజన్స్‌కి పరిపాటైపోయింది. చేతిలో ఫోన్ ఉన్న ప్రతివాడూ ఇప్పుడు జర్నలిస్టే అన్నట్టు తయారైంది ప్రపంచం. అభిషేక్, ఐశ్వర్య వైవాహిక సంబంధంపై గత కొన్ని రోజులుగా రకరకాల వార్తలు వినిపిస్తూనేవున్నాయి. వాళ్లు విడివిడిగా బతుకుతున్నారనీ, లీగల్‌గా తెగతెంపులు చేసుకోవడమే ఆలస్యం అనీ.. రకరకాలుగా వార్తలు సోషల్‌మీడియా వండి వారుస్తోంది. వాటన్నింటినీ బ్రేక్ చేస్తూ ఇటీవలే తన కుమార్తె స్కూల్ ఫంక్షన్‌కి హాజరయ్యారు ఐశ్వర్యరాయ్. అలాగే ప్రో కబడ్డీ ఈవెంట్‌కి తన మామ అమితాబ్‌తో కలిసి హాజరై నెటిజన్స్ నోళ్లు మూయించారామె. ఇదిలావుంటే.. ఇటీవల ఓ ప్రైవేటు వేడుకకు హాజరైన అభిషేక్, తన పెళ్లి ఉంగరం లేకుండా కనిపించారు. దాంతో ఇప్పుడది కొత్త చర్చకు దారితీసింది. ఎప్పుడూ ఉంగరంతో కనిపించే అభిషేక్ ఇప్పుడు ఉంగరం లేకుండా ఎందుకు బయటకొచ్చారంటూ వార్తలు రాయడం మొదలుపెట్టారు. దీనికి ఆజ్యం పోస్తూ.. తన ఇన్‌స్టాలో ఓ పోస్ట్ పెట్టాడు అభిషేక్. ' పరాజయం కలలను నాశనం చేస్తుంది.. కానీ ఆ ఓటమిని గుణపాఠంగా తీసుకుని ముందుకెళ్తే, కలలు నిజమవుతాయ్' అనేది ఆ పోస్ట్ సారాంశం. ఈ పోస్ట్ కూడా ఐశ్వర్యను దృష్టిలో పెట్టుకొనే అభిషేక్ పెట్టాడని కొందరి వాదన. మరి వీటికి బ్రేక్ ఎప్పుడు పడుతుందో చూడాలి.

హనుమంతుడిగా సన్నీడియోల్



బాలీవుడ్ దర్శకుడు నితీశ్ తివారి రామాయణ గాథను తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. శ్రీరాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్, విభీషణుడిగా విజయ్ సేతుపతి నటించే ఈ చిత్రం షూటింగ్ మార్చి నెలలో ప్రారంభమై మే నెలాఖరు వరకూ జరుగుతుంది. మొత్తం రామాయణ కథను మూడు భాగాలుగా ప్రేక్షకులకు అందించనున్నారు నితిన్ తివారీ. అయోధ్యలో రామమందిరం ప్రారంభం కావడంతో దేశమంతా ఇప్పుడు రామనామం ప్రతిధ్వనిస్తోంది. ఇటువంటి చారిత్రక నేపథ్యంలో అందరి దృష్టీ ఇప్పుడు నితిన్ 'రామాయణ్' చిత్రం మీదే ఉంటుందనడంలో సందేహం లేదు. రామాయణ గాథలో మరో కీలకమైన పాత్ర హనుమంతుడు. ఈ పాత్రను ఎవరు పోషిస్తారా అని చాలామంది ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే అంతకుముందు నటుడు దారాసింగ్ హనుమంతుడి పాత్రను అద్భుతంగా పోషించి ప్రశంసలు అందుకున్నారు. ఈ తరం నటుల్లో అటువంటి శక్తిమంతమైన పాత్రను ఎవరు పోషిస్తారా అని అందరూ అనుకుంటున్న తరుణంలో 'నేను' అంటూ ముందుకు వచ్చారు సన్నీడియోల్. ఇటువంటి పాత్రను పోషించే అవకాశం జీవితంలో ఒక్కసారే వస్తుంది కనుక దాన్ని మిస్ చేసుకోకూడదని సన్నీ భావించి అంగీకరించినట్లు సమాచారం. మే నెలలో హనుమంతుడి గెటప్ వేసుకుని సన్నీ కెమెరా ముందుకు వస్తారట. 2025 దీపావళికి ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలన్నది నిర్మాతల ఆలోచన.


రూ. 100 కోట్లు.. పదిహేనోసారి!



బాలీవుడ్‌లో ప్రస్తుతం దీపికా పదుకోన్ పేరు మారుమోగిపోతోంది. వరుస విజయాలతో మిగిలిన హీరోయిన్ల కంటే ఆమె ముందు ఉన్నారు. బాలీవుడ్‌లో ప్రస్తుతం అత్యధిక పారితోషికం తీసుకుంటున్న హీరోయిన్ కూడా దీపికనే. ఆమె తాజా చిత్రం 'ఫైటర్' కూడా బాక్సాఫీసును దున్నేస్తోంది. హృతిక్ రోషన్ హీరోగా నటించిన ఈ చిత్రం విడుదలైన మూడు రోజులకే ప్రపంచ వ్యాప్తంగా రూ. 100 కోట్లు వసూలు చేసి రికార్డ్ సృష్టించింది. 'ఫైటర్' సినిమాతో మరో రికార్డ్ నెలకొల్పారు దీపిక. అదేమిటంటే ఆమె ఇంతవరకూ 25 చిత్రాల్లో నటిస్తే, వాటిల్లో 15 సినిమాలు రూ. వంద కోట్లు సాధించాయి. ఆమె కెరీర్‌లో ప్రపంచ వ్యాప్తంగా రూ. వంద కోట్లు సాధించిన తొలి చిత్రం 'ఓం శాంతి ఓం'. 2007లో దీపావళి సందర్భంగా విడుదలైన ఈ సినిమా సాధించిన విజయం ఆమె కెరీర్‌కు బలమైన పునాది వేసింది. ప్రభాస్ హీరోగా నటిస్తున్న 'కల్కి 2898 ఎడి' చిత్రంలో దీపిక నటిస్తోంది. వైజయంతీ మూవీస్ సంస్థ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న ఈ సినిమాతోనే దీపిక తెలుగు చిత్రపరిశ్రమలోకి అడుగుపెడుతున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు ఈ చిత్రంలో.

ఫ్లాష్‌బ్యాక్

రాజబాబుని విభిన్నంగా చూపించిన తిరపతి



హాస్యనటుల్లో రాజబాబుది ఓ శకం. ఓ దశాబ్దం పాటు ఆయన చిత్ర పరిశ్రమను ఏలేశారు. తెరపై ఆయన కనిపిస్తే చాలు జనం ఆనందంతో ఈలలు వేసేవారు. గోలగోల చేసేవారు. సినిమాలో హీరో ఎవరైనా హాస్యనటుడిగా మాత్రం రాజబాబు ఉండాల్సిందే. ఆ రోజుల్లో ఆయనకు ఉన్న ఫాలోయింగ్, పాపులారిటీ అలాంటిది. దర్శకుడు దాసరి నారాయణరావు, రాజబాబు మధ్య చక్కని అనుబంధం ఉండేది. దాసరిని ఆయన 'బావా' అని పిలిచేవారు.

ఇటువంటి పాపులర్ కమెడియన్‌ను 'తాత-మనవడు' చిత్రంతో హీరోగా పరిచయం చేశారు దాసరి. దర్శకుడిగా దాసరికి అదే తొలి చిత్రం. 'తాత-మనవడు' చిత్రం ఘన విజయం సాధించింది. ఆ తర్వాత దాసరి దర్శకత్వంలోనే రాజబాబు మరోసారి 'తిరపతి' చిత్రంలో హీరోగా నటించారు.

రాజబాబునీ, ఆయన టాలెంట్‌ను దృష్టిలో పెట్టుకుని 'తిరపతి' పాత్ర తయారు చేశారు దాసరి. వయసు వచ్చినా మానసికంగా ఎదగని పాత్ర అది. తిరపతి పుట్టినప్పుడు పుట్టెంట్రుకలు తిరుపతిలో ఇవ్వాలని అతని తల్లి అనుకుంటుంది. అయితే ఎప్పటికప్పుడు తిరుపతి ప్రయాణం వాయిదా పడుతుంటుంది. చివరికి 25 ఏళ్లు వచ్చినా ఆ మొక్కు తీరక పోవడంతో జుట్టు బాగా పెరగడంతో జడ వేసుకుని తిరుగుతుంటాడు తిరపతి. అతనికి ఓ చెల్లెలు. ఈ పాత్రను జయసుధ పోషించారు. చెల్లెలు పెళ్లి చేయడం కోసం డబ్బు సంపాదించడానికి పట్నం వెళ్లిన తిరపతి ఎటువంటి ఇబ్బందులు పడ్డాడన్నదే మిగిలిన కథ.



ఈ సినిమాలో రాజబాబుకు బారిస్టర్ పార్వతీశాన్ని పోలిన గెటప్ ఇచ్చారు. బారెడు జడ, పంచె కట్టు, చేతిలో గొడుగు, ముఖంలో అమాయకత్వం.. విభిన్నంగా కనిపించిన రాజబాబుని చూడడానికి థియేటర్లకు ఎగబడ్డారు జనం.

ఈ సినిమాలో అల్లు రామలింగయ్య అతిథి పాత్ర పోషించారు. 'దేశం పన్నెండు సార్లు తిరిగానే నారాయణమ్మా' అనే పాటను ఆయనతోనే పాడించారు దాసరి. రామలింగయ్య, గిరిజపై ఈ పాట చిత్రీకరించారు.

1974 ఆగస్టు 15న 'తిరపతి' విడుదల కావాలి. కానీ సెన్సార్ సమస్య కారణంగా విడుదల ఆగింది. చివరకు అక్టోబర్ 5న సినిమా విడుదల చేశారు. ఆ రోజుల్లో ఎన్టీఆర్ చిత్రాలకు వచ్చే భారీ ఓపెనింగ్స్ 'తిరపతి' చిత్రానికి రావడం గమనార్హం. అయితే సినిమా అనుకున్న విధంగా విజయం సాధించలేదు.

కూతురు హీరోయిన్‌గా సీక్వెల్



దర్శకుడు శేఖర్ కపూర్ 1983లో రూపొందించిన క్లాసిక్ 'మాసూమ్'. నసీరుద్దీన్ షా , షబానా అజ్మీ, ఊర్మిళ(బాలనటి) తదితరులు ఇందులో నటించారు. ఎరిక్ సీగల్ రాసిన 'మ్యాన్, ఉమన్ అండ్ చైల్డ్' నవల ఆధారంగా ఈ చిత్రం రూపుదిద్దుకుంది. నలభై ఏళ్ల తర్వాత ఆ చిత్రానికి సీక్వెల్ రూపొందించనున్నారు శేఖర్ కపూర్. 'మాసూమ్.. ది న్యూ జనరేషన్' పేరుతో రూపుదిద్దుకొనే ఈ చిత్రంతో శేఖర్ కపూర్ కుమార్తె కావేరి హీరోయిన్‌గా పరిచయం కానుంది. ఈ విషయాన్ని శేఖర్‌కపూర్ మాజీ భార్య, నటి సుచిత్రా కృష్ణమూర్తి కన్‌ఫర్మ్ చేశారు. త్వరలో ఈ సినిమా గురించి శేఖర్‌కపూర్ అధికారికంగా ప్రకటించనున్నారు.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
విజయవాడ ● ఆదివారం 28 జనవరి 2024

ఏపీ గురుకులాల్లో అయిదో తరగతి అడ్మిషన్స్

తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ(ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఈఐఎస్)- రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న డా.బీ.ఆర్. అంబేద్కర్ గురుకుల విద్యాలయాల్లో అయిదోతరగతి(ఆంగ్ల మాధ్యమం)లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. బీఆర్‌ఏజీ-ఫిఫ్త్ సెట్(ప్రవేశ పరీక్ష)2024 ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఈ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు. విద్యార్థులు తమ సొంత జిల్లా గురుకులంలో ప్రవేశానికి మాత్రమే అప్లయ్ చేసుకోవాలి. విద్యార్థులు తాము చేరదలచుకొన్న గురుకుల పాఠశాల వివరాలను దరఖాస్తులో నమోదు చేయాలి. దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన తరవాత మార్పులకు అవకాశం లేదు. ఈ గురుకులాల్లో చేరిన బాలబాలికలకు విద్య, వసతి పూర్తిగా ఉచితం. క్రీడలు సహా వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన శిక్షణ అందిస్తారు.



అర్హత: ప్రభుత్వ/గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2022-23 సంవత్సరంలో మూడోతరగతి పూర్తిచేసి 2023-24 సంవత్సరంలో(ప్రస్తుతం) నాలుగోతరగతి చదువుతున్న బాలురు, బాలికలు దరఖాస్తు చేసుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.1,00,000 మించరాదు.

వయసు: జనరల్, బీసీ, కన్వర్టెడ్ క్రిస్టియన్ విద్యార్థులు 2013 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2011 సెప్టెంబరు 1 నుంచి 2015 ఆగస్టు 31 మధ్య జన్మించి ఉండాలి.

సీట్ల వివరాలు: రాష్ట్రంలో జిల్లాలవారీగా ఉన్న 186 గురుకులాల్లో మొత్తం 15,020 సీట్లు ఉన్నాయి. ఎస్సీ అభ్యర్థులకు 11,266 సీట్లు, కన్వర్టెడ్ క్రిస్టియన్లకు 1876, ఎస్టీ అభ్యర్థులకు 938, బీసీ అభ్యర్థులకు 752, జనరల్ అభ్యర్థులకు 188 సీట్లు కేటాయించారు.

రిజర్వేషన్ వివరాలు: ఎస్సీ విద్యార్థులకు 75 శాతం, బీసీ-సీ(కన్వర్టెడ్ క్రిస్టియన్) విద్యార్థులకు 12 శాతం, ఎస్టీ విద్యార్థులకు 6 శాతం, బీసీ విద్యార్థులకు 5 శాతం, ఇతరులకు 2 శాతం సీట్లు ప్రత్యేకించారు.

- కర్మాగారాల్లో పని నుంచి తీసేసిన పిల్లలు, అనాథలు, సైనికోద్యోగుల పిల్లలకు 15 శాతం; వికలాంగులకు 3 శాతం సీట్లు కేటాయించారు. వీరు సంబంధిత సర్టిఫికెట్‌ను దరఖాస్తుకు జతచేయాలి.
- ప్రతి కేటగిరీలో 3 శాతం సీట్లను సఫాయి కర్మచారి విద్యార్థులకు ప్రత్యేకించారు.
- ఏదైనా కేటగిరీలో సీట్లు మిగిలితే వాటిని ఎస్సీ విద్యార్థులకు కేటాయిస్తారు.

బీఆర్‌ఏజీ-ఫిఫ్త్ సెట్ 2024 వివరాలు: పరీక్షని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. తెలుగు, ఇంగ్లీష్, మేథమెటిక్స్ సబ్జెక్టులనుంచి ఒక్కోదానిలో 10; ఈవీఎస్‌లో సైన్స్, సోషల్ సబ్జెక్టుల నుంచి ఒక్కోదానిలో 10 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు అడుగుతారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్దేశించిన నాలుగోతరగతి సిలబస్ ప్రకారం ప్రశ్నలు ఉంటాయి. విద్యార్థులు సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద బ్లూ/బ్లాక్ పెన్‌తో గుర్తించాలి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు నిర్దేశించారు. మొత్తం మార్కులు 50. నెగెటివ్ మార్కులు లేవు. ప్రశ్నపత్రాన్ని ఇంగ్లీష్, తెలుగు మాధ్యమాల్లో ఇస్తారు.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు ఫీజు లేదు
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 23
- **హాల్ టికెట్స్ డౌన్‌లోడింగ్:** మార్చి 3 నుంచి
- **బీఆర్‌ఏజీ-ఫిఫ్త్ సెట్ 2024 తేదీ:** మార్చి 10
- **వెబ్‌సైట్:** https://apbragcet.apcfss.in

ఐఐటీ గాంధీనగర్‌లో స్పెషల్ పీహెచ్‌డీ

గాంధీనగర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ జీఎన్) - స్పెషల్ పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని దివ్యాంగులు, ఓబీసీ(ఎన్‌సీఎల్), ఎస్సీ, ఎస్టీ కేటగిరీల అభ్యర్థులకు ఉద్దేశించారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.



విభాగాలు: బయలాజికల్ సైన్సెస్ అండ్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, కాగ్నిటివ్ అండ్ బ్రెయిన్ సైన్సెస్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్-ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఎర్త్ సైన్సెస్-ఎర్త్ సిస్టమ్స్ సైన్స్-ఆర్కియలాజికల్ సైన్సెస్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్-సొసైటీ అండ్ కల్చర్, మెటీరియల్స్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, మెకానికల్ ఇంజనీరింగ్, ఫిజిక్స్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి సంబంధిత విభాగంలో కనీసం 55/60 శాతం మార్కులతో ఎంఏ/ఎమ్మెస్సీ/బీటెక్/ఎంటెక్/బీఎస్(ఐసర్/ఐఐఎస్సీ)/బీఎస్-ఎంఎస్(ఐసర్) ఉత్తీర్ణులై ఉండాలి. నెట్/గేట్ అర్హత ఉన్నవారికి; సీఎఫ్‌టీఐ సంస్థల నుంచి కనీసం 8 సీజీపీఏతో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులకు; ఐఐటీలు, ఐసర్లు, ఐఐఎస్సీ నుంచి 8 సీజీపీఏతో పీజీ/ఎంఎస్ పూర్తిచేసినవారికి సంస్థ ఫెలోషిప్ ఇస్తుంది.

ఫెలోషిప్: మొదటి రెండేళ్ల నెలకు రూ.37,000; తరవాత నెలకు రూ.42,000ల ఫెలోషిప్ చెల్లిస్తారు. విదేశీ యూనివర్సిటీల్లో నాలుగు నుంచి ఆర్నెల్లపాటు రీసెర్చ్ వర్క్ చేసేందుకుగాను 12,500 యూఎస్ డాలర్లు ఇస్తారు. ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్‌లలో రీసెర్చ్ వర్క్ ప్రజంటేషన్ కోసం రూ.2,00,000 వరకు ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** ఓబీసీ అభ్యర్థులకు రూ.300; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.150
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 21
- **ఇంటర్వ్యూకి ఎంపికైనవారి లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 3
- **ఇంటర్వ్యూలు, రిటెన్ టెస్ట్:** ఏప్రిల్ 8 నుంచి 22 వరకు
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** మే 15
- **వెబ్‌సైట్:** iitgn.ac.in

ఎన్‌పీటీఐలో ఎంబీఏ పవర్ మేనేజ్‌మెంట్

ఫరీదాబాద్‌లోని సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ మేనేజ్‌మెంట్ అండ్ పవర్ స్టడీస్(ఎన్‌పీటీఐ)- ఎంబీఏ ఇన్ పవర్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. మొత్తం 120 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 41, ఎస్సీ అభ్యర్థులకు 16, ఎస్టీ అభ్యర్థులకు 8, ఓబీసీ(ఎన్‌సీఎల్) అభ్యర్థులకు 28, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 12, స్పాన్సర్డ్ అభ్యర్థులకు 15 సీట్లు కేటాయించారు. జాతీయ పరీక్ష స్కోర్/ఎన్ఏటీ 2024 స్కోర్, గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ, కౌన్సెలింగ్‌ల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్/మ్యాట్/ఎక్స్‌ఏటీ/సీమ్యాట్/జీమ్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి. లేని పక్షంలో ఎన్‌పీటీఐ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్(ఎన్ఏటీ) 2024 రాయాల్సి ఉంటుంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు ఎటువంటి స్కోర్ అవసరం లేదు. వీరికి నిర్దేశించిన మేరకు అనుభవం తప్పనిసరి.

వెయిటేజీ: జాతీయ పరీక్ష స్కోర్/ఎన్ఏటీ 2024 స్కోర్‌కు 70 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కి 10 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

- స్పాన్సర్డ్ అభ్యర్థుల ఎంపికలో అకడమిక్ ప్రతిభకు 60 శాతం, గ్రూప్ డిస్కషన్ స్కోర్‌కు 20 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌కి 10 శాతం, అనుభవానికి గరిష్ఠంగా 10 శాతం వెయిటేజీ ఇస్తారు.



- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఏటీ) 2024 రాసేవారికి మార్చి 4; జాతీయ పరీక్ష స్కోర్ ఉన్నవారికి ఏప్రిల్ 10
- **ఎన్‌పీటీఐ అడ్మిషన్ టెస్ట్(ఎన్ఏటీ) 2024 తేదీ:** మార్చి 12
- **ఎన్ఏటీ ఫలితాలు విడుదల:** మార్చి 19
- **గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 27, 28
- **కౌన్సెలింగ్:** మే 29
- **వెబ్‌సైట్:** www.npti.gov.in

జాబ్ కార్నర్

బీడీఎల్‌లో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

ఖాళీలు 361

భారత ప్రభుత్వరంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్)... నాలుగేళ్ల ఫిక్స్‌డ్ టర్మ్(కాంట్రాక్ట్) ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది. ఇంటర్వ్యూకు హాజరు కాబోయే అభ్యర్థులు ఫిబ్రవరి 14 లోపు సంస్థ వెబ్‌సైట్‌లో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

పని ప్రదేశం: బీడీఎల్ కార్పొరేట్ ఆఫీస్(హైదరాబాద్), బీడీఎల్ కంచన్‌బాగ్ యూనిట్(హైదరాబాద్), బీడీఎల్ ప్రాజెక్ట్ ఆఫీస్ ఏడీఈ(బెంగళూరు), భానూర్ యూనిట్(సంగారెడ్డి జిల్లా), విశాఖపట్నం యూనిట్ (ఆంధ్రప్రదేశ్).

1. ప్రాజెక్ట్ ఇంజనీర్/ఆఫీసర్: **136 పోస్టులు**
2. ప్రాజెక్ట్ డిప్లొమా అసిస్టెంట్/అసిస్టెంట్: **142 పోస్టులు**
3. ప్రాజెక్ట్ ట్రేడ్ అసిస్టెంట్/ఆఫీస్ అసిస్టెంట్: **83 పోస్టులు**

విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, కెమికల్, ఎన్విరాన్‌మెంట్, హ్యూమన్ రిసోర్స్, ఫైనాన్స్, సివిల్, మెటలర్జీ, ఫిట్టర్, రేడియో మెకానిక్, టర్నర్, వెల్డర్, ఎలక్ట్రో ప్లేటింగ్, కంప్యూటర్స్, ఎలక్ట్రీషియన్, మిల్ రైట్, డీజిల్ మెకానిక్, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండీషనింగ్, ప్లంబర్.

అర్హత: సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఈ, బీటెక్, బీఎస్సీ, డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ ఎంఈ, ఎంటెక్, ఎంబీఏ, ఎంఎస్‌డబ్ల్యూ, పీజీ డిప్లొమా, సీఏ/ఐసీడబ్ల్యూఏఐ/సీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: ఫిబ్రవరి 14 నాటికి 28 సంవత్సరాలు మించకూడదు

వేతనం: నెలకు ప్రాజెక్ట్ ఇంజనీర్/ప్రాజెక్ట్ ఆఫీసర్‌కు రూ.30,000- రూ.39,000. ప్రాజెక్ట్ డిప్లొమా అసిస్టెంట్/ప్రాజెక్ట్ అసిస్టెంట్‌కు రూ.25,000- రూ.29,500. ప్రాజెక్ట్ ట్రేడ్ అసిస్టెంట్/ప్రాజెక్ట్ ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.23,000- రూ.27,500.

ఎంపిక ప్రక్రియ: విద్యార్హతలో సాధించిన మార్కులు, పని అనుభవం, ఇంటర్వ్యూ ఆధారంగా

ఇంటర్వ్యూ తేదీలు: 2024 ఫిబ్రవరి 17, 18, 21, 22, 25

వేదిక: బీడీఎల్ కంచన్‌బాగ్(హైదరాబాద్), బీడీఎల్ భానూర్(సంగారెడ్డి), బీడీఎల్ విశాఖపట్నం యూనిట్.

వెబ్‌సైట్: https://bdl-india.in/

ఎన్‌ఎల్‌సీలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 632

నైవేలి(తమిళనాడు)లోని నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్)...కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. గ్రాడ్యుయేట్ అప్రెంటిస్: **314**
2. టెక్నీషియన్(డిప్లొమా) అప్రెంటిస్: **318**

విభాగాలు: మెకానికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, కెమికల్ ఇంజనీరింగ్, మైనింగ్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్, ఫార్మసీ.

శిక్షణ వ్యవధి: ఏడాది

స్టయిపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.15028; టెక్నీషియన్ అప్రెంటిస్‌కు రూ.12524

అర్హతలు: సంబంధిత విభాగంలో ఇంజనీరింగ్ లేదా టెక్నాలజీలో డిప్లొమా/డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

ఎంపిక: అకడమిక్ స్కోరు ఆధారంగా

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 31

అభ్యర్థుల ఎంపిక జాబితా వెల్లడి: ఫిబ్రవరి 19

అప్రెంటిస్‌షిప్ ప్రవేశ తేదీలు: ఫిబ్రవరి 23 నుంచి 29 వరకు

వెబ్‌సైట్: https://www.nlcindia.in/

ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్లు

ఖాళీలు 38



న్యూఢిల్లీలోని బసాయిదరాపూర్‌లోని ఈఎస్‌ఐసీ మెడికల్ కాలేజీ... తాత్కాలిక ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూ నిర్వహిస్తోంది.

పోస్టులు: ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్

విభాగాలు: సంబంధిత విభాగంలో పీజీ, పీహెచ్‌డీతో పాటు టీచింగ్/రీసెర్చ్ విభాగంలో పని అనుభవం తప్పనిసరి.

వేతనం: నెలకు ప్రొఫెసర్‌కు రూ.2,22,543, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,47,986, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,27,141.

ప్రదేశం: డీన్ ఆఫీస్, 5వ ఫ్లోర్, ఎంఎస్ ఆఫీస్ బిల్డింగ్, ఈఎస్‌ఐ-పీజీఐఎమ్ఎస్ఆర్, బసాయిదరాపూర్, న్యూఢిల్లీ.

వెబ్‌సైట్: https://esic.gov.in/

కడపలో జనరల్ డ్యూటీ అటెండెంట్‌లు

ఖాళీలు 68

కడపలోని జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం...వైఎస్ఆర్ జిల్లా ఆరోగ్య సంస్థల్లో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. జనరల్ డ్యూటీ అటెండెంట్: **50 పోస్టులు**
2. డేటా ఎంట్రీ ఆపరేటర్: **4 పోస్టులు**
3. బార్బర్: **2 పోస్టులు**
4. ధోబీ: **2 పోస్టులు**
5. జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ అసిస్టెంట్: **4 పోస్టులు**
6. ఓ.టీ.అసిస్టెంట్: **6 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, డిగ్రీ, డిప్లొమా, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 42 సంవత్సరాలు

దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ దరఖాస్తులను ప్రిన్సిపాల్, ప్రభుత్వ మెడికల్ కాలేజీ, పుట్లంపల్లి, కడప, వైఎస్ఆర్ జిల్లా చిరునామాకు పంపించాలి.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 30

వెబ్‌సైట్: kadapa.ap.gov.in/

లిటిల్స్



మీకు తెలుసా?


చూడచక్కని అందం.. పసుపు పచ్చరంగు.. నల్లటి చుక్కల శరీరం.. పక్కన రెక్కలు.. చూడటానికి ఓ పెట్టెలా ఉండే ఈ చేపను 'ఎల్లో బాక్స్ ఫిష్' అని పిలుస్తారు.

- పది ఇంచుల నుంచి 24 ఇంచుల పొడవు ఉంటుంది.
- హిందూ మహాసముద్రం, అరబిక్ మహాసముద్రం, అట్లాంటిక్ మహాసముద్రంలో ఇవి కనపడతాయి.
- నాచు, చిన్న చేపలను తిని బతికే ఈ చేపకు అద్భుతమైన డిఫెన్స్ మెకానిజం వీటికి ఉంటుంది.




- ఆస్ట్రాటాక్సిన్ అనే పదార్థాన్ని వెదజల్లుతుంది. ఇది నీటిలోకి చేరిన తర్వాత విషంగా మారుతుంది. మనిషి లేదా ఏ ఇతర జీవుల రక్తకణాలపై దీని ప్రభావం ఉంటుంది. అందుకే అందంగా ఉందని దీన్ని తాకినా.. లేక ఈ మాంసాన్ని తిన్నా మనుషులకు ప్రమాదమే మరి.
- చిన్న నోరు ఉండే ఈ చేపకు ఏమి దొరికినా గుటుక్కున మింగేస్తుంది. ఇంతకీ ఈ చేప ఇలా పెట్టెలా ఉండటానికి కారణం దాని శరీరంలోని ఎముకల నిర్మాణమే కారణం.
- సాల్ట్‌వాటర్‌లోనే ఉండే ఈ చేపను ఇంట్లో కూడా పెంచుకోవచ్చు. అయితే దాని ముట్టుకోవటం చేయకూడదు. కేవలం అందం కోసం ఆక్వేరియంలో పెంచుకోవచ్చు.
- ఇవి నిదానంగా ఈదుతాయి. అందుకే చూడటానికి అందంగా కనపడతాయి.
- డైట్ విషయంలో కూడా జాగ్రత్తగా ఉంటాయి. ముఖ్యంగా సముద్రంలో ఉండే రాళ్లను పళ్లతో పట్టుకుని వేలాడుతుంటాయి.
- ఇవి పదేళ్ల వరకూ జీవిస్తాయి.
- మనదేశంలోని లక్షద్వీప్, అండమాన్ నికోబార్, కేరళ తీర ప్రాంతాల్లో కూడా ఈ చేపలు నివసిస్తాయి.
- మెర్సిడెస్ బెంజ్‌కార్ ఈ చేప స్ఫూర్తితో బయోనిక్ కార్‌ను తయారు చేయటం విశేషం.
- కొన్ని చేపలకు కొమ్ములు కూడా ఉంటాయి.
- వయసు పెరిగే కొలదీ వాటికి ఉండే పసుపుపచ్చ రంగు షేడ్ తగ్గుతుంది.





దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 215

	6		7	1	4			2
	5							4
				6		3		7
			4			8	3	
			5		6			
	3	2			9			
3		7		5				
2							5	
5			9	7	3		2	

సుడోకు - 214 సమాధానం

1	7	5	3	6	8	2	9	4
9	4	6	1	2	7	5	8	3
3	2	8	4	5	9	1	6	7
4	6	3	5	9	2	7	1	8
2	8	7	6	1	3	9	4	5
5	1	9	7	8	4	3	2	6
8	5	2	9	3	6	4	7	1
7	9	1	8	4	5	6	3	2
6	3	4	2	7	1	8	5	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.